Pubilshed from Eluru

PRGI NO : APTEL/25/A1219

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




ఏలూరు ELURU | సంపుటి : 03 | సంచిక : 09 | మంగళవారం | నవంబర్ 10, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 03 | Issue No : 09 | Tuesday | 10 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

ప్రజలు చాలా విజ్ఞులు

ప్రభుత్వ కష్టాన్ని గుర్తించారు..



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేశారని... తమ కోసం కష్టపడుతున్న ప్రభుత్వాన్ని గుర్తించి అండగా నిలిచారని అన్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. రెండున్నరేళ్ల సుపరిపాలనకు, అభివృద్ధికి ఆమోదం తెలిపారని... స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన ఘనవిజయం ప్రభుత్వ పనితీరుకు లభించిన గుర్తింపు అని చంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల ఫలితాలపై సోమవారం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు.

- అందుకేఆశీర్వదించారులిరెండున్నరేళ్ల సుపరిపాలనకు స్థానిక ఎన్నికల తీర్పు నిదర్శనం
- కొన్ని చోట్ల ఓటమిపై సమీక్ష..తప్పులు సరిదిద్దుకుంటాం
- కుప్పంలో ఓ ఎంపీటీసీ స్థానం ఓడినా..ప్రజాతీర్పును గౌరవించాం
- ప్రజల కోసం కష్టపడితే వెన్నంటే ఉంటారని నిరూపించారు
- గుడ్ గవర్నెన్స్ లీడ్స్ టు గుడ్ పాలిటిక్స్ మా విధానం
- క్షేత్రస్థాయిలో కూటమి పార్టీల ఐక్యతకు అద్దం పట్టేలా స్థానిక ఎన్నికల ఫలితాలు
- స్థానిక ఎన్నికల ఫలితాలపై మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... గుడ్ గవర్నెన్స్ లీడ్స్ టు గుడ్ పాలిటిక్స్ అన్నది తన నమ్మకమని, సుపరిపాలన అందిస్తే ప్రజలు రాజకీయంగానూ ఆదరిస్తారనడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని చెప్పారు. 2024 సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు కూటమికి ప్రజల ఆదరణ మరింత పెరిగిందని, వైసీపీని గతంలో కంటే ఎక్కువగా ప్రజలు తిరస్కరించారని తెలిపారు. పట్టణ స్థానిక సంస్థలు, పరిషత్ ఎన్నికలు.. ఈవీఎంలు, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్లు.. ఏ విధంగా చూసినా ప్రజల మద్దతు కూటమికే లభించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు కూటమి వైపు మొగ్గు చూపారని, అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, పల్నాడు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో వైసీపీ

సోజిగ్రో... 2

సుంకాల పోరుకు చైనా బ్రేక్

- అమెరికాకు మరో రెండు నెలల ఊరట !
- అమెరికా దిగుమతులపై అదనపు సుంకాల నిలిపివేతను పొడిగించిన చైనా
- మరో రెండు నెలల పాటు 24 శాతం సుంకాల నుంచి ఊరట



చైనా : అమెరికా, చైనా మధ్య కొనసాగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించే దిశగా చైనా మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై గతంలో విధించిన అదనపు 24 శాతం సుంకాల అమలును నిలిపివేసే గడువును మరో రెండు నెలల పాటు పొడిగించింది. అయితే ప్రాథమికంగా విధిస్తున్న 10 శాతం సుంకాన్ని మాత్రం కొనసాగించనున్నట్లు స్పష్టం చేసింది.

2 సోజిగ్రో...

మరో 30 ఏళ్లకు సరిపోయేలా కొత్త నాయకత్వాన్ని తయారుచేశాం

- అందుకే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం...
- 58.9 శాతం ఓట్లతో ఘన విజయం
- 2024 ఎన్నికలతో పోలిస్తే 3.6 శాతం పెరిగిన ఓట్ల వాటా
- 100 పట్టణ స్థానిక సంస్థల్లో 94 చోట్ల పాగా... 3,941 వార్డుల్లో 3,233 కైవసం
- పల్లెల్లోనూ అదే జోరు... ఒక్క జెడ్పీ మినహా 27 జెడ్పీలు కూటమి కైవసం
- మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, యువతకు నాయకత్వంలో పెద్దపీట
- స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, ఫలితాల విశ్లేషణలను వివరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు ఘన విజయం సాధించాయని, 2024 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ప్రజల్లో కూటమి ఆదరణ మరింత పెరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎన్నికల ఫలితాలు, వివిధ స్థాయిల్లో కూటమి సాధించిన విజయాలు, అభ్యర్థుల ఎంపికలో అనుసరించిన విధానం, సామాజిక ప్రాతినిధ్యానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో గణాంకాలతో సహా వివరించారు.

- మిగతా 2లో..

స్టాక్ మార్కెట్‌కు బ్యాంకుల బూస్ట్..

- లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ
- 107.25 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 58.25 పాయింట్లు లాభపడిన నిఫ్టీ
- పీఎస్‌యూ బ్యాంక్ సూచీలో 3.25 శాతం వృద్ధి
- ఐటీ సూచీ 1.56 శాతం నష్టం
- హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్ షేర్లలో భారీ పతనం



2 లో..

ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్..

- జనవరిలో ప్రకటనకు ఈసీ కసరత్తు!
- యూపీ, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్‌లలో జరగనున్న ఎన్నికలు
- షెడ్యూల్ ప్రకటనకు ముందు రాష్ట్రాల్లో పర్యటించనున్న ఈసీ పూర్తిస్థాయి బెంచ్

2 లో

పారిశ్రామిక ప్రగతికి నూతన దశదిశ

నేవిగేటింగ్ న్యూవరల్డ్ ఆర్డర్ థీమ్‌తో సీఐఐ సమ్మిట్

- వాణిజ్యం నుంచి క్వాంటం వరకూ ఆరు అంశాలపై చర్చ
- 58 దేశాల నుంచి ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధుల హాజరు
- ఇప్పటికే 6 ప్రాంతీయ సదస్సుల్లో రూ.86వేల కోట్ల ఒప్పందాలు
- నవంబరు 12, 13వ తేదీల్లో విశాఖ వేదికగా 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు అమిత్ షా, పీయూష్ గోయెల్, దిగ్గజ కంపెనీల చైర్మన్‌లు, సీఈఓలు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

నేవిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్ థీమ్‌తో విశాఖ వేదికగా ఈ నెల 12,13వ తేదీల్లో రెండు రోజుల పాటు 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు జరుగనుంది. మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు నూతన దశాదిశ అందించేలా ఈ పెట్టుబడుల సదస్సు విశాఖలో ఆవిష్కృతం కానుంది.




కేవలం పెట్టుబడుల ఆకర్షణకు మాత్రమే పరిమితం కాకుండా వాణిజ్యం నుంచి క్వాంటం వరకూ వివిధ అంశాలపై మేధోమథనం నిర్వహించి ఆ ఫలితాలను ముందుకు తీసుకెళ్లేలా ఈ భాగస్వామ్య సదస్సులో చర్చలు జరుగనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర హోం అమిత్ షా సహా కేంద్రమంత్రులు, అంతర్జాతీయ పారిశ్రామిక, వాణిజ్య దిగ్గజ కంపెనీల ప్రతినిధులు ఈ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరు కానున్నారు. దాదాపు 58 దేశాలకు చెందిన ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు కూడా ఈ సదస్సుకు హాజరయ్యేందుకు ఇప్పటికే నమోదు చేసుకున్నారు.

2 లో..

ప్రజాభూమి, కృష్ణా బ్యూరో :

కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవిని పలువురు మహారాణులు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవిని ఎన్నికల సంఘం జనరల్ మహిళలకు కేటాయించింది. ఈ ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించిన మహిళల్లో ఎక్కువ మంది ఉన్నత విద్యావంతులు కావటం విశేషం! జిల్లాలో జడ్పీటీసీలు 26 మంది వుండగా అందులో 17 మంది మహిళలు, 9మంది మగవారు వున్నారు.

కృష్ణాజిల్లా పరిషత్ చైర్మపర్సన్ పదవి ఎవరిని వరించేనో...?





గరికపాటి శ్రీలత (జనసేన)



భోగాది రమాదేవి (బీజేపీ)



విక్కుర్తి జయలక్ష్మి (తెలుగుదేశం)



తాతినేని ప్రవళిక (తెలుగుదేశం)



దండమూడి పూజిత (తెలుగుదేశం)

విజయం సాధించిన వారిలో రాజకీయ నేపథ్యం వున్న కుటుంబాల నుంచే ఎన్నికయ్యారు. జిల్లాలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు 26 వుండగా, అందులో తెలుగుదేశం, జనసేన, బీజేపీకి చెందిన వారు 24 మంది విజయం సాధించారు. మిగతా విజయం సాధించిన ఇద్దరిలో ఒక వైసీపీకి చెందిన వారు ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన వారు ఒకరు వున్నారు. ఈసారి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవిని జనరల్ మహిళకు కేటాయించారు గనుక, చైర్‌పర్సన్ పదవిని కాపు సామాజిక వర్గానికి ఇవ్వాలని పట్టుబడుతున్నారు.

2 లో

సిఐఐ సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు

మంత్రి డోలా

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

విశాఖలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సిఐఐ భాగస్వామ్య సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. సిఐఐ సదస్సు ఏర్పాట్లపై విశాఖ జిల్లా ఎంపి, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో అమరావతి నుంచి వర్చువల్‌గా సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఆయన పలు సూచనలు చేశారు.



- మిగతా 2లో..

ప్రజాభూమి

మంగళవారం, నవంబర్ 10, 2026



ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్..

జనవరిలో ప్రకటనకు ఈసీ కసరత్తు!

- యూపీ, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్‌లలో జరగనున్న ఎన్నికలు
- షెడ్యూల్ ప్రకటనకు ముందు రాష్ట్రాల్లో పర్యటించనున్న ఈసీ పూర్తిస్థాయి బెంచ్
- యూపీలో పలు దశల్లో, మిగతా రాష్ట్రాల్లో ఒకే విడతలో పోలింగ్ అంచనా
- ఇప్పటికే మూడు రాష్ట్రాల్లో డిప్యూటీ కమిషనర్ల స్థాయి పర్యటనలు పూర్తి

దేశంలో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తూ, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కసరత్తును ముమ్మరం చేసింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను రానున్న జనవరిలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ ప్రకటనకు ముందు, ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఈసీ పూర్తిస్థాయి బెంచ్ పర్యటించనుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు కమిషనర్లతో కూడిన ఈ పూర్తిస్థాయి బెంచ్, నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్‌లో తమ పర్యటనలను ప్రారంభించే అవకాశం ఉంది. ఈ పర్యటనల సందర్భంగా రాష్ట్రాల క్షేత్రస్థాయి పరిస్థితులను, ఎన్నికల సన్నద్ధతను సమీక్షిస్తారు. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులతో ఈసీ ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను స్వీకరిస్తుంది. ఇప్పటికే డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ (డీఈసీ) స్థాయి బృందాలు పలు రాష్ట్రాల్లో పర్యటించి సన్నాహక పనులను సమీక్షించాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్ రాష్ట్రాల్లో ఈ బృందాల పర్యటనలు పూర్తయ్యాయి. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఒక దఫా పర్యటన ముగియగా, మరో రెండు పర్యటనలు జరగాల్సి ఉంది. గోవాలో డీఈసీ బృందం ఇంకా పర్యటించలేదు. నవంబర్ నెలాఖరు నాటికి ఈ బృందాలు తమ నివేదికలను ఎన్నికల సంఘానికి సమర్పించనున్నాయి. పోలింగ్‌ను ఎన్ని దశల్లో నిర్వహించాలనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదని తెలుస్తోంది. అయితే, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్ వంటి చిన్న రాష్ట్రాల్లో ఒకే దశలో పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. జనాభా పరంగా, భౌగోళికంగా పెద్దదైన ఉత్తరప్రదేశ్‌లో మాత్రం బహుళ దశల్లో ఎన్నికలు నిర్వహించే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రాల్లో పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లు, అధికారుల అభిప్రాయాలను సమగ్రంగా విశ్లేషించిన తర్వాత, షెడ్యూల్ పై ఈసీ తుది నిర్ణయం తీసుకోనుంది.

సిఐఐ సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు



అందరూ సమన్వయంతో పనిచేసి సదస్సును విజయవంతం చేయాలన్నారు. 'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్, ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్ థీమ్'తో సదస్సు ఉంటుందన్నారు. సుమారు 59 దేశాల నుంచి ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు హాజరవుతారని తెలిపారు. మొత్తం 1,250 మందికి పైగా దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, సిఇఒలు, పాలసీ మేకర్లు హాజరవుతారన్నారు. వాణిజ్యం, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం కంప్యూటింగ్, టెక్నాలజీ ఇన్నోవేషన్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి ఆరు కీలక రంగాలపై సదస్సులో ప్రధానంగా చర్చలు జరుగుతాయన్నారు.

సుంకాల పోరుకు చైనా బ్రేక్



చైనా తాజా నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్య రంగంలో చర్చనీయాంశంగా మారింది. ట్రంప్-జిన్‌పింగ్ చర్చల ప్రభావం ... గత ఏడాది అక్టోబర్ చివరిలో దక్షిణ కొరియాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశం ఈ పరిణామానికి నేపథ్యంగా నిలిచింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మెరుగుపరచడం, సుంకాల వివాదాన్ని తగ్గించడం వంటి అంశాలపై అప్పట్లో అవగాహన కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా అదనపు సుంకాల నిలిపివేతకు చైనా గడువును తాజాగా మరోసారి పొడిగించింది. 10 శాతం సుంకం కొనసాగింపు ... అమెరికా దిగుమతులపై అదనంగా విధించిన 24 శాతం సుంకాల నుంచి తాత్కాలికంగా మినహాయింపు కల్పించినప్పటికీ, 10 శాతం ప్రాథమిక సుంకాన్ని చైనా కొనసాగిస్తోంది. దీంతో అమెరికా ఎగుమతిదారులకు కొంత మేర ఖర్చు భారం తప్పనప్పటికీ, అదనపు సుంకాల నిలిపివేతతో వాణిజ్య కార్యకలాపాలకు తాత్కాలిక ఉపశమనం లభించనుంది. ప్రపంచ మార్కెట్లపై ప్రభావం ... అమెరికా, చైనా మధ్య సుంకాల వివాదం ప్రపంచ పారిశ్రామిక రంగంతో పాటు అంతర్జాతీయ సరఫరా వ్యవస్థపైనా ప్రభావం చూపుతోంది. ఇరు దేశాలు పరస్పరం సుంకాల విషయంలో తాత్కాలిక వెసులుబాట్లు కల్పిస్తున్నప్పటికీ, పూర్తిస్థాయి వాణిజ్య ఒప్పందం కుదిరే వరకు ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కొనసాగే అవకాశముంది. తాజా నిర్ణయంతో తక్షణం వాణిజ్య ఉద్రిక్తతలు పెరగకుండా కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక వాణిజ్య సంబంధాలు ఎలా ఉంటాయన్నది వేచి చూడాల్సి ఉంది.

కృష్ణాజిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పదవి ఎవరిని వరించేనో?

గతంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పదవిని చేపట్టిన వారిలో ఎక్కువగా 'కమ్మ' సామాజిక వర్గానికి చెందిన వారే వున్నారు. ఆనాడు ఉమ్మడి కృష్ణా జిల్లాను శాసించిన వారిలో ముఖ్యులైన వారు ఎందరో జిల్లాకు మంచి పేరు సంపాదించిపెట్టారు. ఇప్పటికే ఆ మహానుభావులను మనం స్మరించుకుంటూ వుంటున్నాం. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పని చేసిన ముఖ్యుల్లో కాకాని వెంకటరత్నం, యార్లగడ్డ శివరామప్రసాద్, మాగంటి అంకినీడు, పిన్నమనేని కోటేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, బొప్పన గంగాధర చౌదరి, కడియాల రాఘవరావు, కుక్కల నాగేశ్వరరావులు వున్నారు. మహిళల్లో నల్లగట్ల సుధారాణి (ఎస్.సి), గద్దే అనూరాధ (కమ్మ), ఉప్పాల హారిక (బీసీ-గౌడ)లు వున్నారు. కృష్ణా ఛైర్‌పర్సన్‌గా చేసిన ముగ్గురు మహిళలు ఉన్నత చదువులు చదివిన వారే కావడం విశేషం!
కృష్ణా జిల్లా పరిషత్‌కు సుదీర్ఘకాలం ఛైర్మన్‌గా పనిచేసిన వారిలో ముఖ్యులు పిన్నమనేని కోటేశ్వరరావు. ఆయన తన పదవీకాలంలో ప్రతిపక్షాలను కూడా ఓర్పుగా, నేర్పుగా సమస్యలను పరిష్కరిస్తూ ఎటువంటి విమర్శలకు తావులేకుండా పరిపాలన సాగించారు. కృష్ణాజిల్లా పరిషత్ అంటే కమ్మ సామాజిక వర్గానిదేనన్న ప్రచారం కూడా అప్పట్లో జరిగింది. ఒక్క కుక్కల నాగేశ్వరరావు (బీసీ-యాదవ) మాత్రమే జిల్లా పరిషత్‌కు ఛైర్మన్‌గా పనిచేసి అందరి అభిమానాన్ని చూరగొన్నారు. పరిపాలనలో తనదైన మార్క్ అందించారు.
రిజర్వేషన్‌లు వచ్చిన తర్వాత తిరువూరు నుంచి నల్లగట్ల సుధారాణి (తెలుగుదేశం పార్టీ ఎస్.సి) (2001- 2006) గద్దే అనూరాధ (విజయవాడ, కమ్మ, 2014 -2019 వరకూ, ఆ తర్వాత ఉప్పాల హారిక (బీసీ గౌడ) పెడన నియోజకవర్గం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2021 నుంచి 2026) వరకూ పని చేశారు.
ఇప్పుడు ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ విడిపోయింది. కృష్ణాజిల్లా పరిషత్, ఎన్టీఆర్ జిల్లా పరిషత్‌గా విడిపోయింది. కృష్ణా జిల్లా పరిషత్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు వున్నాయి. మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన, పామర్రు, గుడివాడ, పెనమలూరు, గన్నవరం ఈ నియోజకవర్గాల పరిధిలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు 26 వున్నాయి. అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో మండల ప్రాదేశిక నియోజకవర్గాలు 343 వున్నాయి. ఇటీవల జరిగిన వీటి ఎన్నికల్లో 343 మండల ప్రాదేశిక నియోజకవర్గాల్లో 270 సీట్లలో కూటమి విజయం సాధించింది. జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల్లో 26కి 24 స్థానాలను కూటమి గెలుచుకోగా, ఒకటి వైఎస్సార్‌సీపీ, మరొకటి స్వతంత్ర అభ్యర్థి గెలిచారు.
ఇప్పుడు జిల్లా పరిషత్‌ను జనరల్ మహిళకు కేటాయించింది ఎన్నికల సంఘం. ఛైర్‌పర్సన్ పదవికోసం పలువురు మహిళలు పోటీ పడుతున్నారు. ముఖ్యంగా ఈసారి 'కాపు' సామాజిక వర్గానికి చెందిన వారు పట్టుబడుతున్నారు.
ప్రధానంగా - అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిగా వున్న విక్కుర్తి శ్రీనివాసరావు తన శ్రీమతి జయలక్ష్మిని అవనిగడ్డ నుంచి పోటీ చేయించి గెలిపించారు. శ్రీనివాసరావు మొదటి నుంచి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పదవిని 'కాపు'లకు కేటాయించాలని కోరుతున్నారు. కృత్తివెన్ను మండలం నుంచి జనసేన అభ్యర్థిగా విజయం సాధించిన గరికపాటి శ్రీలత విద్యావంతురాలు.. డిగ్రీ చేశారు. కాపు సామాజిక వర్గానికి చెందిన వారు. ఆమె భర్త శివ మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరికి అత్యంత సన్నిహితులు. ఆయన ప్రోద్బలంతోనే కృత్తివెన్ను నుంచి జనసేన అభ్యర్థినిగా పోటీ చేయించి గెలిపించారు. నాగాయలంక జడ్పీటీసీ నుంచి సీనియర్ బీజేపీ నాయకురాలు భోగాది రమాదేవికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పదవిని ఇవ్వాలని కోరుతున్నారు. కాపు సమాజిక వర్గానికి చెందిన ఆమె అవనిగడ్డ నియోజకవర్గంలో బీజేపీ పటిష్టతకోసం కృషిచేస్తూ వస్తున్నారు.
'కాపు' సామాజిక వర్గానికి చెందిన ఈ ముగ్గురిలో ఛైర్‌పర్సన్ పదవి ఎవరిని వరిస్తుందో చూడాలి. ఇక, కమ్మ సామాజిక వర్గం నుంచి విద్యాధికురాలైన పమిడిముక్కలకు చెందిన న్యాయవాది తెలుగుదేశం పార్టీకి చెందిన తాతినేని ప్రవళిక, కంకిపాడుకు చెందిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన దండమూడి పూజిత (బి.టెక్) జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తున్నది. పూజిత డీజేఆర్ మెమోరియల్స్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను చేస్తున్నారు. ముఖ్యంగా పేదలను అన్ని విధాలా ఆదుకుంటున్నారు. సేవా కార్యక్రమాలు చేస్తూనే 2021లో రాజకీయాల్లో ప్రవేశించి తెలుగుదేశం అభ్యర్థినిగా జిల్లా పరిషత్ జడ్పీటీసీగా పోటీచేశారు. అప్పటి నుంచి పూజిత తెలుగుదేశంపార్టీలోనే కొనసాగుతూ నియోజకవర్గంలో పార్టీ కోసం ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు పోటీ చేస్తున్న వీరిలో కాకుండా కూటమి ఇంకా ఎవరినైనా ఎంపిక చేస్తుందో లేదో చూడాలి! కూటమిలో రాజకీయ సమీకరణలు మారుతూ వుంటాయి గనుక చూడాలి ఏం జరుగుతుందో?

పారిశ్రామిక ప్రగతికి నూతన దశదిశ

ప్రపంచ మార్కెట్లతో ఏపీ పరిశ్రమల్ని అనుసంధానించటమే లక్ష్యంగా ఈ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రపంచ పెట్టుబడులు, అంతర్జాతీయ వాణిజ్యం, సాంకేతిక భాగస్వామ్యాలకు ఆంధ్రప్రదేశ్‌ను కీలక కేంద్రంగా నిలిచేలా ఈ సదస్సులో చర్చలు, ఒప్పందాలు జరుగనున్నాయి. మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్యం, సాంకేతికత, పరస్పర విశ్వాసం, నిపుణుల దార్శనిక ఆలోచనలకు ప్రాధాన్యమిస్తూ చర్చలు సాగనున్నాయి. ప్రపంచ దేశాలతో భారత ఆర్థిక భాగస్వామ్యానికి ప్రధాన వేదికగా ఈ సదస్సును 1995 నుంచి ఏటా నిర్వహిస్తున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డీపీఐఐటీతో కలిసి భారత పరిశ్రమల సమాఖ్య సీఐఐ ఈ సదస్సును నిర్వహిస్తోంది. ఈ పెట్టుబడుల సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తోంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమ్మిట్‌కు అధ్యక్షత వహించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహాధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. 58 దేశాల ప్రాతినిధ్యం, 16 మంది విదేశీ మంత్రులు, 40 మంది అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు ఈ సమ్మిట్ కు హాజరు కానున్నారు. సింగపూర్, నేపాల్, కంబోడియా, మయన్మార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెనడా, స్లోవాక్ రిపబ్లిక్, మారిషస్, మొజాంబిక్, ఈజిప్ట్, అల్జీరియా, టాంజానియా, గ్వాటెమాలా తదితర దేశాల ప్రభుత్వ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. విధ దేశాల రాయబారులు, పారిశ్రామిక ప్రముఖులు, సాంకేతిక నిపుణులతో పాటు వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్, ఏడీబీ, యునెప్ లాంటి సంస్థల ప్రతినిధులు కూడా ఈ సదస్సుకు హాజరు కానున్నారు. ఈ సదస్సులో భాగంగా 400 పైచిలుకు బిజినెస్ టు బిజినెస్ సమావేశాలు నిర్వహించనున్నారు. దీంతో పాటు ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపుల కోసం బీ టూ జీ సమావేశాలు కూడా జరుగనున్నాయి.

ఏపీ ఉమెన్ గ్రోత్ సమ్మిట్ 2026

పెట్టుబడుల సదస్సులో భాగంగా ఈ నెల 11 తేదీన పారిశ్రామిక ప్రతినిధుల మధ్య ముందస్తు సమావేశాలు జరుగనున్నాయి. అదే రోజు రాత్రి 8 గంటలకు ముఖ్యమంత్రి అధికారిక విందు ఇవ్వనున్నారు. విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజి గ్రౌండ్స్ లో 12, 13 తేదీల్లో ప్రధాన సమావేశం నిర్వహించనున్నారు. దీనికి సమాంతరంగా ఏపీ ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్ 2026 నిర్వహిస్తారు. 12 తేదీ ఉదయం 9.30 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పీయూష్ గోయెల్, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, మంత్రి నారా లోకేష్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రతినిధి రాబర్టో తదితరులు సీఐఐ భాగస్వామ్య సదస్సును ప్రారంభించనున్నారు. ఇక నవంబర్ 13, సాయంత్రం 4 గంటలకు సదస్సు ముగింపు కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, వాల్యుచైన్, క్వాంటం టెక్నాలజీ, సెమీ కండక్టర్ సహా నూతన సాంకేతికతలు, అంతర్జాతీయ సహకారం, నైపుణ్యాలు, గ్రీన్ ఎనర్జీ, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం, ఆహార భద్రత, జీవ ఆధారిత ఆర్థిక వ్యవస్థ తదితర అంశాలపై సుదీర్ఘ చర్చలు జరగనున్నాయి. గత పెట్టుబడుల సదస్సు సహా వివిధ సందర్భాల్లో ఒప్పందాలను పారిశ్రామిక ప్రాజెక్టులుగా మలిచేందుకు మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో మంత్రులు, అధికారుల కమిటీని నియమించింది. ఈ కమిటీ ఎప్పటికప్పుడు ప్రాజెక్టుల గ్రౌండింగ్ ను పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే రూ.6 లక్షల కోట్ల విలువైన 272 ప్రాజెక్టులు రాష్ట్రంలో ప్రారంభం అయ్యాయి. మరో రూ.17 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం ఇచ్చింది. 2025-26లో దేశంలోనికి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 25.6 శాతం ఏపీ దక్కించుకుంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా నిర్వహించిన 6 సన్నాహక ప్రాంతీయ సదస్సుల ద్వారా 194 ఎంఓయూల ద్వారా రూ.86,522 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. తద్వారా 1.47 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశం ఉంది.

స్టాక్ మార్కెట్‌కు బ్యాంకుల బూస్ట్..

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఒడుదొడుకుల మధ్య స్వల్ప లాభాలతో ముగిశాయి. గత వారం భారీ ర్యాలీ తర్వాత మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీల్లో పెద్దగా పెరుగుదల కనిపించలేదు. ఐటీ, మెటల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఉన్నప్పటికీ.. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఫార్మా, ఆర్థిక రంగ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్లకు అండగా నిలిచాయి. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో స్థిరపడ్డాయి. సెన్సెక్స్ 107.25 పాయింట్లు పెరిగి 81,106.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 58.25 పాయింట్లు లాభపడి 25,044.65 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 81,327 పాయింట్లకు చేరింది. ఇంట్రాడేలో 80,519 పాయింట్ల కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ సైతం 25,084 పాయింట్ల గరిష్ఠం, 24,838 పాయింట్ల కనిష్ఠం మధ్య కదలాడింది. రంగాలవారీగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు దూసుకెళ్లాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 3.25 శాతం పెరిగి అగ్రస్థానంలో నిలిచింది. ఫార్మా సూచీ 1.51 శాతం, హెల్త్‌కేర్ 1.11 శాతం లాభపడ్డాయి. ప్రైవేట్ బ్యాంక్ సూచీ 0.53 శాతం పెరిగింది. మరోవైపు ఐటీ సూచీ 1.56 శాతం, మెటల్ సూచీ 0.49 శాతం నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ సూచీ కూడా 0.36 శాతం తగ్గింది. సెన్సెక్స్ షేర్లలో ఎస్‌బీఐ అత్యధికంగా 2.43 శాతం లాభపడింది. ట్రెంట్ 2.13 శాతం, ఎల్అండ్‌టీ 1.96 శాతం, ఎన్‌టీపీసీ 1.59 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.52 శాతం పెరిగాయి. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 2.49 శాతం పడిపోయింది. టాటా స్టీల్ 2.43 శాతం, అల్ట్రాటెక్ సిమెంట్ 2 శాతం, బజాజ్ ఫైనాన్స్ 1.83 శాతం నష్టపోయాయి. మార్కెట్ల ఒడుదొడుకులను సూచించే ఇండియా విక్స్ 5.11 శాతం తగ్గి 17.49కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలూ దిగొచ్చాయి. డబ్ల్యూటీఐ బ్యారెల్ ధర 90.39 డాలర్లకు, బ్రెంట్ ధర 97.42 డాలర్లకు తగ్గింది. రానున్న రోజుల్లో భారత్, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు, ముడిచమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్లకు కీలకం కానున్నాయి.

ప్రజలు చాలా విజ్ఞులు

ఒక్క జెడ్పీటీసీని కూడా గెలుచుకోలేకపోయిందని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రజలు కేవలం పార్టీలను మాత్రమే కాకుండా, అభ్యర్థుల గుణగణాలను, వారి నేపథ్యాన్ని కూడా విశ్లేషించి ఓటు వేశారని చెప్పారు. పెళ్లి సంబంధం కుదుర్చుకునేటప్పుడు అటు ఏడు తరాలు..
ఇటు ఏడు తరాలు చూస్తామని, అదే విధంగా ప్రజలు కూడా తమ తరఫున పనిచేసే వ్యక్తుల గురించి ఆలోచించి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని, ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించారని అన్నారు. రాష్ట్ర ప్రజలు తమపై ఉంచిన విశ్వాసానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

అండగా ఉన్నాం..ఆశీర్వాదం పొందాం... రెండున్నరేళ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు, గత పాలనలో జరిగిన విధ్వంసం నుంచి పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి పౌరుడికీ భద్రత, భరోసా కల్పిస్తూ సుపరిపాలన అందిస్తున్నామని, సాగునీటి ప్రాజెక్టులతో సీమ కరవుకు చెక్ పెట్టామని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు కల్పించామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంటి పట్టాలు అందించామని, పేదలకు ఇళ్లు నిర్మించామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేశానని, ఇప్పుడు తొలిదశను ప్రారంభించి నీరందించడం ద్వారా రైతుల కష్టాలను తీర్చామని గుర్తు చేశారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్లామని చెప్పారు. దీన్ని ప్రజలు గుర్తించారని... ఓట్లతో ఆశీర్వదించారని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురంలో 21కి 21 జెడ్పీటీసీ స్థానాలను, అనకాపల్లిలో 24కి 24 స్థానాలను కూటమి గెలుచుకుందని గుర్తు చేశారు. విశాఖ మేయర్ స్థానాన్ని 2.50 లక్షల ఓట్ల మెజారిటీతో ప్రజలు కట్టబెట్టారని వివరించారు. ఇప్పుడే కాకుండా గతంలోనూ వివిధ సందర్భాల్లో ఇదే నిరూపితమైందని చెప్పారు. ప్రజల కోసం కష్టపడితే ప్రజలు ఆ పార్టీల వెన్నంటే ఉంటారని ఈ ఫలితాలు నిరూపించాయన్నారు.

అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక శ్రద్ధ : స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం వివిధ సామాజిక వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించామని ముఖ్యమంత్రి తెలిపారు. అన్ని కులాలకు రాజ్యాధికారంలో భాగస్వాములను చేసేలా అభ్యర్థుల ఎంపిక జరిగిందని చెప్పారు. మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కోసం విస్తృతంగా కసరత్తు చేసి, సమన్వయంతో ముందుకు వెళ్లామని చెప్పారు. రాజకీయ నేపథ్యం లేని సామాన్యులు కూడా ఈ ఎన్నికల్లో విజయం సాధించారని, ఇది రాజకీయాల్లో కొత్త ఒరవడికి నాంది అని పేర్కొన్నారు. సీట్లు దక్కకపోయినా కూటమి ధర్మానికి కట్టుబడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. త్యాగాలు చేసిన కేడర్‌ను, నాయకులను గుర్తించి గౌరవిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. టీడీపీ కేడర్ బేస్డ్ పార్టీ అని, సేవా భావమే తమ రాజకీయాలకు పునాది అని చెప్పారు. బీజేపీ, జనసేన, టీడీపీలు ఐక్యంగా పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని, ఇకముందూ కూటమి ధర్మాన్ని పాటిస్తూ ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు.

అవసరమైతే కఠినంగా వ్యవహరిస్తాం : రాష్ట్రవ్యాప్తంగా కూటమి ఘన విజయం సాధించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఎదురైన ఓటములపై సమగ్రంగా సమీక్షించుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతపురంలో ఓడిపోయే అవకాశమే లేదని... కానీ అక్కడ ఓటమి ఎదురైందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు రాలేదని చెప్పారు. అరకు కాఫీ బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేశామని తెలిపారు. అయినప్పటికీ అక్కడ ఫలితాలు ఎందుకు అనుకూలంగా రాలేదో విశ్లేషిస్తామని, ఓటర్లపై ఏమైనా ప్రలోభాల ప్రభావం పడిందా అనే విషయాలను కూడా వాస్తవాల ఆధారంగా పరిశీలిస్తామని చెప్పారు. ఒకట్రెండు స్థానాల్లో ఎందుకు ఓడిపోయామో లోతుగా విశ్లేషించుకుని, అవసరమైతే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడ పొరపాట్లు జరిగినా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తామని, తమకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. మెజారిటీ పెరిగినప్పుడు మరింత అప్రమత్తంగా, బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుందని పార్టీ నాయకులకు సూచించారు. కూటమి నిర్ణయాలను ఉల్లంఘించి వ్యవహరించిన వారిని ఉపేక్షించబోమని, రెబల్స్‌ను తిరిగి పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

గొడ్డలి పార్టీ కుట్రలకు చెక్...

కూటమి ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేసేందుకు వైసీపీ అనేక ప్రయత్నాలు చేసిందని ముఖ్యమంత్రి విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్ఐఆర్ ప్రక్రియ, డీలిమిటేషన్ వంటి అంశాలపై పిటిషన్లు వేసి స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని అన్నారు. అయితే వారి ప్రయత్నాలకు సుప్రీంకోర్టు చెక్ పెట్టిందని తెలిపారు. ఎన్నికలు ఆపాలన్న వైసీపీ ట్రాప్ లో పడబోమని సుప్రీం కోర్టు వ్యాఖ్యానిచిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కూటమి ప్రజలను, వారి నమ్మకాన్ని మాత్రమే విశ్వసించిందని, వైసీపీ మాత్రం హింసాత్మక రాజకీయాలను నమ్ముకుందని విమర్శించారు. రక్తతర్పణాలు, రప్పరప్పా రాజకీయాలను ప్రజలు ఎప్పుడూ ఆమోదించరని, రౌడీయిజం, డ్రామాలతో ప్రజాతీర్పును మార్చలేరని అన్నారు. రెండు తుఫాన్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలోనూ వైసీపీ కనీసం రాజకీయ పార్టీగా స్పందించలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో మావిగన్ ప్రకటనకు కూడా ప్రజలు తమ తీర్పు ద్వారా సమాధానం ఇచ్చారని వ్యాఖ్యానించారు. డబ్బు ప్రభావం లేకుండా జరిగిన ఈ ఎన్నికల్లో గెలుపొందిన వారందరికీ అభినందనలు తెలిపారు. గెలిచిన వారిపై ప్రజల పట్ల బాధ్యత మరింత పెరిగిందని, ఎన్నికలతో తమ బాధ్యత ముగిసిపోలేదని, నిరంతరం ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటామని చెప్పారు.

సాఫీగా సాగిన ఎన్నికల ప్రక్రియ... అయినా విమర్శలా..?

ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్నవారు ప్రజాతీర్పును గౌరవిస్తారని, నమ్మకం లేని వారే కుట్రలకు పాల్పడతారని వైసీపీపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగినప్పటికీ వైసీపీ అర్థం పర్థం లేని ఆరోపణలు చేసిందని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములను సహజంగా స్వీకరించాలన్నారు. కుప్పంలో ఒక ఎంపీటీసీ స్థానాన్ని కూటమి కోల్పోయినప్పటికీ, కక్కుర్తి పడలేదని వెల్లడించారు. దాన్ని బలవంతంగా కైవసం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆ స్థానాన్ని ఎలాగైనా గెలుచుకోవాలనే పంతానికి పోలేదని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేస్తేనే అసలైన ప్రజాభిప్రాయం తెలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల నిర్ణయాన్ని గౌరవించాలనే తమ విధానానికి కుప్పం ఎంపీటీసీ ఫలితమే నిదర్శనమని ముఖ్యమంత్రి చెప్పారు.

శ్వేతపత్రాలు టు ప్రగతి నివేదికలు

గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు వివరించేందుకు శ్వేతపత్రాలు విడుదల చేశామని, వ్యవస్థలను గాడిలో పెట్టి ఇప్పుడు ప్రగతి నివేదికలు సమర్పిస్తున్నామన్నామన్నారు. రాయలసీమను అభివృద్ధి సీమగా మార్చేందుకు సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలను తీసుకొచ్చామని, సూపర్ ఎల్‌నినో వంటి తీవ్ర వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 36 ప్రాజెక్టులను పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టామని చెప్పారు. రాష్ట్రానికి పూర్తిగా దెబ్బతిన్న బ్రాండ్‌ను తిరిగి సూపర్ బ్రాండ్‌గా తీర్చిదిద్దామని తెలిపారు. ఒకసారి రాష్ట్రానికి మంచి బ్రాండ్ ఇమేజ్ వస్తే పెట్టుబడులు వాటంతట అవే వస్తాయని చెప్పారు. ప్రజలు ఇచ్చిన తీర్పు తమకు మరింత బాధ్యతను పెంచిందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను కొనసాగిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలోనూ రాజకీయాల కంటే ప్రజల కష్టాలకే ప్రాధాన్యమిచ్చామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించారని ముఖ్యమంత్రి చెప్పారు.

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
మంగళవారం, నవంబర్ 10, 2026
3

సంప్రదాయ కళలకు ఆధునిక స్టాల్ ఇన్ మాల్

❖ చేనేత, హస్తకళల కళాకారులకు మాల్ వేదికగా మార్కెట్ అవకాశాలు
❖ నాబార్డు – నేస్తం ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఏర్పాటు
❖ ప్రారంభించిన నాబార్డు ప్రాంతీయ కార్యాలయ సీజీఎం సోమేందర్ సింగ్



జాభూమి ప్రతినిధి విజయవాడ:
గ్రామీణ ప్రాంతాల్లోని చేనేత కళాకారులు, హస్తకళాకారులు ఎంతో నైపుణ్యంతో తయారు చేసే సంప్రదాయ ఉత్పత్తులకు ఆధునిక మార్కెటింగ్ అవకాశాలు కల్పించడమే స్టాల్ ఇన్ మాల్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాబార్డు ప్రాంతీయ కార్యాలయ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) సోమేందర్ సింగ్ అన్నారు. సోమవారం ఎంజీ రోడ్డులోని పీవీపీ స్క్వేర్ మాల్‌లో నాబార్డు ప్రాంతీయ కార్యాలయ చీఫ్ జనరల్ మేనేజర్ సోమేందర్ సింగ్.. నేస్తం ఫౌండేషన్ సీఈవో సురేష్ వేసం తదితరులతో కలిసి స్టాల్ ఇన్ మాల్ స్టాళ్లను ప్రారంభించారు. హస్తకళలు, చేనేత కళాకారులతో మాట్లాడి ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమేందర్ సింగ్ మాట్లాడుతూ కళాకారులు తయారుచేసిన ఉత్పత్తులను నేరుగా పట్టణ ప్రాంతాల వినియోగదారులకు పరిచయం చేయడం ద్వారా వారికి మెరుగైన మార్కెట్‌ను అం దించవచ్చన్నారు. సాధార ణంగా గ్రామీణ ప్రాంతాల్లో తయారయ్యే చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తులు, సంప్రదాయ కళాఖం డాలను ప్రజలు ఎక్కువగా సందర్శించే షాపింగ్ మాల్స్‌లో ప్రదర్శనకు ఉంచడం ద్వారా కళాకారులకు కొత్త మార్కెట్ అవకాశాలు లభిస్తాయని వివరించారు. గ్రామీణ కళాకారుల ఉత్పత్తులను పట్టణ వినియోగదారులకు చేరువ చేయడంతో పాటు, సంప్రదాయ కళలు, చేనేత వస్త్రాలు, హస్తకళల పట్ల ప్రజల్లో ఆసక్తిని పెంపొందించడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను పరిశీలించి కొనుగోలు చేసే అవకాశం కలగడం వల్ల కళాకారులకు వారి శ్రమకు తగిన గుర్తింపు, ఆదాయం లభించే అవకాశం ఉంటుందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులతో పాటు చేనేత, హస్తకళలను నాబార్డు అన్ని విధాలా ప్రోత్సహిస్తోందన్నారు. నేస్తం ఫౌండేషన్ సీఈవో సురేష్ వేసం మాట్లాడుతూ చేనేత రంగం, హస్తకళలు మన దేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలని, తరతరాలుగా కళాకారులు తమ నైపుణ్యంతో ఈ కళలను కాపాడుకుంటూ వస్తున్నారని పేర్కొన్నారు. స్టాల్ ఇన్ మాల్ స్టాళ్లు ఈ నెల 9 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. సంప్రదాయ కళలను ప్రోత్సహించడం, కళాకారుల జీవనోపాధిని బలోపేతం చేయడం, వారి ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ సదు పాయాలు కల్పించడం వంటి లక్ష్యాల సాధనలో నాబార్డు ఇటువంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నాబార్డు, నేస్తం ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ద్వారా గ్రామీణ కళాకారులకు మార్కెటింగ్ పరంగా కొత్త అవకాశాలు లభించడంతో పాటు, స్థానిక ఉత్పత్తులకు తగిన గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు ఇటువంటి స్టాళ్లను సందర్శించి చేనేత, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.కార్యక్రమంలో నాబార్డు డీడీఎం ఎన్.సత్యనారాయణ, పీవీపీ మాల్ మేనేజర్ అనిల్, నేస్తం సిబ్బంది కె.లక్ష్మీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సర్పంచికి వార్డు సభ్యుడికి గుర్తులు సిద్ధం చేసిన ఎన్నికల కమిషన్

♦సర్పంచ్ కు 25 గుర్తులు, వార్డు సభ్యుడికి 20 గుర్తులు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ఈ నెల 26, 29, డిసెంబరు 2వ తేదీల్లో జరగనున్నాయి. ఇందులో భాగంగా సర్పంచి అభ్యర్థుల కోసం 25, వార్డు సభ్యుల కోసం 20 చొప్పున గుర్తులు కేటాయించారు. వీటికి అదనంగా నోటా ఉండనుంది. అభ్యర్థుల సంఖ్య పెరిగితే కొత్త గుర్తులు కేటాయించనున్నారు. సర్పంచ్ గుర్తులు ఇవే..మంచం, కత్తెర, ఉంగరం, బుట్ట, వంకాయ, కప్పూ సాసరు, క్యారెట్, తాళం చెవి, గొలుసు, కుర్చీ, బ్యాట్, టెలిఫోన్, బల్ల, మొక్కజొన్న, పలక, ద్రాక్షపళ్లు, తిరగలి, కుండ, అరటిపండు, కొవ్వొత్తులు, నల్లబోర్డు, అనాసపండు, షటిల్, చేతికర్ర, చెంచా. వార్డు సభ్యుల గుర్తులు.. ప్రెషర్ కుక్కర్, గౌను, స్టూల్, ఇస్త్రీపెట్టె, పోస్ట్ డబ్బా, గ్యాస్ స్టౌ, బీరువా, ఐస్క్రీమ్, కెటిల్, కటింగ్ ప్లేయర్, విద్యుత్ స్తంభం, గరాటా, డిష్ యాంటెన్నా, రంపం, కెమెరా, క్యారమ్ బోర్డు, వయో లిన్, బెండకాయ, బెల్టు, కోటు గుర్తులు.

నేడు మచిలీపట్నంలో జాబ్ మేళా

♦400కు పైగా ఉద్యోగాలు.. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు
అర్హత♦అర్హులైన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం,(ప్రజాభూమి ప్రతినిధి):
నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో మచిలీపట్నంలో నవంబరు 10వ తేదీ మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలె క్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర ఉపాధి, శిక్ష ణ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు దిమ్మల సెంట ర్‌లోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీ రోడ్డుకు సమీపంలో ఈ జాబ్ మేళా జరగనుంది. అర్హులైన నిరు ద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.
400కు పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు...ఈ జాబ్ మేళాలో యాక్సిస్ బ్యాంక్, టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్, బంధన్ బ్యాంక్, వరుణ్ మోటార్స్, మెడ్‌ప్లస్, టాటా ఎలక్ట్రానిక్స్, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్, ముత్తూట్ మనీ, అడెక్కో ఇండియా, ఎల్విన్ ఎనర్జీ, డైకిన్ తదితర ప్రముఖ సంస్థ లు పాల్గొననున్నాయి. ఆయా సంస్థల్లో 400కు పైగా ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులకు ఇంట ర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అధికారి వై. సత్యబ్రహ్మం వెల్లడించారు.
18 నుంచి 35 ఏళ్ల వారికి అవకాశం...పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తిచేసిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని అధికారులు తెలిపారు. ఇంటర్వ్యూల ద్వారా ఎంపికైన వారికి అర్హతలు, ఉద్యోగ స్వభావాన్ని బట్టి వేతనంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.
రిజిస్ట్రేషన్ తప్పనిసరి....జాబ్ మేళాకు హాజరుకావాలనుకునే అభ్యర్థులు ముందుగా "https://naipunyam.ap.gov.in" (https://naipunyam.ap.gov.in) వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం రెజ్యూమె లేదా బయోడేటాతోపాటు ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ ఫోన్, పాన్ కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని అధికారులు సూచించారు.మరిన్ని వివరాల కోసం 99664 89796, 96665 43412, 97042 16211 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందుకున్న విక్కుర్తి జయలక్ష్మి



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:
అవనిగడ్డ జెడ్పీటీసీగా విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ అభ్య ర్థిని విక్కుర్తి జయలక్ష్మి సోమవారం మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఈ సంద ర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు జయలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

స్థానిక సంస్థల ఎన్నికల విజేతలకు లంకిశెట్టి కార్యాలయంలో సన్మానాలు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
ఇటీవల జరిగిన స్థానిక సంస్థలలో జనసేన తెలుగుదేశం పార్టీ తరపున విజేతలైన అభ్యర్థులను న్యాయవాది లంకిశెట్టి బాలాజీ 19 డివిజన్ మాజీ కార్పొరేటర్ లంకిశెట్టి వనజ జగన్నాధపురం లోని తమ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మచిలీ పట్నం మేయర్ అబ్దుల్ అబీద 16 డివిజన్ కార్పొరేటర్ హసీం బేగ్, 17వ డివిజన్ కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, 18 డివిజన్ కార్పొరేటర్ మరకాని సమతా కీర్తి, ఎనిమిదవ డివిజన్ కార్పొరేటర్ పినిశెట్టి నాగ ఛాయాదేవి, 56వ డివిజన్ కార్పొరేటర్ పీవీ ఫణి కుమార్ సతీమణి విమల గాయత్రి, గూడూరు మండలం ఆకులమన్నాడు ఎంపీటీసీ జనసేన అభ్యర్థి బాకీ శ్రీనివాసును ఘనంగా సన్మానించారు.. కీలకమైన సమయంలో ఓటర్లు ఎంతో నమ్మకంతో ఓట్లు వేశారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి అగ్ర పీఠం వెయ్యాలని లంకిశెట్టి అన్నారు.
రాబోయే రోజులలో రాజకీయాలకుతీతంగా నగర అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించి తమ సత్తా చాటాలని బాలాజీ అభ్యర్థులకు సూచించారు. గెలుపొందిన అభ్యర్థులకు శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. మున్సిపల్ చట్టం పై అవగాహన పెంచుకోవాలని ప్రతి అభ్యర్థి తమ యొక్క హక్కులను బాధ్యతలను చట్టప్రకారం తెలుసుకోవాలని బాలాజీ అన్నారు.

అప్రోచ్ రోడ్డును పునరుద్ధరించరూ...!

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
మచిలీపట్నంలో జిల్లా కోర్టు రహదారిపై సాయిబాబా గుడి వద్ద డ్రైనేజీ అప్రోచ్ రోడ్డు వేయక వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తుఫాను వర్షాలకు మట్టి కొట్టుకుపోయి గుంతలు పడటంతో ప్రమాదకరంగా మారిన ఈ మార్గాన్ని అధికారులు వెంటనే పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మచిలీపట్నంలో జిల్లా కోర్టు రహదారిపై సాయిబాబా గుడి వద్ద డ్రైనేజీ అప్రోచ్ రోడ్డు వేయక వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తుఫాను వర్షాలకు మట్టి కొట్టుకుపోయి గుంతలు పడటంతో ప్రమాదక రంగా మారిన ఈ మార్గాన్ని అధికారులు వెంటనే పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పేద విద్యార్థులకు వేమూరి చారిటబుల్ ట్రస్ట్ చేయూత

60 రోజుల్లో 11 సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం: మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్



మచిలీపట్నం, (ప్రజాభూమి ప్రతినిధి):
పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలవాలనే లక్ష్యంతో వేమూరి వెంకటసుబ్బయ్య, కుదరవల్లి సీతారామయ్య, వేమూరి వెంకట రమేష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని జవహర్‌పేట ప్రాంతంలో ఉన్న మదర్సా పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ మాట్లాడుతూ.. వేమూరి చారిటబుల్ ట్రస్ట్ 60 రోజుల వ్యవధిలో 11 సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో కొంత భాగాన్ని సమాజంలోని అవసరార్థులకు అందించి, ఆపన్నులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు.ట్రస్ట్ నిర్వాహకుడు వేమూరి వెంకట రమేష్ మాట్లాడుతూ.. తన సంపాదనలో కొంత భాగాన్ని పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం కేటాయించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సహాయం అందించడం ద్వారా వారి విద్యాభివృద్ధికి తోడ్పడటమే తమ లక్ష్యమన్నారు.మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సహాయం అందిం చ డం లో వేమూరి చారిటబుల్ ట్రస్ట్ ముందుండటం సంతోషకరమన్నారు. సుబ్బయ్య హోటల్ ద్వారా నగర ప్రజలకు సుపరిచితమైన వేమూరి కుటుంబం, నేడు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువవుతోందని కొని యాడారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ నాగబాబు, జిల్లా ప్రభుత్వాసుపత్రి మాజీ డైరెక్టర్ అజీమ్, టీడీపీ నాయకులు మౌలాలి, చీలి సుమన్, న్యాయవాది మాటూరి రాజేష్, సింగ్, శ్రీనివాస్, మదర్సా పాఠశాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



సేవా స్ఫూర్తికి ప్రతీకగా యూత్ టైం బ్యాంక్



❖ విజయవంతంగా 200 రోజులు పూర్తిచేసుకున్న సేవలు
❖ ఇప్పటివరకు 5,169 మంది వాలంటీర్ల ద్వారా 20,076 గంటల సేవలు ❖ సేవలను అభినందించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యూత్ టైం బ్యాంక్ సేవలు విజయవంతంగా 200 రోజులు పూర్తి చేసుకోవడం అభినందనీయమని యూత్ టైం బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధి కారి, జిల్లా పర్యాటక, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల సమన్వయ అధికారి డా. కొల్లేటి రమేష్ తెలిపారు. ఈ ఏడాది మార్చి 17న విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో ప్రారం భించిన ఈ సేవలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. వివిధ కళాశాలలకు చెందిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లు ప్రతిరోజూ ఆసుపత్రికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, అంధులు, నిరక్షరాస్యులకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు. రాష్ట్రంలోనే వినూత్నంగా ప్రా రంభించిన ఈ సేవా కార్యక్రమం విజయవాడ జీజీహెచ్‌లో 200 రోజులపాటు నిరంతరంగా కొనసాగడం విశేషమని కలెక్టర్ డా. లక్ష్మీశ అభినందించారు. యూత్ టైం బ్యాంక్ 200వ రోజు సేవల్లో భాగంగా విజయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవలందించారు. ఈ సందర్భంగా వాలంటీర్లతో పాటు ఎ న్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి, కళాశాల ప్రిన్సిపల్‌ను కలెక్టర్ అభినందించారు. యూత్ టైం బ్యాంక్ వాలంటీర్లు ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆన్‌లైన్‌లో ఓపీ నమోదు చేయడం, వైద్యులను సంప్రది ంచడంలో సహకరించడం, వైద్య పరీక్షలు చేయించడం, మం దులు పొందడంలో సహాయం చేయడం వంటి సేవలను అందిస్తున్నారు. ఇప్పటివరకు యూత్ టైం బ్యాంక్ ద్వారా 5,169 మంది వాలంటీర్లు సేవలం దించగా, మొత్తం 20,076 గంటల సమయాన్ని ప్రజాసేవకు వెచ్చించారు. ఈ సేవల ద్వారా 12,338 మంది రోగులకు సహాయం అందించినట్లు డా. కొల్లేటి రమేష్ వివరించారు. ఈ సేవా కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు స్వచ్ఛంద సంస్థలు, విశ్రాం త ఉద్యోగులు, ఆసక్తి గల యువత, ఇతర సేవాభిలాషులు స్వచ్ఛందంగా ముందుకు రావాల ని ఆయన కోరారు. సేవల్లో భాగస్వాములు కావాలనుకునేవారు యూత్ టైం బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డా. కొల్లేటి రమేష్‌ను 9487916 504 నంబరులో సంప్రదించ వచ్చు న్నారు. 200వ రోజు కార్యక్రమంలో జీజీహెచ్ హెల్త్ ఇన్ స్పెక్టర్ రామారావు, చంద్రశేఖర్ రెడ్డి, జాఫర్, విజయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి రియాన్, వాలంటీర్లు, వాసవ్య మహిళా మండలి వాలంటీర్ అనిత తదితరులు పాల్గొన్నారు.



దత్తాశ్రమంలో 108 శివలింగాలు ఏర్పాటు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం
మచిలీపట్నం బుట్టయ్యపేట దత్తాశ్రమంలో కార్తీక మాసం పురస్కరించుకొని నర్మదా నది నుండి తీసుకొచ్చిన 108 శివలింగాలు నగర ప్రజల అభిషేకం కోసం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ మేరకు దత్తాశ్రమంలో కార్తీకమాస ఉత్సవ కరపత్రాలు ఆవిష్కరణ ప్రము ఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ చే జరిగింది. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ మైసూరు గణపతి సచ్చిదానంద స్వామీజీకి మైసూరు తర్వాత మచిలీపట్నం పై అపారమైన ప్రేమ ఉందని తెలియజేశారు. శ్రీ స్వామీజీ ఎంతో ప్రేమతో స్పటిక లింగాన్ని నర్మదా నది నుండి 108 శివలింగాలని మరియు 12 అడుగుల ఎత్తుగల శివలింగాన్ని కార్తీక మాసం పురస్కరించుకుని మచిలీపట్నం పంపి నట్లు తెలియజేశారు. మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలు స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం కల్పించారు. నగర ప్రజల కోసం ఏర్పా టు చేసిన కార్తీక మాసం శివలింగాల అభిషేక కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని చిన్నం గోవర్ధన,మాదిరెడ్డి అంజిబాబు విజ్ఞప్తి చేశారు ఈనెల 25.26 తేదీలలో మచిలీపట్నం లేడీస్ క్లబ్ లో శ్రీ శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ వారి ఆధ్వర్యంలో సామూహిక భగవద్గీత పారాయణం కార్తీక కోటి దీపోత్సవం కార్యక్రమాలు ఏర్పా టు చేసిన ట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తమ్మన సుబ్బారావు, కందప్ప శివరామకృష్ణ , మునుకుంట్ల శ్రీ నివాసరావు ,తాళ్ళూరి శోభరాణి, చిన్నం గోవర్ధన్, మాదిరెడ్డి అంజిబాబు, మల్లాది బుద్ధేశ్వర రావు, కలవరపు వర ప్రసాద్, దైత శ్రీ నివాసరావు, లంకి శెట్టి వంశీకృష్ణ పాల్గొన్నారు.

అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్‌లకు మర్యాదపూర్వక భేటీ



అవనిగడ్డ, ప్రజాభూమి ప్రతినిధి:
కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం ఎంపీటీసీ స్థానంలో కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థి పెదపూడి ప్రియాంక 1,172 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆమె అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను, జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా విజయం సాధించిన పెదపూడి ప్రియాంకను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1,172 ఓట్ల మెజారిటీతో జనసేన అభ్యర్థి పెదపూడి ప్రియాంక విజయం

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

మంగళవారం 10 నవంబర్ 2026



కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా
నిర్వాసితులందరికీ పరిహారం చెల్లించాలి

ప్రజా భూమి కుకునూరు

కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా పోలవరం నిర్వాసితులందరికీ పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుకునూరు మండలాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి పరిహారం అందని మిగిలిన భూములకు, సాగులో ఉన్న పోడు భూములతో సహా అర్హులైన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం చెల్లించాలని కోరారు. చుట్టూ గోదావరి నది ఉండే పరిస్థితుల్లో కాంటూర్ పరిధిలోకి రాని గ్రామాల ప్రజలు ఎలా జీవించాలని ప్రశ్నించారు. నష్టపరిహారం పొందిన కొంతమంది భూయజమానులు ఇతర ప్రాంతాల్లో నివసిస్తూ ఇక్కడి భూములను కౌలుకు ఇస్తున్నారని, అటువంటి భూములను ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకొని భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని అన్నారు. ఇప్పటికే నష్టపరిహారం పొందిన భూములను కౌలుకు ఇస్తూ పేద రైతుల నుంచి అధిక మొత్తంలో కౌలు వసూలు చేస్తున్న భూయజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.లిఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, మండల కమిటీ సభ్యులు సిపిఎం నాయకులు షేక్ మహబూబ్ పాషా,సరియం హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్షీర రామంలో ప్రారంభం అయిన
కార్తీక మాసోత్సవాలు

- ఏర్పాట్లు పర్య వేక్షించిన సహాయ కమిషనర్ వెంకటేశ్వర రావు

ప్రజాభూమి ప్రతి నిధి, పాలకొల్లు



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్నంలో వేంచేసి ఉన్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానము నందు సోమవారం సాయంత్రం ఐదు గంటలకు పశ్చిమగోదావరి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి వెంకటేశ్వరరావు, క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు కార్తీక మాస మహోత్సవములు సందర్భంగా భక్తులకు చేసిన ఏర్పాట్లను పర్యవేక్షించినారు.భక్తులు కు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్స్ నందు శ్రీ స్వామివారి దర్శనం చక్కగా జరిగేటట్టు చూడవలసినదిగా ఆలయ కార్యనిర్వహణాధికారి రాపాక శ్రీనివాసరావుకి చెప్పినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాణా అధికారి రాపాక శ్రీనివాసరావు ఆలయ చైర్మన్ మీసాల రామచంద్రరావు ఆలయ ధర్మకర్త పినిశెట్టి శ్రీనివాస్ ఆలయ సూపరింటెండెంట్ వాసు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు
సిద్ధమవుతున్న నాయకులు

- ఈ నెల 13న నోటిఫికేషన్.. ఇప్పటికే అభ్యర్థులపై కసరత్తు

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

ఎంపీటీసీ ఎన్నికల వేడి పూర్తిగా తగ్గకముందే నాయకులు పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించారు. ఈ నెల 13న పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో సందడి మొదలైంది. ఇప్పటికే పంచాయతీల వారీగా రిజర్వేషన్లు ప్రకటించడంతో సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై నాయకులు కసరత్తు చేస్తున్నారు. మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు 11 మంది సర్పంచ్‌లు, 134 మంది వార్డు సభ్యుల ఎన్నికలు జరగనున్నాయి. రిజర్వేషన్ల ప్రకారం పోచవరం, ప్రక్కిలంక పంచాయతీలు ఎస్సీ జనరల్‌కు, తిరుగుడుమెట్ట, బల్లిపాడు ఎస్సీ మహిళలకు, అన్నదేవరపేట బీసీ జనరల్‌కు, తాళ్లపూడి, పెద్దేవం, మలకపల్లి జనరల్‌కు, వేగేశ్వరపురం, గజ్జరం, తాడిపూడి జనరల్ మహిళలకు కేటాయించారు. సర్పంచ్ ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరిగే ఎన్నికలైనప్పటికీ, రాజకీయ పార్టీల ప్రభావం అభ్యర్థులపై పరోక్షంగా ఉండనుంది. ఎంపీటీసీ ఎన్నికల సమయంలోనే పలువురు నాయకులు సర్పంచ్‌లుగా పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నారు. కొన్ని గ్రామాల్లో అభ్యర్థుల పేర్లను కూడా ప్రకటించారు. తాళ్లపూడి, బల్లిపాడు గ్రామాల్లో టీడీపీ వర్గీయులు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా, ఎస్సీ రిజర్వుడ్ పంచాయతీల్లో ఇద్దరికి మించి అభ్యర్థులు పోటీకి సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా, తాళ్లపూడి సర్పంచ్ స్థానానికి బీసీ రిజర్వేషన్‌పై హైకోర్టును ఆశ్రయించిన అంశంపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. మరోవైపు ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. నామినేషన్ల స్వీకరణకు గజ్జరం, తాళ్లపూడి, వేగేశ్వరపురం, మలకపల్లి పంచాయతీ కార్యాలయాలను నాలుగు ఎన్నికల కేంద్రాలుగా గుర్తించారు. ఆయా కేంద్రాలకు ఆర్వోలుగా వీ. రాకేష్ కుమార్, సి.హెచ్. క్షేమకుమార్, ఎ. అరుణోదయ కుమార్, ఎ. చంద్రశేఖర్‌లను నియమించారు. నోటిఫికేషన్ వెలువడనుండటంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మరింత పెరగనుంది.

దీపావళి టపాసుల సందడిలో
బంగారు గొలుసు అపహరణ!

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి దీపావళి టపాసుల సందడిని ఆసరాగా చేసుకున్న గుర్తుతెలియని దుండగుడు ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును అపహరించి పరారయ్యాడు. స్వర్గీయ నెరుసు పుల్లయ్య వీధిలో నివాసం ఉంటున్న పదవీ విరమణ పొందిన హోమియో వైద్య సహాయకురాలు సత్యవతి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో దుండగుడు బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించి, ఆమె మెడలో ఉన్న రెండున్నర కాసుల బంగారు నానుతాడును తెంపుకుని పారిపోయాడు. ఈ క్రమంలో ఆమెను బలంగా నెట్టివేయడంతో పెనుగులాట చోటుచేసుకున్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న నూజీవీడు గ్రామీణ సీఐ ఐ.వి. నాగేంద్ర కుమార్, ఆగిరిపల్లి ఎస్సై వి. సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఒంటరిగా ఉండే మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఎస్సై సూచించారు.

మరో 30 ఏళ్లకు సరిపోయేలా కొత్త నాయకత్వాన్ని తయారుచేశాం

- అందుకే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం...
- 58.9 శాతం ఓట్లతో ఘన విజయం
- 2024 ఎన్నికలతో పోలిస్తే 3.6 శాతం పెరిగిన ఓట్ల వాటా
- 100 పట్టణ స్థానిక సంస్థల్లో 94 చోట్ల పాగా... 3,941 వార్డుల్లో 3,233 కైవసం
- పల్లెల్లోనూ అదే జోరు... ఒక్క జెడ్పీ మినహా 27 జెడ్పీలు కూటమి కైవసం
- మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, యువతకు నాయకత్వంలో పెద్దపీట
- స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, ఫలితాల విశ్లేషణలను వివరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు ఘన విజయం సాధించాయని, 2024 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ప్రజల్లో కూటమి ఆదరణ మరింత పెరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎన్నికల ఫలితాలు, వివిధ స్థాయిల్లో కూటమి సాధించిన విజయాలు, అభ్యర్థుల ఎంపికలో అనుసరించిన విధానం, సామాజిక ప్రాతినిధ్యానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో గణాంకాలతో సహా వివరించారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో కలిపి కూటమి 58.9 శాతం ఓట్లను సాధించిందని, 2024 ఎన్నికల్లో సాధించిన 55.3 శాతం ఓట్లతో పోలిస్తే 3.6 శాతం పెరుగుదల నమోదైందని వివరించారు. అదే సమయంలో వైసీపీ ఓట్ల శాతం 39.81 నుంచి 33.56కు పడిపోయిందని, ఆ పార్టీకి 6.25 శాతం ఓట్లు తగ్గాయని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల శాతంలో 25.34 శాతం వ్యత్యాసం ఉందని వెల్లడించారు. పట్టణ స్థానిక సంస్థల్లో కూటమికి 59.9 శాతం ఓట్లు రాగా, వైసీపీకి 34.3 శాతం మాత్రమే వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. పట్టణాల్లో కూటమి స్ట్రైక్ రేట్ 94 శాతంగా నమోదైందన్నారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమికి 57.6 శాతం, వైసీపీకి 39.7 శాతం ఓట్లు వచ్చాయని, కూటమి స్ట్రైక్ రేట్ 87.5 శాతంగా ఉందని వివరించారు. పట్టణాల్లో కూటమి, వైసీపీ ఓట్ల శాతం మధ్య 25.6 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతం వ్యత్యాసం ఉందన్నారు. పట్టణాల్లో కూటమికి 65.7 శాతం పోస్టల్ బ్యాలెట్లు రాగా, వైసీపీకి 27.42 శాతం వచ్చాయని చెప్పారు. పరిషత్ ఎన్నికల్లో కూటమికి 62.83 శాతం, వైసీపీకి 31.46 శాతం పోస్టల్ బ్యాలెట్లు లభించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ఓట్ల శాతాలు చూస్తేనే.. ఉద్యోగులతో సహా అన్ని వర్గాలు కూటమిని ఏ స్థాయిలో ఆదరించారో అర్థం చేసుకోవచ్చన్నారు. బాగా పని చేసిన ఉద్యోగులు, అధికారుల పనితీరును బహిరంగంగానే ప్రశంసిస్తోన్న విషయాన్ని ప్రెస్మీట్లో గుర్తు చేశారు.

తిరుగులేని విజయాలు... తిరుగులేని మెజార్టీలు

రాష్ట్రవ్యాప్తంగా 659 జెడ్పీటీసీ స్థానాలకు గాను కూటమి 575 స్థానాలను కైవసం చేసుకుందని ముఖ్యమంత్రి తెలిపారు. మొత్తం 28 జిల్లాల్లో 27 జిల్లాల్లో కూటమి ఆధిక్యత సాధించిందని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే వైసీపీ కూటమి కంటే ఎక్కువ స్థానాలు సాధించిందని వివరించారు. ఏడు జిల్లాల్లో వైసీపీకి ఒక్క జెడ్పీటీసీ స్థానం కూడా దక్కలేదని చెప్పారు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, మార్కాపురం, పల్నాడు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో వైసీపీ ఖాతా తెరవలేకపోయిందన్నారు. ఎంపీటీసీ ఎన్నికల్లో మొత్తం 9,818 స్థానాలకు గాను కూటమి 7,803 స్థానాలను గెలుచుకుందని, రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మండల అధ్యక్ష స్థానాలను కూటమి కైవసం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిందని ముఖ్యమంత్రి చెప్పారు. మొత్తం 100 మేయర్, చైర్‌పర్సన్ పదవులకు గాను 94 స్థానాలను కూటమి గెలుచుకుందని, 13 మేయర్ పదవుల్లో 12, 87 చైర్‌పర్సన్ పదవుల్లో 82 దక్కించుకుందని తెలిపారు. ఇందులో టీడీపీ 70, జనసేన 20, బీజేపీ నాలుగు మేయర్, చైర్‌పర్సన్ పదవులను సాధించాయని ముఖ్యమంత్రి వివరించారు. మొత్తం 3,941 వార్డులకు గాను 3,233 వార్డుల్లో కూటమి జయకేతనం ఎగురవేసిందని, ఇది 82 శాతమని పేర్కొన్నారు. 100 పట్టణ స్థానిక సంస్థల్లో 95 చోట్ల కూటమికి కౌన్సిల్ మెజారిటీ లభించిందని, 16 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రతి వార్డునూ కూటమి గెలుచుకుందని చెప్పారు. మరోవైపు వైసీపీ 100 పట్టణ స్థానిక సంస్థల్లో కేవలం నాలుగు చోట్లే విజయం సాధించిందని, 3,941 వార్డుల్లో 558 స్థానాలకే పరిమితమైందని తెలిపారు. 22 పట్టణ స్థానిక సంస్థల్లో వైసీపీ ఒక్క వార్డు కూడా గెలుచుకోలేకపోయిందని వివరించారు.

దశాబ్దాల తర్వాత పులివెందులలో స్వేచ్ఛగా పోలింగ్

విశాఖలో 2,47,817 ఓట్ల మెజారిటీ, విజయవాడలో 1,30,872 ఓట్లు, గుంటూరులో 96,294 ఓట్ల ఆధిక్యంతో కూటమి విజయం సాధించిందని ముఖ్యమంత్రి తెలిపారు. పులివెందులలో సైతం కూటమి 13,875 ఓట్ల మెజారిటీతో చైర్‌పర్సన్ పదవిని కైవసం చేసుకుందని, మొత్తం 40 వార్డుల్లో 37 గెలుచుకుందని చెప్పారు. కడప కార్పొరేషన్‌లో 65,588 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడంతో పాటు 66 వార్డుల్లో 64 స్థానాలను కూటమి గెలుచుకుందని వివరించారు. కడప జిల్లాలో రౌడీ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారని, జిల్లాలోని తొమ్మిది పట్టణ స్థానిక సంస్థలూ కూటమి ఖాతాలోకి వచ్చాయని సీఎం చంద్రబాబు అన్నారు. కడప జిల్లాలో 345 వార్డులకు గాను వైసీపీ కేవలం తొమ్మిది స్థానాలకే పరిమితమైందని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే ఫలితాలు ఇలాగే ఉంటాయని ముఖ్యమంత్రి అన్నారు. అనంతపురంలో మేయర్ పదవి దక్కకపోయినా కార్పొరేటర్లలో ఎక్కువ మంది కూటమి తరపున గెలిచారని పేర్కొన్నారు.

మహిళలకు 60 శాతం... బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 62.9 శాతం ప్రాతినిధ్యం

మేయర్లు, చైర్‌పర్సన్ల ఎంపికలో మహిళలకు, వెనుకబడిన వర్గాలకు, సామాజికంగా అణగారిన వర్గాలకు, మైనారిటీలకు పెద్దపీట వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. టీడీపీ నుంచి గెలిచిన 70 మంది మేయర్లు, చైర్‌పర్సన్లలో 42 మంది మహిళలేనని, అంటే 60 శాతం ప్రాతినిధ్యం కల్పించామని వివరించారు. టీడీపీ గెలిచిన పది మేయర్ పదవుల్లో ఎనిమిది స్థానాల్లో మహిళలే బాధ్యతలు చేపట్టనున్నారని చెప్పారు. విశాఖ, విజయనగరం, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, కడప, కర్నూలు, చిత్తూరు నగరాలకు మహిళలు నాయకత్వం వహించనున్నారని తెలిపారు. టీడీపీ నుంచి ఎన్నికైన 70 మంది మేయర్లు, చైర్‌పర్సన్లలో 44 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారని, మొత్తంగా ఈ వర్గాలకు 62.9 శాతం ప్రాతినిధ్యం కల్పించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీలకు 25 పదవులు, ఎస్సీలకు తొమ్మిది, మైనారిటీలకు తొమ్మిది, ఎస్టీలకు ఒక పదవి దక్కిందన్నారు. మొత్తం 27 సామాజిక వర్గాలకు చెందినవారు టీడీపీ తరపున మేయర్లు, చైర్‌పర్సన్లుగా ఎన్నిక కావడం సామాజిక న్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు. టీడీపీ నుంచి ఎన్నికైన పది మంది మేయర్లు పది విభిన్న సామాజిక వర్గాలకు చెందినవారని, వీరిలో నలుగురు బీసీలు, నలుగురు ఓసీలు, ఒకరు ఎస్సీ, మరొకరు మైనారిటీ వర్గానికి చెందినవారని తెలిపారు. మేయర్లు, చైర్‌పర్సన్లలో తొమ్మిది మంది ముస్లిం మైనారిటీలు ఉండగా, వారిలో ఆరుగురు మహిళలేనని సీఎం చంద్రబాబు చెప్పారు.

యువతకు అవకాశాలు... విద్యావంతులకు ప్రోత్సాహం

పట్టణ స్థానిక సంస్థల నాయకత్వంలో యువతకు, విద్యావంతులకు ప్రాధాన్యం ఇచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. టీడీపీ నుంచి గెలిచిన 70 మంది మేయర్లు, చైర్‌పర్సన్లలో 55 మంది డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హతలు కలిగినవారని, వీరిలో 11 మంది పీజీ చదివినవారని వివరించారు. అంటే 78.6 శాతం మంది ఉన్నత విద్యావంతులేనని చెప్పారు.

31 మంది 45 ఏళ్లలోపు వారని, ఎనిమిది మంది 35 ఏళ్లలోపు వారని సీఎం తెలిపారు. పది మంది టీడీపీ మేయర్ల సగటు వయసు 39 సంవత్సరాలని పేర్కొన్నారు. రాజంపేటలో 26 ఏళ్ల డాక్టర్ దొంతం గాయత్రి, మచిలీపట్నంలో 29 ఏళ్ల షేక్ అబ్దుల్ అబీదా, విజయనగరంలో 31 ఏళ్ల అవనాపు భార్గవి, విశాఖలో 32 ఏళ్ల డాక్టర్ ముక్కా శ్రావణి మేయర్లుగా ఎన్నిక కావడం యువతకు ఇచ్చిన అవకాశాలకు నిదర్శనమన్నారు. ఒంగోలులో 27వ డివిజన్ నుంచి 24 ఏళ్ల చావలి చార్వితా కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారని చెప్పారు.

పశ్చిమ జడ్పీ చైర్మన్ పీఠం
జనసేన జడ్పీటీసీ నరసింహ రాజుకే!

- డిప్యూటీ సీఎం,సీఎం పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్!

ప్రజా భూమి ప్రతి నిధి,పాలకొల్లు,

పశ్చిమ జడ్పీ చైర్మన్ పీఠం ఉండి జనసేన జడ్పీటీసీ పీవీఎల్ నరసింహ రాజు కే దక్కుతుంది అని కూటమి వర్గాల్ల నుండి సమాచారం. పశ్చిమగోదావరి జిల్లా ఉండి జడ్పిటిసి కూటమి అభ్యర్థిగా గా15,367 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించిన జనసేన నాయకుడు పీవీఎల్ నరసింహారాజు జడ్పీ చైర్మన్ రేస్లో ముందున్నట్లు ప్రచారం సాగుతుంది. శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురాం కృష్ణంరాజు కూడా నరసింహారాజు కు ఖరారు చేసేందుకు మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు,పవన్ కళ్యాణ్ కూడా నరసింహారాజుకు జడ్పీ చైర్మన్ పదవి ఇప్పించేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు నుంచి కూడా పవన్ కళ్యాణ్ మాట్లాడి ఒప్పించినట్లు తెలుస్తోంది. దీంతో జనసేనకు పశ్చిమ జెడ్పి చైర్మన్ పదవిని కేటాయించడానికి సీఎం కూడా అంగీకరించి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం తో .ఇక ప్రకటన లాంచన ప్రాయమే నని కూటమి పార్టీ నేతల నుండి ప్రచారం సాగుతుంది.ఇదే కనుక జారితే నూతన పశ్చిమ గోదావరి జిల్లా కు జనసేన



జడ్పీటీసీ మొట్ట మొదటి జడ్పీ చైర్మన్ నరసింహ రాజు పేరు చరిత్ర కెక్కు తుందంటున్నారు కూటమి పార్టీ వర్గాలు.



నామవానిపాలెంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు.

శ్రీ సీతారామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాజులూరు మండలం నామవానిపాలెం గ్రామంలో సీతారామ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్, యాళ్ళ ప్రసాద్ చేతుల మీదుగా దీపావళి పండుగ పురస్కరించుకుని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యాళ్ల ప్రసాద్ విచ్చేయగా యూనియన్ సభ్యులు బండారు లోవరాజు, శ్రీను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సీతారామ ఆర్ట్స్అధినేత సలాది రాంబాబు నేతృత్వంలో జరిగిన ఈ సేవా కార్యక్రమం విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా సీతారామ ఫౌండేషన్ కాజులూరు మండలంలోనే కాకుండా జిల్లా స్థాయిలో కూడా విస్తృతస్థాయి కార్యక్రమాలు జరిగేలా కార్యాచరణ త్వరలో ప్రారంభిస్తామని యూనియన్ ప్రెసిడెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నున్న శ్రీను నామా మణికంఠ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు సహకరించిన నామవానిపాలెం గ్రామ ప్రజలందరికీ అభినందనలు తెలియజేశారు

నూజివీడులో జనసేనకు రెండు సీట్లే! వైస్ చైర్మన్ పదవి దక్కేనా?

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

నూజివీడు మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీకి కేటాయించిన ఏడు వార్డుల్లో కేవలం రెండు వార్డుల్లో మాత్రమే విజయం సాధించింది. అయితే మరో రెండు వార్డుల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలవడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ముఖ్యంగా భారీ అంచనాలు పెట్టుకున్న 19వ వార్డులో జనసేన అభ్యర్థి ముత్యాల కామేష్, వైసీపీ అభ్యర్థి శీలం రాము చేతిలో కేవలం 24 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ వార్డులో ఓటింగ్ శాతం భారీగా తగ్గడం కూడా జనసేన విజయావకాశాలపై ప్రభావం చూపినట్లు రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి.మంత్రి పార్థసారథి, నూజివీడు నియోజకవర్గసమన్వయకర్త బర్మా ఫణిబాబు ప్రత్యేకంగా దృష్టి పెట్టినప్పటికీ ఈ వార్డును జనసేన చేజార్చుకోవడం పార్టీ శ్రేణుల్లో నిరాశ కలిగించింది. ఇక 18వ వార్డులో జనసేన అభ్యర్థి తోట పద్మావతి 67 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ వార్డులో సీపీఎం 103 ఓట్లు సాధించడం జనసేన విజయావకాశాలను ప్రభావితం చేసిందనే చర్చ జరుగుతోంది.అయితే జనసేన పార్టీకి కేటాయించిన ఏడు వార్డుల్లో రెండు స్థానాల్లో విజయం సాధించింది. ఒకటో వార్డులో మంచి మెజారిటీతో జనసేన అభ్యర్థి గెలుపొందగా, ఐదో వార్డులో బొబ్బిలి ఉషారాణి కేవలం ఏడు ఓట్ల స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు.నాలుగు నుంచి ఐదు స్థానాలు గెలుస్తుందని అంచనా వేసిన జనసేన పార్టీ రెండు స్థానాలకే పరిమితం కావడం కొంత నిరాశ కలిగించినప్పటికీ, నూజివీడుమున్సిపాలిటీలో పార్టీ తన ఉనికిని చాటుకుంది.ఇప్పుడు అసలు రాజకీయ చర్చ మొదలైంది!మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి జనసేనకు దక్కుతుందా? లేక తెలుగుదేశం పార్టీ తన ఖాతాలో వేసుకుంటుందా?నూజివీడునియోజకవర్గంలో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పదవులు దక్కలేదనే భావన జనసేన శ్రేణుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని జనసేన పార్టీ గట్టిగా డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.ఇక జనసేన తరపున బొబ్బిలి ఉషారాణి పేరు వైస్ చైర్మన్ పదవికి ప్రధానంగా వినిపిస్తోంది.

మరోవైపు తెలుగుదేశం పార్టీలో కూడా వైస్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న నాయకులు అధిక సంఖ్యలో ఉండటంతో పోటీ ఆసక్తికరంగా మారింది.మరి కూటమి ధర్మంలో భాగంగా జనసేనకు వైస్ చైర్మన్ పదవి దక్కుతుందా? లేక తెలుగుదేశం పార్టీ నాయకులకే అవకాశం కల్పిస్తారా?నూజివీడు మున్సిపల్ రాజకీయాల్లో తదుపరి అడుగు ఎటు? జనసేన డిమాండ్‌కు టీడీపీ అధిష్టానం ఎలా స్పందిస్తుంది? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.నూజీవీడు రాజకీయ పరిణామాలపై మరిన్ని తాజా అప్‌డేట్స్ కోసం చూస్తూనే ఉండండి.



ప్రజాభూమి

కోనసీమ

5

మంగళవారం 10 నవంబర్ 2026

రావులపాలెం ఎంపీపీ పీఠాన్ని కూటమి కైవసం చేసుకోవడం చారిత్రాత్మకం

- స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం – ఎన్డీఏ పాలనకు ప్రజల మద్దతు
- మండలంలోని ఆరు ఎంపీటీసీ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులదే విజయం
- నాయకులు, కార్యకర్తల కృషికి పాదాభివందనాలు : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.





ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన విజయం ఎన్డీఏ ప్రభుత్వ పాలనపై ప్రజలు తమకున్న విశ్వాసాన్ని చాటిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం మండల పరిషత్ పీఠాన్ని 40 ఏళ్ల తర్వాత కైవసం చేసుకోవడంతో పాటు, మండలంలోని ఆరు ఎంపీటీసీ స్థానాలనూ గెలుచుకోవడం చారిత్రాత్మక విజయమని ఆయన అభివర్ణించారు. సోమవారం రావులపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో కొత్తపేట జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ నాయకులు తమలంపూడి రామకృష్ణారెడ్డి, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి తదితరులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముందుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు జడ్పీటీసీ, 86 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, నాలుగు జడ్పీటీసీలతో పాటు 75 ఎంపీటీసీ స్థానాలను టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు గెలుచుకున్నారని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. 1986లో ఎన్టీ రామారావు మండల పరిషత్ వ్యవస్థను ప్రవేశపెట్టిన తర్వాత రావులపాలెం మండల పరిషత్‌లో టీడీపీ ఆరు దఫాలుగా విజయం సాధించలేకపోయిందని, 40 ఏళ్ల అనంతరం ఏడోసారి జరిగిన ఎన్నికల్లో కూటమి మండల పరిషత్ పీఠాన్ని దక్కించుకోవడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. బీసీ మహిళకు ఎంపీపీ పదవి దక్కడం మరింత సంతోషకరమన్నారు.

రావులపాలెం మండలంలో మొత్తం 24 ఎంపీటీసీ స్థానాలకు గాను 17 స్థానాలను కూటమి కైవసం చేసుకుందని, రావులపాలెం పట్టణ పరిధిలోని ఆరు ఎంపీటీసీ స్థానాల్లోనూ విజయం సాధించిందని తెలిపారు. ఆర్థికంగా సాధారణ స్థితిలో ఉన్న అభ్యర్థులు సైతం ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించడం ప్రజాస్వామ్యానికి నిదర్శనమన్నారు. లారీ డ్రైవర్ భార్య, చిన్న టీ దుకాణం నిర్వహించే కుటుంబానికి చెందిన అభ్యర్థులు వంటి సామాన్యులకు ప్రజలు అవకాశం కల్పించారని, వారికి ఓటు వేసి గెలిపించిన రావులపాలెం ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వగ్రామమైన గోపాలపురంలో కూడా రెండు ఎంపీటీసీ స్థానాలను టీడీపీ, జనసేన కూటమి గెలుచుకుందని చెప్పారు. 1995 తర్వాత 30 ఏళ్లకు మళ్లీ అక్కడ రెండు స్థానాలను గెలుచుకోవడం విశేషమన్నారు. నియోజకవర్గంలో వైసీపీ కేవలం 11 ఎంపీటీసీ స్థానాలకే పరిమితమైందని, వాటిలోనూ కొన్ని స్థానాల్లో స్వల్ప ఓట్ల తేడాతో కూటమి అభ్యర్థులు ఓటమి పాలయ్యారని వివరించారు. 2024 ఎన్నికల్లో వైసీపీ 151 స్థానాల నుంచి 11 స్థానాలకు పడిపోయిందని, ప్రస్తుతం కొత్తపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పార్టీ కూడా 11 ఎంపీటీసీ స్థానాలకే పరిమితం కావడం గమనార్హమన్నారు. ఎన్నికలకు ముందు వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు, దుష్ప్రచారాలను ప్రజలు విశ్వసించలేదని ఎమ్మెల్యే అన్నారు. గతంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత రెండున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు పరిశీలించి తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఎన్డీఏ కూటమి పాలనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, పేదలు, బీసీలు, మహిళలు, సామాన్య వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని చెప్పారు. ఎన్నికల్లో సామాన్యులకు అవకాశాలు కల్పించిన విధంగానే భవిష్యత్తులోనూ వారికి అండగా ఉంటామన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు పార్టీలు, అభ్యర్థులనే తేడా లేకుండా రేయింబవళ్లు సమష్టిగా కృషి చేశారని ఎమ్మెల్యే కొనియాడారు. ప్రతి ఒక్కరూ తామే అభ్యర్థులమన్న భావనతో పనిచేసి విజయానికి బాటలు వేశారని, వారి కృషి అనిర్వచనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలందరికీ శిరస్సు వంచి పాదాభివందనాలు తెలియజేస్తున్నానన్నారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని అభివృద్ధి పనుల ద్వారా నిలబెట్టుకుంటామని, రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. అందరినీ కలుపుకొని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పష్టం చేశారు.

జీలుగుమిల్లి మండలంలో వైఎస్సార్సీపీ ఘన విజయం!

- జీలుగుమిల్లిలో కూటమి కుదేలైంది!
- కూటమి నాయకులకు కుంటేళ్లు దెబ్బ కొట్టారు!
- మండల పార్టీ ప్రెసిడెంట్ చందా ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

పోలవరం నియోజకవర్గం జీలుగుమిల్లి మండల ప్రజలు వైయస్సార్సీపీ వెంటే ఉన్నామని మరోసారి స్పష్టం చేశారని, పార్టీకి ఘన విజయం అందించిన ప్రతి ఒక్కరికీ మండల పార్టీ ప్రెసిడెంట్ చందా ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులకు కుంటేళ్లు దెబ్బ కొట్టారని ఆయన విమర్శించారు. జీలుగుమిల్లిలో కూటమి కుదేలైంది. నాయకులకు కొంతమంది వైఎస్ఆర్సిపి కి ప్రజాబలం లేదని కూటములోని అనైక్యత వల్ల వైఎస్ఆర్ సీపీ గెలిచిందని మాట్లాడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన కూటమి నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కూటమి అత్యంత బలంగా ఉన్న సమయంలో సైతం, జీలుగుమిల్లి మండల ప్రజలు వైయస్సార్సీపీకి 3,300 పైచిలుకు భారీ మెజారిటీని అందించారనే వాస్తవాన్ని కూటమి నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. ఓటమికి స్వతంత్ర అభ్యర్థులు, రెబల్స్ కారణమని సీనియర్ నాయకులు అనడం హాస్యాస్పదమన్నారు. వైఎస్ఆర్సిపి గెలుపును జీర్ణించుకోలేని పరిస్థితి నెలకొంది. రానున్న కాలంలో ప్రజలకు సేవ చేసి మన్నలు పొందాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. రెబల్ కాండిడేట్స్ కు రెండు పార్టీల నుండి క్రాస్ ఓట్లు వస్తాయని అవగాహన లేనట్టుంది అన్నారు. అయినా కేవలం మూడు చోట్ల మాత్రమే రెబల్స్ ఉన్నారంటున్న వారు, మిగతా ఆరు స్థానాలు ఎందుకు కోల్పోయారని ప్రశ్నించారు. ముఖ్యంగా ఎలాంటి రెబల్స్ సమస్య లేని జడ్పిటిసిస్థానంలోనూ కూటమి అభ్యర్థి ఎందుకు ఓడిపోయిందో సమాధానం చెప్పాలన్నారు. ఓటమిని హుందాగా అంగీకరించి, పరిపాలనలో జరుగుతున్న లోపాలను ప్రజా వ్యతిరేకతను గమనించి సరిదిద్దుకుని ముందుకు వెళ్లాలని చందా ప్రసాద్ హితవు పలికారు. అది వదిలేసి " గెలుపు మాదే" అంటూ ప్రగాల్భాలు పలకడం ప్రత్యక్షంగా ప్రజా తీర్పును అవమానించడమేనని ధ్వజమెత్తారు. జీలుగుమిల్లి మండల ప్రజలు వైఎస్ఆర్సీపీకి అందించిన ఈ ఆదరణ చిరస్మరణీయమని, రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రజలు ఇదే రీతిలో తమ పార్టీని ఆశీర్వదిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ఆర్సిపి నాయకులు ప్రతి పంచాయతీల సమన్వయంతో పని చేశారని, ప్రతి ఒక్కరు తమ గెలుపుగా భావించి పార్టీని ముందుకు తీసుకెళ్లారని అన్నారు. ఇది వైఎస్ఆర్ పార్టీ నిబద్ధతని ఆయన అన్నారు. పార్టీకి కష్టపడి పని చేసిన నాయకులకు, గ్రామస్థాయిలోని వైఎస్ఆర్సిపి నాయకులకు, ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

వనుం జై ప్రకాష్‌కు స్వర్ణ పతకం



- అంతర్జాతీయ స్థాయిలో అండర్-12 విభాగంలో ప్రతిభ చాటి జిల్లాకు, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన బాలుడు
- ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ అంతర్జాతీ య స్థాయిలో విజయం సాధించడం అభినందనీయం
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి, కాకినాడ

కాకినాడ జిల్లా కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన వనుం జై ప్రకాష్ వెస్ట్రన్ ఏషియన్ యూత్ చెస్ ఛాంపియన్‌షిప్--2026 పోటీలలో అండర్-12 ఓపెన్ విభాగంలో స్వర్ణ పతకంసాధించడం ఎంతో అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు జై ప్రకాష్ ఉపాధ్యాయులతో కలిసి జిల్లా కలెక్టర్ ను కలసి మర్యాద పూర్వకంగా కలిశారు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకువచ్చిన బాలుడు జై ప్రకాష్‌ను జిల్లా కలెక్టర్ అభినందించారు. గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక వెస్ట్రన్ ఏషియన్ యూత్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులతో పోటీపడిన జై ప్రకాష్ అద్భు తమైన క్రీడా నైపుణ్యం, ఏకాగ్రత, వ్యూహాత్మక ఆలోచనా సామర్థ్యాన్ని ప్రదర్శించి మొత్తం 9 రౌండ్లలో 7.5 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలి చాడన్నారు ఈ విజయం తో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడంతో పాటు తన ఫిడే అంతర్జాతీయ చెస్ రేటింగ్‌ను 1907 నుంచి 2070 పాయింట్లకు పెంచుకోవడం విశేషమన్నారు. ప్రస్తుతం గైగోలుపాడు ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో ఏడవ తరగతి చదువుతున్న జై ప్రకాష్, గ్రామీణ ప్రాంతానికి చెందిన సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి అంత ర్జాతీయ స్థాయిలో ఈ ఘనత సాధించడం ఇతర విద్యార్థు లకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అన్నారు. జై ప్రకాష్ తండ్రి పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ, కుటుంబ బాధ్య తలతో పాటు కుమా రుడిలోని క్రీడా ప్రతిభను గుర్తించి ప్రో త్సహించడం అభినందనీయమన్నారు. జై ప్రకాష్ ఇప్పటి వరకు అంతర్జాతీయ స్థాయిలో ఒక పతకం, జాతీయ స్థాయి లో రెండు కాంస్య పతకాలు, రాష్ట్ర స్థాయి లో నాలుగు ప్రథ మ బహుమతులు, జిల్లా స్థాయిలో ఎనిమిది ప్రథమ స్థానా లు సాధించడం అతని నిరంతర కృషి, పట్టుదల, క్రీడా ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేందుకు తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సూచిం చారు. ప్రతిభ కలిగిన గ్రామీణ ప్రాంత విద్యా ర్థులను గుర్తిం చి వారికి అవ సరమైన శిక్షణ, ప్రోత్సాహం, తగిన అవకా శాలు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజ యాలు సాధించే అవకాశం ఉంటుంద న్నారు. చిన్న వయ స్సులోనే అంతర్జాతీయ చెస్ పోటీలలో స్వర్ణ పతకం సాధిం చిన జై ప్రకాష్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరో హించాలని, గ్రాండ్ మాస్టర్ స్థాయికి ఎదిగి దేశానికి మరింత కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆకాం క్షించారు. జై ప్రకాష్‌కు, అతని తల్లి దండ్రులకు హృదయ పూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

మేయర్ రెడ్డి అప్పలనాయుడుకు అభినందనల వెల్లువ

వివిధ సంఘాల నాయకులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజల నుంచి ఘన స్వాగతం



ప్రజాభూమి ఏలూరు

నగర మేయర్‌గా ఎన్నికైన రెడ్డి అప్పలనాయుడుకు వివిధ వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.మేయర్‌గా ఎన్నికైన నేపథ్యంలో ఆయన నివాసం,పార్టీ కార్యాలయం వద్దకు వివిధ సంఘాల నాయకులు,స్వచ్ఛంద సంస్థల నిర్వా హకులు, అభిమానులు,ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శు భాకాంక్షలు తెలియజేస్తున్నారు.పుష్పగుచ్ఛాలు అందజేస్తూ, శాలువాలతో ఘనంగా సత్కరిస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.ఈ సందర్భంగా పలువురు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలను దగ్గరగా తెలుసుకుంటూ,వారి సమస్యలపై అవగాహన కలిగిన రెడ్డి అప్పలనాయుడు నగర మేయర్‌గా ఎన్నిక కావడం సంతోషకరమన్నారు.ఆయన నాయకత్వంలో ఏలూరు నగరం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.నగర ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడ్డారు.అనంతరం మేయర్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ వివిధ వర్గాల ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలు,ఆదరణ తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు.తన విజయానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ, అందరి సహకారంతో ఏలూరు నగర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.నగర ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.మేయర్‌గా తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఏలూరు నగర అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసుకుంటానని తెలిపారు.



స్థానిక ఎన్నికల్లో కూటమి విజయాలు

- రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తాం: ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ఏలూరు

పుర,నగరపాలక ఎన్నికలతో పాటు ప్రాదేశిక ఎన్నికల్లోనూ కూటమి భాగస్వామ్య పక్షాలు విజయాలు నమోదు చేశాయని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు.రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి విజయాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.సోమవారం ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి ప్రజల నుంచి వినతులు స్వీకరించి,వారి సమస్యలను తెలుసుకున్నారు.సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం స్థానిక ఎన్నికల్లో కూటమి తరఫున విజయం సాధించిన పలువురు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు,గజమాలలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.వారి అభిమానానికి ఎమ్మెల్యే చంటి ధన్యవాదాలు తెలియజేశారు.ఇదిలా ఉండగా,ఏలూరు పత్తేబాదలోని శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామివారి దేవస్థాన ధర్మకర్తల మండలి ప్రతినిధులు,అర్చకులు ఎమ్మెల్యేను కలిసి కార్తీకమాసోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసి,మహోత్సవాలకు ప్రత్యేకంగా ఆహ్వానించారు.

న్యాయ సేవాధికార సంస్థ ద్వారా
వేలాది మందికి ఉచిత న్యాయ సహాయం



ప్రజాభూమి ఏలూరు

జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఏలూరులో సోమవారం న్యాయ సేవాధికార దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది కాలంలో 15100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా 4 వేల మందికి పైగా ఉచిత న్యాయ సలహాలు, సహాయం అందించామని తెలిపారు.మూడు జాతీయ లోక్ అదాలత్‌లలో 24 వేలకుపైగా కేసులను పరిష్కరించి రూ.132 కోట్ల వరకు పరిహారం అందించామన్నారు.అలాగే 17 లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేస్తున్నామని వివరించారు.ప్రజలు న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి,ఇతర న్యాయమూర్తులు,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనె సీతారాం,డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్,డీఆర్ఓ ఎం.ముక్కంటి, న్యాయవాదులు,కోర్టు సిబ్బంది,పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రాథమిక వైద్య సేవల నాణ్యతపై
రాష్ట్ర స్థాయి సమీక్ష



ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలోని సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర స్థాయి సమీక్ష బృందం సోమవారం సందర్శించి వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. మాతా శిశు ఆరోగ్య విభాగం సంయుక్త సంచాలకులు డాక్టర్ సతీష్, జాతీయ ఆరోగ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ప్రోగ్రాం అధికారి కె. గంగాధర్, డాక్టర్ నరేంద్ర కృష్ణ, జిల్లా వైద్య కార్యక్రమాల నిర్వహణ అధికారి డాక్టర్ రోహిత్‌లతో కూడిన బృందం ఆసుపత్రిలోని ప్రసూతి గది, టీకాల నిల్వ కోసం ఏర్పాటు చేసిన శీతలీకరణ పరికరాలు, ఔషధాల సరఫరా నిర్వహణకు సంబంధించిన ఈ-ఔషధి విధానాన్ని పరిశీలించింది. రోగుల వైద్య సేవల కోసం కేటాయించిన నిధుల వినియోగం, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం, క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం, కుష్ఠు వ్యాధి నివారణ, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్, జననీ సురక్ష యోజన, మాతా శిశు ఆరోగ్య సేవల అమలు తీరును సమీక్షించింది. ఆయా కార్యక్రమాలకు సంబంధించిన రిజిస్టర్లు, వైద్య రికార్డులు, సేవల నిర్వహణ పద్ధతులను తనిఖీ చేసి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవల నాణ్యత, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, నిర్వహణ ప్రమాణాలను పరిశీలించింది.



ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

మంగళవారం 10 నవంబరు 2026

పంచాయతీ సర్పంచికి వార్డు సభ్యుడికి గుర్తులు సిద్ధం చేసిన ఎన్నికల కమిషన్.

సర్పంచ్ కు 25 గుర్తులు, వార్డు సభ్యుడికి 20 గుర్తులు.

ప్రజాభూమి, పుట్లూరు.



గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ఈ నెల 26, 29, డిసెంబరు 2వ తేదీల్లో జరగనున్నాయి. ఇందులో భాగంగా సర్పంచి అభ్యర్థుల కోసం 25, వార్డు సభ్యుల కోసం 20 చొప్పున గుర్తులు కేటాయించారు. వీటికి అదనంగా నోటా ఉండనుంది. అభ్యర్థుల సంఖ్య పెరిగితే కొత్త గుర్తులు కేటాయించనున్నారు.

సర్పంచ్ గుర్తులు ఇవే..

మంచం, కత్తెర, ఉంగరం, బుట్ట, వంకాయ, కప్పు సాసరు, క్యారెట్, తాళం చెవి, గొలుసు, కుర్చీ, బ్యాట్, టెలిఫోన్, బల్ల, మొక్కజొన్న, పలక, ద్రాక్షపళ్లు, తిరగలి, కుండ, అరటిపండు, కొవ్వొత్తులు, నల్లబోర్డు, అనాసపండు, షటిల్, చేతికర్ర, చెంచా.

వార్డు సభ్యుల గుర్తులు.-ప్రెషర్ కుక్కర్, గౌను, స్టూల్, ఇస్త్రీపెట్టె, పోస్ట్ డబ్బా, గ్యాస్ స్టౌ, బీరువా, ఐస్క్రీమ్, కెటిల్, కటింగ్ ప్లేయర్, విద్యుత్ స్తంభం, గరాటా, డిష్ యాంటెన్నా, రంపం, కెమెరా, క్యారమ్ బోర్డు, వయో లిన్, బెండకాయ, బెల్టు, కోటు గుర్తులు.

అక్రమ ఇసుక రవాణా ఆపాలి

ప్రజాభూమి యల్లనూరు



మండల పరిధిలోని చిలమకూరు గ్రామ ప్రజలు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో ఇసుక అక్రమ రవాణా తో కొందరు యాజమాన్యం వారు ప్రభుత్వ భూములు, డీకేటి పట్టా, రిజిస్ట్రేషన్ భూములు కలిగిన నిరుపేదలను ఆసరాగా చేసుకుని ఎటువంటి అనుమతులు తీసుకోకుండా చిత్రావతి నదిలోనే ఇసుక తరలిస్తున్నారు అంటూ చిలమకూరు మాజీ సర్పంచ్ నాగరాజు తాసిల్దార్ సింధు వారికి సమస్య విన్నవించగా తాసిల్దార్ సింధు మాట్లాడుతూ మీకు ఎటువంటి సమస్యలు ఉన్నా అర్జీ రాసి ఇవ్వాలని వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని, అక్రమంగా ఇసుక సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం తప్పక జరుగుతుందని గ్రామస్తులకు ఆమె తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులను కలిసిన గెలిచిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు.

విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు,జడ్పీటిసిలకు శుభాకాంక్షలు తెలిపిన జొన్నలగడ్డ వద్మావతి దంపతులు.

ప్రజాభూమి, పుట్లూరు.



శింగణమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ వద్మావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ వింగ్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబ శివారెడ్డిని సింగణమల నియోజక వర్గంలోని పలు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ విజయం సాధించిన ఎంపీటీసీలు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురంలోని వారి నివాసానికి చేరుకున్న విజయం సాధించిన ఎంపీటీసీలు జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డిని కలిసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన ఎంపీటీసీలకు జొన్నలగడ్డ పద్మావతి దంపతులు శుభాకాంక్షలు తెలియజేశారు.తమ విజయానికి సహకరించి, అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డికి ఎంపీటీసీలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

160వ సోమవారం అన్నప్రసాదం.

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండలంలోని శ్రీ పోతులూరి వీరబ్ర హ్మేంద్రస్వామి దేవాలయంలో 160వ సోమవార అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిం చడం జరిగినది. పుట్లూరు మం డలం, ఎంపీడీవో కార్యాలయం సమీ పంలో గల శ్రీ పోతులూరి వీరబ్ర హ్మేంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో 160వ సోమవార అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ అభివృద్ధి కోసం నిర్వహించబడింది. ఈ కార్యక్రమములో దాతలు ఆర్. ఓబులేశ్, భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కో-కన్వీనర్ కుందు శ్రీనివాసుల రెడ్డి మరియు భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగాన్ని వదిలి.. ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి శివానందరెడ్డి

ప్రజా భూమి నార్పల



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ మంచి భవిష్యత్తు ఉన్నప్పటికీ, ప్రజలకు మరింత చేరువగా ఉంటూ సేవ చేయాలనే ఆలోచనతో రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు నార్పల జడ్పీటీసీ బి. శివానందరెడ్డి. ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చిన ఆయనకు ప్రజలు విశేష ఆదరణ చూపించారు. అత్యధిక మెజార్టీతో జడ్పీటీసీగా గెలిపించి తమ మద్దతు ప్రకటించారు. ఈ విజయాన్ని ప్రజల నమ్మకానికి ప్రతీకగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. తాగునీటి సమస్యలు, రహదారుల ఇబ్బందులు పరిష్కరించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని వెల్లడించారు. మంచానికే పరిమితమైన అర్హులకు కూడా పింఛన్లు అందని పరిస్థితి ఉందని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తానని, నార్పల మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జడ్పీటీసీ శివానందరెడ్డి పేర్కొన్నారు.

ప్రజా తీర్పులో వైఎస్సార్‌సీపీకి విజయఢంకా

13 ఎంపీటీసీ స్థానాలు కైవసం.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

ప్రజా భూమి నార్పల



నార్పల మండలంలో జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల మద్దతుతో ఘన విజయం సాధించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి తెలిపారు. మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ప్రజలు పార్టీపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 74 శాతం పోలింగ్ నమోదు కాగా, వైఎస్సార్‌సీపీకి 56.84 శాతం ఓట్లు లభించాయని, తెలుగుదేశం పార్టీపై 21.47 శాతం ఓట్ల ఆధిక్యం సాధించామని వెల్లడించారు. మండల కన్వీనర్ ఖాదర్ వలి ఖాన్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఈ విజయం వెనుక పార్టీ నాయకులు, కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేశారని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజలు, గ్రామ పెద్దలు అందించిన ఆదరణ, సహకారం మరువలేనివని అన్నారు. జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, సింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సాకే శైలజానాథ్ నాయకత్వం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసం పార్టీ విజయానికి ప్రధాన బలంగా నిలిచాయని పేర్కొన్నారు. విజయం సాధించిన అభ్యర్థులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారని వెల్లడించారు.

యువతకు సరైన దిశానిర్దేశం

ఎన్నికల్లో సాధించిన విజయం తమపై మరింత బాధ్యతను పెంచిందని, మండలంలోని యువతకు సరైన మార్గదర్శకత్వం అందిస్తూ వారు చెడు మార్గాల వైపు వెళ్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో ప్రశాంతమైన వాతావరణం కొనసాగేందుకు ప్రజాసంఘాలు, కమ్యూనిస్టులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

సంక్షేమ పథకాల అమలుకు కృషి

నార్పల మండల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా పనిచేస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మండల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తామని సత్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు. నమావేశంలో తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార దుర్వినియోగం

-ఒత్తిళ్లకు భయపడొద్దు.. -పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కండి -వైసీపీ ముఖ్య నేత వేణురెడ్డి పిలుపు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మున్సిపల్ నుంచి మండల, జిల్లా పరిషత్ ఎన్నికల వరకు అధికార పార్టీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత వేణురెడ్డి ఆరోపించారు. పోలీసుల ద్వారా వైసీపీ నాయకులు, అభ్యర్థులను వేధించడంతో పాటు కౌంటింగ్ కేంద్రాల్లోనూ అక్రమాలకు పాల్పడి ఫలితాలను తారుమారు చేశారని విమర్శించారు. గత ఎన్నికల్లో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎవరూ అధైర్యపడకుండా ధైర్యంగా పోటీకి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామ పంచాయతీల నాయకులతో వేణురెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే జరిగిన మున్సిపల్, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో అధికార పార్టీకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చిందన్నారు. అయితే అధికార పార్టీ నాయకులు వ్యవస్థలను అడ్డు పెట్టుకొని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులకు అడుగడుగునా పోలీసుల ద్వారా అడ్డంకులు సృష్టించారని, నోటీసుల మీద నోటీసులు జారీ చేయడంతో పాటు అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ఇంతటితో ఆగకుండా మున్సిపల్ కౌంటింగ్ సమయంలో కౌంటింగ్ కేంద్రాన్ని టీడీపీ కార్యాలయంగా మార్చుకున్నట్లు వ్యవహరించారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచిన స్థానాల్లో రీకౌంటింగ్ పేరుతో ఫలితాలను తారుమారు చేశారని ఆరోపించారు. ఇందుకు కొందరు అధికారులు కూడా పూర్తిస్థాయిలో సహకరించారని విమర్శించారు. ఇదే తరహాలో గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ అధికార పార్టీ నాయకులు వ్యవహరించారని అన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో బాలకృష్ణ వ్యక్తిగత సహాయకులు ఉండి అధికారులపై ప్రభావం చూపుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకొని తాను కౌంటింగ్ కేంద్రానికి వెళ్లి పోలీసు అధికారులను నిలదీయడంతో వారిని అక్కడి నుంచి పంపించారని తెలిపారు. అధికార పార్టీ నాయకులు ఓటర్లను డబ్బులతో ప్రలోభాలకు గురిచేసినప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ చేసిన స్థానాల్లో ప్రజలు మంచి మెజారిటీతో ఆదరించారని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కౌంటింగ్ ఆయా పంచాయతీ కేంద్రాల్లోనే నిర్వహించనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ప్రతి ఓటును అభ్యర్థులు, ఏజెంట్లకు స్పష్టంగా చూపిస్తున్నారా లేదా నిశితంగా పరిశీలించాలని అన్నారు. గత ఎన్నికల్లో జరిగినట్లు ఆరోపణలు ఎదురైన ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించే సమయంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఏ విధంగా నీరుగార్చిందో ప్రజలకు వివరించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం అమలు తీరుతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజా సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, అధికార పార్టీ ఒత్తిళ్లకు భయపడకుండా ప్రతి ఒక్కరూ ఎన్నికల బరిలో నిలవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు పోటీ చేసేలా నాయకులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ నమావేశంలో వివిధ గ్రామ పంచాయతీల నాయకులతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ జెండా సాక్షిగా మున్సిపల్ నిర్లక్ష్యం....!

• లక్షలు వెచ్చించి నిర్మాణం, నిర్వహణ మాత్రం గాలికి.. • సుందరీకరణ ప్రాంతాన్ని చెత్త సేకరణ కేంద్రంగా మార్చేశారు

• పార్టీలకు అతీతంగా స్పందించిన యువకుడు సాయి :కమిషనర్‌కు వినతి

ప్రజాభూమి, హిందూపురం టౌన్





దేశభక్తికి ప్రతీకగా నిలవాల్సిన జాతీయ త్రివర్ణ పతాక నిర్మాణం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. పట్టణ సుందరీకరణలో భాగంగా లక్షలాది రూపాయలు వెచ్చించి ఎంతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన నిర్మాణం నేడు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో కళావిహీనంగా మారింది. ప్రజలు సేదతీరుతూ సెల్ఫీలు దిగే ఆహ్లాదకర ప్రాంతంగా తీర్చిదిద్దాల్సిన చోట మున్సిపల్ శాఖ చెత్త సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. మూడు సంవత్సరాల క్రితం 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో కొట్నూరు చెరువు కట్ట మరువ వద్ద పట్టణ సుందరీకరణలో భాగంగా జాతీయ త్రివర్ణ పతాకంతో పాటు 75వ స్వాతంత్ర దినోత్సవ ప్రత్యేక లోగోను ఏర్పాటు చేశారు. ఇందుకోసం లక్షలాది రూపాయలు వెచ్చించారు. ఎంతో ఆకర్షణీయంగా రూపొందించిన ఈ నిర్మాణం పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ప్రారంభంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి అనేకమంది అక్కడికి వెళ్లి కొద్దిసేపు సేదతీరడంతో పాటు సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపేవారు. దీంతో ఆ ప్రాంతం పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయితే ఆ ఆకర్షణ ఎంతోకాలం నిలవలేదు. నిర్మాణం ఏర్పాటు చేసిన తర్వాత దాని నిర్వహణను మున్సిపల్ శాఖ పూర్తిగా విస్మరించింది. ఫలితంగా పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగి నిర్మాణం మొత్తం అపరిశుభ్రంగా మారిపోయింది. మరోవైపు అదే ప్రాంతంలో మున్సిపల్ శాఖ చెత్త సేకరణ పాయింట్‌ను ఏర్పాటు చేయడంతో పరిస్థితి మరింత దిగజారింది. చెత్త వాహనాల ద్వారా సేకరించిన వ్యర్థాల నిర్వహణ చేపడుతుండటంతో గాలికి చెత్త, ధూళి జాతీయ జెండా నిర్మాణంపై పడుతోంది. దేశ గౌరవానికి ప్రతీకగా ఉండాల్సిన ప్రాంతం చెత్త నిర్వహణ కేంద్రం పక్కన ఉండటంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన సుందరీకరణ ప్రాంతాలను కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితం చేయకుండా వాటి నిర్వహణపై కూడా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి జాతీయ జెండా గౌరవాన్ని కాపాడటంతో పాటు కొట్నూరు చెరువు కట్ట ప్రాంతానికి పూర్వపు ఆకర్షణ తీసుకురావాలని కోరుతున్నారు.

సమస్యపై స్పందించిన యువకుడు సాయి

పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యలపై బాధ్యతగా స్పందించే యువకుడు సాయి ఈ పరిస్థితిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జాతీయ జెండా నిర్మాణం ఏర్పాటు చేసినప్పటి ఆకర్షణీయమైన పరిస్థితి, ప్రస్తుతం నిర్వహణ లేక నెలకొన్న దుస్థితిని వివరించారు. గతంలోనూ ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలికంగా శుభ్రం చేశారని, ఆ తర్వాత మళ్లీ యథాతథ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కేవలం తాత్కాలిక శుభ్రత చర్యలతో సరిపెట్టకుండా చెత్త సేకరణ కేంద్రాన్ని అక్కడి నుంచి తరలించాలని, నిర్మాణంపై పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కోరారు. జాతీయ జెండా నిర్మాణాన్ని కొనసాగించాలనుకుంటే నిరంతర నిర్వహణ బాధ్యత తీసుకోవాలని, ఆహ్లాదకరమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

-గ్రామీణుల్లో చైతన్యం తీసుకురావాలి -న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవంలో అదనపు జిల్లా జడ్జి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మనిషి పుట్టుక నుండి మరణం వరకు ప్రతి అంశం చట్టంతో ముడివడి ఉంటుందని, ప్రతి ఒక్కరూ అదనపు జిల్లా జడ్జి వి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్నపాటి సమస్యలకు న్యాయస్థానాలు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి వ్యయప్రయాసాలకు గురికాకుండా రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు న్యాయసేవాధికార సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ న్యాయసేవాధికార సంస్థ ద్వారా చట్టాలపై అవగాహన కల్పించడంతోపాటు అర్హత ఉన్న వారందరికీ న్యాయ సహాయం అందించడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ద్వారా ఇరు వర్గాలతో సామరస్యంగా చర్చించి కేసులను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. దీనివల్ల ప్రజలకు పారా లీగల్ వాలంటీర్లు చట్టాలపై న్యాయవాదులకు ఎలాంటి నష్టం ఉండదని, వీటిపై కక్షిదారులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. సామాజిక సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను కూడా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందనిబు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పారా లీగల్ వాలంటీర్లు చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తరచూ సమావేశాలను ఏర్పాటు చేసి చట్టాలు, న్యాయ సంబంధ విషయాలపై చర్చించి చైతన్యం తీసుకురావాలని న్యాయమూర్తి సూచించారు. పారా లీగల్ వాలంటీర్లకు న్యాయవాదుల ద్వారా శిక్షణ ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. లోక్ అదాలత్‌తో ఇప్పటికే ఎన్నో సామాజిక సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. అలాంటి వాటిపై న్యాయవాదులు కూడా దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంత గోపాలకృష్ణ, ఏజిపి రామచంద్రప్ప, న్యాయవాదులు రాజశేఖర్, సిద్దు, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
మంగళవారం 10 నవంబరు 2026

జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ అలవాటు - ప్రాణాలతో చెలగాటం - ప్రముఖ వ్యాఖ్యాత నాగేశ్వర్ రెడ్డి

మాదకద్రవ్యాలకు వద్దు అందాం - భారతావని మనందరి బాధ్యత - కళాశాల డీన్ మాధవ

రక్తదానం, నేత్రదానం, అవయవదానంపై అవగాహన కల్పించడం సామాజిక బాధ్యత - సేవాసమితి అధ్యక్షులు రాజు

ప్రజాభూమి, పులివెందుల :



పాశ్చాత్య ఆహారపు అలవాట్లకు ఆకర్షితులై జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ ను అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి తీవ్ర హానికరమని, ఇటువంటి ఆహారపు అలవాట్లు మనిషి ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ప్రముఖ వ్యాఖ్యాత నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు సమాజంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వక్తలు పిలుపునిచ్చారు.పులివెందుల పట్టణంలోని ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి, కళాశాల జాతీయ సేవా పథకం విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలి, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణ, సామాజిక బాధ్యత, యువత భవిష్యత్తుపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రముఖ వ్యాఖ్యాత నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువతతో పాటు చిన్నారులు కూడా జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ పట్ల ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని అన్నారు. రుచికి ప్రాధాన్యత ఇచ్చి పోషక విలువలు లేని ఆహారాన్ని తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. సమతుల ఆహారం, పౌష్టికాహారం తీసుకోవడం, క్రమబద్ధమైన ఆహారపు అలవాట్లు పాటించడం, శారీరక శ్రమకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి ఆహారపు అలవాట్లను అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల డీన్ మాధవ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే అనర్థాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలకు వద్దు అందాం, భారతావని మనందరి బాధ్యత అనే నినాదంతో ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని తెలిపారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ సమాజ సేవ అనేది కేవలం ఒక కార్యక్రమానికి పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని అన్నారు. రక్తదానం, నేత్రదానం, అవయవదానంపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించడం సామాజిక బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని, నేత్రదానం ద్వారా మరణానంతరం ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించే అవకాశం ఉందని వివరించారు. అవయవదానం ద్వారా ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని, సేవాభావం, మానవతా విలువలు, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని అలవరచుకోవాలని రాజు సూచించారు. ఆరోగ్య పరిరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలన, రక్తదానం, నేత్రదానం, అవయవదానం వంటి అంశాలపై యువతలో చైతన్యం తీసుకురావడానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటిస్తూ, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు కీర్తి, జయమ్మ, రాజశేఖర్ రెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి సభ్యులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి గ్రామోత్సవం

- దీపావళి నందర్భంగా వురవీధుల్లో స్వామివారి ఊరేగింపు

ప్రజాభూమి, వేంపల్లె



దీపావళి పండుగను పురస్కరించుకుని ఆదివారం రాత్రి శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామివారి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీపావళి సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి స్థానిక పట్టణ పురవీధుల్లో (ఎద్దులకొండ్రాయుని) ఊరేగించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సుభాష్, ఆలయ పాలకమండలి చైర్మన్ పి.వి. రమణ తెలిపారు. ఆలయ నహాయ అర్చకులు తిరుమల వేణు నేతృత్వంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఆస్థానం, నివేదన, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొబ్బరికాయలు, పండ్లు, పుష్పాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు అద్దంకి రామయ్య, కోనేటి రాజమ్మ, జూటూరి జ్యోతి, తప్పెట వరాలు, కొమ్మది వెంకటసుబ్బమ్మ, భక్తులు, దేవస్థాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ తో సప్లయర్స్ షాపు దగ్ధం

ఏడు లక్షల ఆస్తి బూడిద - సకాలంలో స్పందించి మంటలు అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డు, సీఎస్ఐ చర్చి సమీపంలో ఉన్న గంగాభవాని సప్లయర్స్ షాపులో ఆదివారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ సంభవించింది. తొండూరు మండలం మడూరు గ్రామానికి చెందిన గంగా మహేష్ పులివెందులలో గంగాభవాని సప్లయర్స్ షాపు పెట్టుకుని వివాహాలకు, విందులకు, శుభకార్యాలకు సప్లై వస్తువులను, షామియానాలను సరఫరా చేస్తుంటాడు. అయితే ఆదివారం అర్ధరాత్రి జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్ల షాపులో ఉన్న వంట సామాగ్రి, ఫర్నిచర్ తో పాటు షామియానాలు పూర్తిగా కాలిపోయాయి. షాపులో మంటలు వ్యాప్తి చెందుతుండడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా అగ్నిమాపక శాఖ అధికారి సునీల్ కుమార్ తన సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే సామాన్లు, ఫర్నిచర్ కాలిపోయాయని వారు తెలిపారు. దీంతో సుమారు ఏడు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. బాధితుడిని ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

- అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ

ప్రజాభూమి, వేంపల్లె



జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు, కంటి సమస్యలను ముందుగానే గుర్తించి అవసరమైన చికిత్స అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆప్తాల్మిక్ ఆఫీసర్ కే. శరత్ బాబు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే కంటి అద్దాలు అవసరమైన విద్యార్థులను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు కంటి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం), కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి. వెంకటరత్నం, సూపర్వైజర్ కే. అంకయ్య, ఏఎన్ఎం కే. మాధవి, ఎంఎల్హెచ్పీ ఎస్. షాకీర్, ఆశా కార్యకర్త మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ధనలక్ష్మి దేవిగా దర్శనమిచ్చిన శ్రీ వాసవి మాత

- రూ.1.71 కోట్ల నగదు, బంగారు, వెండి ఆభరణాలతో అమ్మవారికి అలంకరణ



ప్రజాభూమి, వేంపల్లె:

స్థానిక పట్టణంలోని 122 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ తెలిపారు. ఆదివారం దీపావళి సందర్భంగా వేంపల్లె ఆర్యవైశ్యుల సహకారంతో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ధనలక్ష్మి పూజ, శ్రీ లలితా సహస్రనామ పారాయణం, కుంకుమ పూజ, నాణేలతో శ్రీ లక్ష్మీ అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి మాతను రూ.1,71,00,000 విలువైన నగదు, బంగారు, వెండి ఆభరణాలతో శ్రీ ధనలక్ష్మి దేవిగా అలంకరించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, నివేదన, నక్షత్ర హారతి, మహా మంగళహారతి, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు భక్తి పాటలు ఆలపిస్తూ అమ్మవారికి హారతులు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బారావు, శ్రీ వాసవి కల్యాణ మండపం సభ్యులు నిర్మల, మాధవి, మృదుల, సునీత, వరలక్ష్మి, హేమావతి, లలిత, కవిత, సత్యవతి, అనురాధ, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు, ఆలయ నిర్వాహకులు మిట్ట ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అలంకరణ చేపల పెంపకం - అక్వేరియం తయారీపై సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమం

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అలంకరణ చేపలు - అక్వేరియం తయారీపై నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.కళాశాల వైస్ ప్రిన్సిపల్, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ యు. శ్రీనిత ఆధ్వర్యంలో విద్యార్థినులకు అక్వేరియం చేపల పెంపకంపై శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు అలంకరణ చేపల పెంపకంపై అవగాహన కల్పించడం ఎంతో మంచిదని తెలియజేశారు. ఇలాంటి కోర్సుల ద్వారా విద్యార్థినులు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల రంగురంగుల అలంకరణ చేపలు, వాటి ప్రత్యేకతలు, జీవన విధానం, ఆహారపు అలవాట్లు,ఆవాస పరిస్థితుల గురించి నేర్చుకున్నామని విద్యార్థినులు తెలిపారు. అక్వేరియం చేపల పెంపకం ఒక మంచి అభిరుచిగా మాత్రమే కాకుండా, తమకు ఉపాధి అవకాశం గా కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.గోల్డ్ ఫిష్, గప్పీ, మోలీ, ఏంజెల్ ఫిష్ వంటి చేపల గురించి విద్యార్థినులకు వివరించారు. డాక్టర్ శ్రీనిత మాట్లాడుతూ చేపలకు స్వచ్ఛమైన నీరు, తగిన ఆహారం, ఆక్సిజన్ మరియు అనుకూలమైన వాతావరణం కల్పించడం ఎంతో ముఖ్యమని,అక్వేరియం నిర్వహణ ద్వారా జీవవైవిధ్యం, జలచరాల సంరక్షణ పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందని ఆమె అన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉత్తమ పి.ఎల్.వి గా సాగినాల అహమ్మద్ కు ప్రశంసా పత్రం



ప్రజాభూమి,పులివెందుల

జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా కడప జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవా సదన్ లో నిర్వహించిన కార్యక్రమంలో పులివెందులకు చెందిన సాగినాల అహమ్మద్ కు ఉత్తమ పి.ఎల్.వి గా ప్రశంసా పత్రం అందజేశారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామగోపాల్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ చేతుల మీదుగా ఈ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయ సేవలపై అవగాహన కల్పించడం, ఉచిత న్యాయ సహాయం గురించి ప్రజలకు తెలియజేయడం, అర్హులైన వారికి న్యాయ సేవలు చేరువ చేయడంలో పి.ఎల్.వి గా అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ ప్రశంసా పత్రం అందజేశారు.ఈ సందర్భంగా అహమ్మద్ ను పలువురు అభినందించారు.

మిట్ట మల్లేశ్వరునికి విశేష పూజలు

విద్యుత్ దీపాలంకారాలతో శోభాయమానంగా ఆలయం - భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల పట్టణంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన పురాతన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు రుద్ర, శివ స్వాముల ఆధ్వర్యంలో మిట్ట మల్లేశ్వరునికి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉద యాస్తమాన పరమేశ్వరునికి పంచామృత అభిషేకం, భస్మాభిషేకం, బిల్వార్చన, సహస్రనామార్చన తదితర పూజా కైంకర్యాల అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు మాట్లాడుతూ కార్తీక మానం ప్రారంభం కావడంతో ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలంకారాలతో ఎంతో శోభాయమానంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ పవిత్ర మాసంలో శివునికి, మహావిష్ణువుకి, తులసి మాతకు దీపాలు వెలిగించడం, వ్రతాలు, ఉపవాసాలు, నది స్నానం వంటి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో పూజించడం వలన సుఖశాంతులు, ఆరోగ్యము, ఐశ్వర్యము కలుగుతాయని తెలిపారు. కార్తీక మాసంలో ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.అదేవిధంగా భక్తులు ఎవరైనా అభిషేకాలు, నవగ్రహ పూజ, తదితర విశేష పూజలు నిర్వహించదలచిన వారు ఆలయ ప్రధాన అర్చకులు రుద్ర, శివ స్వాములను సంప్రదించాలని తెలియజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

బాల బ్రహ్మేశ్వర ఆలయం వద్ద సీసీ రోడ్డు పనుల తనిఖీ



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటంలోని బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా పరిషత్ సాధారణ నిధులు రూ.4 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఎంపీడీవో ఫణి రాజకుమారి తనిఖీ చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేలా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, మాజీ సర్పంచ్ ఓబులయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరి, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేప చెట్టు కొమ్మలు పడి నేలకూలిన 9 విద్యుత్ స్తంభాలు

తృటిలో తప్పిన పెను ప్రమాదం - జనసంచారం లేకపోవడంతో తప్పిన ప్రాణనష్టం

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల మండల పరిధిలోని కొత్తవల్లె గ్రామంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. గ్రామానికి చెందిన గుండన్న తన ఇంటి ముందు ఉన్న పెద్ద వేప చెట్టును తొలగిస్తుండగా, చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో ఒక్కసారిగా 9 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే చెట్టు కూలిన సమయంలో ఆ ప్రాంతంలో జనసంచారం లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఒక్కసారిగా 9 విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి విరిగిపోయిన స్తంభాలను తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపీటీసీ బందిలి వెంకటయ్య అల్లుడు కావలి శ్రీనివాసులు


మృతుని కుటుంబాన్ని వరామర్శించి ఓదార్చిన కొడవలూరు భక్తవత్సల రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి, వాకాడు



వాకాడు మండలం నెల్లిపూడి మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్సీపీ నాయకుడు బందిలి వెంకటయ్య అల్లుడు కావలి శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కొడవలూరు భక్తవత్సల రెడ్డి హుటాహుటిన మృతుని స్వగ్రామమైన కొక్కుపాలెంకు చేరుకున్నారు. కావలి శ్రీనివాసులు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బందిలి వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నెల్లిపూడి వైఎస్సార్సీపీ నాయకులు నెల్లూరు చెంగయ్య, బట్టా సుందరయ్య, కొడవలూరు అనుచరులు షేక్ షాజీ, కోటయ్య పాల్గొన్నారు.

సుగవాసి ప్రసాద్ బాబుకు టీడీపీ నాయకుల శుభాకాంక్షలు



ప్రజాభూమి, సిద్ధవటం: జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో సంచలన విజయం సాధించిన రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబును సిద్ధవటం మండలం పెద్దపల్లి గ్రామపంచాయతీ భాకరాపేటకు చెందిన టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు చేసిన సమష్టి కృషి అభినందనీయమన్నారు. సుగవాసి ప్రసాద్ బాబు విజయం రాజంపేట పార్లమెంట్ పరిధిలో టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని, పార్టీకి మరింత బలాన్ని తీసుకొచ్చిందన్నారు. భవిష్యత్తులో ప్రజాసేవ, పార్టీ అభివృద్ధికి ఆయన నాయకత్వం మరింత దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, రాజంపేట టీడీపీ అధికార ప్రతినిధి కడితం రామమోహన్ నాయుడు, సిద్ధవటం మండల తెలుగు యువత అధ్యక్షుడు పుత్తా సుధీర్ రాయల్, టీడీపీ మాజీ యూనిట్ ఇన్చార్జి పుత్తా శివానంద, గంగల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యపూజేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని పంతాటిపల్లె గ్రామ సమీపాన లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజేశ్వర స్వామి ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పంచలింగాల గుడి సమీపంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులకు కడప నగరానికి చెందిన కీర్తిశేషులు కదిరి శ్రీనివాసులు కుటుంబ సభ్యులు అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాదాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా కదిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తమ కుటుంబం గత 65 ఏళ్లుగా కార్తీక మాసం, మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదాలు అందజేస్తోందన్నారు. కార్తీక మాసంలో నాలుగు వారాల పాటు భక్తులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ కొనసాగిస్తామని తెలిపారు. నిత్యపూజేశ్వర స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.

కబర్దీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని లంకమల అటవీ ప్రాంతంలో వెలసిన కబర్దీశ్వర స్వామి ఆలయంలో సోమవారం వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పూజారి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో సిద్ధవటం, అట్లూరు, బద్వేల్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్తీక మాసం మూడో సోమవారం ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పూజారి ఈశ్వరయ్య తెలిపారు. ఆలయ అభివృద్ధికి రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ సహకరిస్తున్నారని మాజీ సర్పంచ్ ఓబులయ్య పేర్కొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆయన తల్లిదండ్రులు కీర్తిశేషులు అతికారి వెంకటసుబ్బయ్య, రోషమ్మ జ్ఞాపకార్థం సుమారు 2,000 మందికి ఉచిత అన్నప్రసాదం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకరయ్య, ఈశ్వరయ్య, అతికారి చిన్న వెంకటయ్య, నాగభూషణం, భక్తులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

మంగళవారం 10 నవంబరు 2026

కల్లివెట్టు పాఠశాలలో ఎస్ఏ-1 పరీక్షల తనిఖీ

పరీక్షల నిర్వహణను పరిశీలించిన ఎంఈఓ ముని సుబ్రమణ్యం, అబ్జర్వర్ విజయ్ కుమార్





ప్రజా భూమి ప్రతినిధి:
– బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా, బి.ఎన్. కండ్రిగ మండల పరిధిలోని కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న సంగ్రహణాత్మక మదింపు-1 పరీక్షలను మండల విద్యాశాఖ అధికారి ఎ. ముని సుబ్రమణ్యం, అబ్జర్వర్ విజయ్ కుమార్ సోమవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా రెండు పాఠశాలల్లో పరీక్ష ల నిర్వహణ తీరును, విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను, పరీక్షా కేంద్రాల్లోని ఏర్పా ట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తున్నారా లేదా అనే విషయాలను పరిశీలించారు. పరీక్షలు ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అంచనా వేయడంలో ఎస్ఏ–1 పరీక్షలు కీలకమని, పరీక్షల నిర్వహణలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచించారు.

ఆర్సీపురం టిడిపి జడ్పిటిసి అభ్యర్థి మేకల తిరుమలరెడ్డి ఘన విజయం

టిడిపి రెండు..... వైసీపీ రెండు స్థానాలు ఎంపీటీసీ కైవసం.



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం

మండలంలో స్థానిక ఎన్నికల్లో టిడిపి జడ్పిటిసి అభ్యర్థి మేకల తిరుమలరెడ్డి, వైయస్సార్సీపి అభ్యర్థి ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి పై 7490 ఓట్లతో ఘను విజయం సాధించారు. సోమవారం జిల్లా పరిషత్తు సీఈవో టిఎన్ శోభన్ బాబు జడ్పిటిసిగా గెలుపొందినట్లు డిక్లరేషన్ ను మేకల తిరుమలరెడ్డికి అందజేశారు. మండలంలో నాలుగు ఎంపీటీసీ స్థానాలలో జరిగిన ఎన్నికలలో సికేపల్లి , దేశూరు కండ్రిగ టిడిపి అభ్యర్థులు మాదాసు మాధవయ్య, ఈ కళావతులు ఘన విజయం సాధించారు . అనుపల్లె, నడవలూరు ఎంపీటీసీ స్థానాలలో బి నందిని, కే కర్ణ లు గెలుపొందారు . ఏది ఏమైనాప్పటికీ స్థానిక ఎన్నికలలో టిడిపి పట్టు సాధించి జడ్పిటిసి అభ్యర్థి మేకల తిరుమలరెడ్డి, 9 ఎంపిటిసి స్థానాలలో నెత్త కుప్పం– ఈ రాధిక, కుప్పం, బాదురు కోరా హరిప్రసాద్, కమ్మ కండ్రిగ, కల్లూరు నలిని రమేష్ నాయుడు, సి రామాపురం కే నరసింహారెడ్డి, సొరకాయల పాలెం– సునీతాలు ఏకగ్రీవయ్యారు. దీంతో ఏడు ఎంపిటిసి స్థానాలను టిడిపి కైవసం చేసుకుంది. ఎంపీపీ స్థానాన్ని కూడా టిడిపి ఖాతాలోకి వెళ్లినట్లే. ఆర్సీపురంలో స్థానిక ఎన్నికలలో టిడిపి సత్తా చాటడంతో పార్టీ క్యాడర్ ఉత్సాహంగా సంబరాలు చేసుకుంది.

కళ్యాణి డాం త్రాగునీటి పైప్ లైన్ లీకేజీ



ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి

శ్రీనివాస మంగాపురం నుండి రంగంపేట రహదారిలో కళ్యాణి డ్యామ్ తాగునీటి పైప్ లైన్ లీకేజ్. పైపులైను లీకేజీ కావడంతో తిరుపతి, తిరుమల మరియు పరిసర ప్రాంతాల నీటి సరఫరాపై ప్రభావం చూపే అవకాశం తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం ఏ. రంగంపేటలోని కళ్యాణి డ్యామ్ నుండి తిరుమల, తిరుపతి కి సరఫరా అయ్యే ప్రధాన పైప్ లైన్ రంగంపేట నుండి శ్రీనివాస మంగాపురం రహదారిలోని ఎర్రచందనం వనం వద్ద పైపులైన్లకు లీకేజీ ఏర్పడి పెద్ద ఎత్తున నీరు వృధాగా ప్రవహిస్తున్నది. దీనితో తాగునీరు వృథా అవ్వడమే కాకుండా, రహదారిపై ప్రయాణించే వాహనదారులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ లీకేజీ సమస్యకు సంబంధించి వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాటూరు బ్రిడ్జి మలుపు వద్ద మొరాయించిన టిప్పర్.. ప్రమాదం పొంచి ఉందని ఆందోళన

వర్షాకాలంలో రాత్రివేళ అంధకారంలో కనిపించని భారీ వాహనం..



ప్రజా భూమి ప్రతినిధి:– బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా, బి.ఎన్. కండ్రిగ మండల పరిధిలోని కాటూరు బ్రిడ్జి మలుపు వద్ద సాంకేతిక లోపంతో ఓ టిప్పర్ లారీ రహదారిపై నిలిచిపోయింది. ప్రమాదకరమైన మలుపు వద్ద భారీ వాహనం మొరాయించి నిలవడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రహదారులు తడిగా ఉండటంతో పాటు రాత్రి వేళల్లో ఈ ప్రాంతం అంధకారంలో ఉండటం మరింత ప్రమాదకరంగా మారింది. మలుపు వద్ద నిలిచిన టిప్పర్ వాహనం రాత్రివేళ ఎదురుగా వచ్చే వాహనదారులకు కనిపించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారుముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారిపై నిలిచిన టిప్పర్‌ను తొలగించడంతో పాటు, ప్రమాద నివారణకు హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మహిళా సేవకులకు భద్రత కల్పించండి ఈవో కు వినతి పత్రం అందజేసిన :సీఐటీయూ



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శివయ్య సేవ ద్వారా పొట్ట పోసుకుంటున్న మహిళా సిబ్బందికి భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ నేతలు సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బీకే వెంకటేశులను కలిసి వినతిపత్రం అందజేశారు. శివయ్య సేవ చేస్తున్న మహిళా సిబ్బంది పట్ల కొందరు పురుష ఉద్యోగుల అనుచిత ప్రవర్తన, లైంగిక వేధింపుల కారణంగా ఆలయ ప్రతిష్ట మసకబారే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్తులో అలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా భద్రత, నిఘా పెంచాలన్నారు. స్పందించిన ఈవో లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని తక్షణం విధులు నుంచి తప్పించినట్లు పేర్కొన్నారు. తదుపరి విచారణ అనంతరం చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు రెండు విడతల్లో

మొదటి విడత పోలింగ్ 26న, - రెండవ విడత 29న



ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం 14.10.2026న విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, తిరుపతి జిల్లాలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు రెండు విడతల్లో జరగనున్నాయి. మొదటి విడతలో 18 మండలాల్లో, రెండవ విడతలో 17 మండలాల్లో (మొత్తం 35 మండలాలు) సర్పంచ్ మరియు వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహిస్తారు. జిల్లా లో మొత్తము 807 గ్రామ పంచాయతీలకు గాను, 777 గ్రామ పంచాయతీలలో (7210 వార్డులకు) మాత్రమే ఎన్నికలు నిర్వహించు చున్నారు మరియు మిగిలిన 30 గ్రామ పంచాయతీలు వివిధ కోర్టు కేసుల వలన ప్రస్తుతము ఎన్నికలు నిర్వహించడంలేదు. నామినేషన్లు స్వీకరణకు మొత్తము 195 కేంద్రాలను ఏర్పాటుచేయడం జరుగుతుంది. మొదటి విడత: 18 మండలాలలోని, 415 గ్రామ పంచాయతీ సర్పంచ్ పోస్టులకు మరియు 3776 వార్డు మెంబరు సీట్లకు రిటర్నింగ్ అధికారి ఎన్నికల నోటీసు 15.11.2026 (ఆదివారం)న జారీ చేస్తారు. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ 17.11.2026 (మంగళవారం), పరిశీలన 18.11.2026 (బుధవారం), తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్లు 19.11.2026 (గురువారం), అప్పీళ్ల పరిష్కారం 20.11.2026 (శుక్రవారం). అభ్యర్థిత్వాల ఉపసంహరణకు చివరి తేదీ మరియు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన మరియు గుర్తుల కేటాయింపు 21.11.2026 (శనివారం). పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన 26.11.2026 (గురువారం)న జరుగుతాయి. అవసరమైతే రీ–పోలింగ్ 27.11.2026 (శుక్రవారం)న నిర్వహిస్తారు. మొదటి విడత మండలములు చిట్వేల్, కోడూరు, ఓబులవారిపల్లి, పెనగలూరు, వుల్లంపేట, వుత్తూరు, వడమాలపేట, బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి; రేణిగుంట, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, కె.వి.బి.పురం, నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరు. రెండవ విడత: 17 మండలాలకి గాను, 362 గ్రామ పంచాయతీ సర్పంచ్ పోస్టులకు మరియు 3434 వార్డు మెంబరు సీట్లకు రిటర్నింగ్ అధికారి ఎన్నికల నోటీసు 18.11.2026 (బుధవారం)న జారీ అవుతుంది. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ 20.11.2026 (శుక్రవారం), పరిశీలన 21.11.2026 (శనివారం), అప్పీళ్లు 22.11.2026 (ఆదివారం), అప్పీళ్ల పరిష్కారం 23.11.2026 (సోమవారం). ఉపసంహరణకు చివరి తేదీ మరియు తుది అభ్యర్థుల జాబితా ప్రకటన మరియు గుర్తుల కేటాయింపు 24.11.2026 (మంగళవారం). పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన 29.11.2026 (ఆదివారం)న జరుగుతాయి. అవసరమైతే రీ–పోలింగ్ 30.11.2026 (సోమవారం)న ఉంటుంది. రెండవ విడత మండలములు చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, పాకాల, రామచంద్రాపురం, తిరుపతి రూరల్, ఎర్రావారిపాలెం, చిట్టమూరు, వాకాడు, దొరవారినత్రం, నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు, సూళ్లూరుపేట, తడ, బి.ఎన్.కండ్రిగ, సత్యవేడు, వరదయ్యపాలెం.

ఇక పంచాయతీ సమరం

27 మండలాల్లో 617 పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు -ఈ నెల 26, మొదటి విడత, ఎన్నికలు మరియు ఫలితాలు

నవంబర్ 29, రెండో విడత ఎన్నికలు మరియు ఫలితాలు- డిసెంబర్ 2 మూడవ విడత ఎన్నికలు, ఫలితాలు- ఎన్నికల రోజే ఫలితాలు

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

మొదటిగా మున్సిపల్ ఎన్నికలు, ఆ తరువాత పరిషత్ ఎన్నికలను అత్యంత ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగం, ఇప్పుడు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై దృష్టి పెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత కీలకంగా, ప్రతిష్టాత్మకంగా భావించే పంచాయతీ పోరును సైతం పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేసేందుకు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సర్పంచ్ ఎన్నికలకు సహాయ ఎన్నికల అధికారిగా, జిల్లా పంచాయతీ అధికారి మరియు అదన ఎన్నికల అధికారి సుధాకర్ వ్యవహరిస్తున్నారు.

చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి రెవెన్యూ డివిజన్ల పరిధిలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి, రెండు, మూడో విడతల పూర్తి షెడ్యూల్ మరియు నామినేషన్ స్వీకరణ కేంద్రాల వివరాలను అధికారులు విడుదల చేశారు.

దీని ప్రకారం ఈ నెల (నవంబర్) 26న మొదటి విడత, 29న రెండో విడత, డిసెంబర్ 2 న మూడో విడత ఎన్నికలు జరగనున్నాయి.

మొదటి విడత (నవంబర్ 26):

మొదటి విడతలో మొత్తం 9 మండలాల్లోని 182 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో బంగారుపాలెం (41 పంచాయతీలు), ఇందులో బైరెడ్డిపల్లి (21 పంచాయతీలు), గంగవరం (16 పంచాయతీలు), గుడుపల్లె (18 పంచాయతీలు), కుప్పం (29 పంచాయతీలు), పలమనేరు (10 పంచాయతీలు), పెద్దపంజాణి (25 వంచాయతీలు), రామకుప్పం (22 వంచాయతీలు), శాంతిపురం (23 పంచాయతీలు), వి.కోట (18 పంచాయతీలు) మండలాలు ఉన్నాయి.ఈ విడతకు నవంబర్ 13న ఏపీఎస్ఈసీ (ఎస్ఈసీ) ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. 15న ఆర్వో (ఆర్వో) నోటీసు జారీ చేస్తారు. 17న నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ కాగా, 18న నామినేషన్ల పరిశీలన, 19న తిరస్కరణలపై అప్పీలు, 20న అప్పీళ్ల పరిష్కారం ఉంటాయి. 21న నామినేషన్ల ఉపసంహరణతో పాటు తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. నవంబర్ 26న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్ల లెక్కింపు మరియు ఫలితాలను వెల్లడిస్తారు. అవసరమైతే నవంబర్ 27న రీ–పోలింగ్ నిర్వహిస్తారు. ఉప సర్పంచ్ పరోక్ష ఎన్నికకు సంబంధించి నవంబర్ 26 లోపు సభ్యులకు నోటీసులు జారీ చేసి, 26 లేదా 27 తేదీల్లో ప్రత్యేక సమావేశం ద్వారా ఎన్నిక పూర్తి చేస్తారు.

రెండో విడత (నవంబర్ 29):

రెండో విడతలో 9 మండలాల్లోని 229 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో జి.డి.నెల్లూరు (32 పంచాయతీలు), కార్వేటినగరం (22 పంచాయతీలు), నగరి (21 పంచాయతీలు), నిండ్ర (21 పంచాయతీలు), పాలసముద్రం (13 పంచాయతీలు), పెనుమూరు (23 పంచాయతీలు), శ్రీరంగరాజపురం (23 వంచాయతీలు), వేదురుకుప్పం (25 వంచాయతీలు), విజయపురం (25 పంచాయతీలు) మండలాలు ఉన్నాయి. ఈ విడతకు నవంబర్ 19న ఏపీఎస్ఈసీ (ఎస్ఈసీ) ఎన్నికల నోటిఫికేషన్, 21న ఆర్వో (ఆర్వో) నోటీసు జారీ అవుతాయి. నవంబర్ 23న నామినేషన్ల స్వీకరణకు తుది గడువు కాగా, 24న నామినేషన్ల పరిశీలన, 25న తిరస్కరణలపై అప్పీలు, 26న అప్పీళ్ల పరిష్కారం ఉంటాయి. నవంబర్ 27న నామినేషన్ల ఉపసంహరణతో పాటు పోటీలో ఉండే తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్ల లెక్కింపు మరియు ఫలితాలను వెల్లడిస్తారు. అవసరమైతే డిసెంబర్ 3న రీ–పోలింగ్ నిర్వహిస్తారు. ఉప సర్పంచ్ పరోక్ష ఎన్నికకు సంబంధించి నవంబర్ 19న నోటిఫికేషన్ విడుదల కాగా, డిసెంబర్ 2 లోపు సభ్యులకు నోటీసులు జారీ చేసి, అదే రోజు (డిసెంబర్ 2) ప్రత్యేక సమావేశం ద్వారా ఎన్నిక ప్రక్రియను పూర్తి చేస్తారు.మూడు దశల్లో కలిపి చిత్తూరు జిల్లాలోని మొత్తం 27 మండలాల్లో 617 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, పోలింగ్ సామగ్రి మరియు ఇతర ఏర్పాట్లపై అధికారులు పారదర్శకంగా దృష్టి సారిస్తున్నారు.

జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన



ప్రజాభూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి టౌన్

జాతీయ న్యాయ సేవల దినోత్సవం (నేషనల్ లీగల్ సర్వీసెస్ డే) సందర్భంగా శ్రీకాళహస్తిలోని వంశీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. ప్రముఖ న్యాయవాదులు గరికిపాటి రమేష్, రాజేశ్వరరావు, వేడంమల్లి కార్జున్, అరుణ్ కుమార్, శ్రీరామ్, ప్రజ్ఞశ్రీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సదస్సు అనంతరం న్యాయవాదులు, కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో కలిసి చట్టాలపై అవగా హన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర ప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చట్టాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండటం ఎంతో కీలకమని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే చట్టాలు, హక్కులు, బాధ్యతలపై స్పష్టమైన అవగాహన ఏర్పరచుకుంటే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి దోహదపడుతుందని తెలిపారు. సమాజంలో చట్టాలపై అవగాహన లోపించడం వల్లే అనేక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని, విద్యార్థులు తమకు తెలిసిన న్యాయ విషయాలను ఇతరులకు కూడా తెలియజేస్తూ సమాజంలో చట్టాలపై అవగాహన పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని న్యాయపరమైన అంశాలపై అవగాహన పొందారు.

రాస్ అనాథ ఆశ్రమచిన్నారుల ముఖంలోదీపావళి వెలుగులు నింపిన బికందుకూరి మురళీమోహన్ రాయల్.



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ పరిధిలోని రాస్ అనాథ బాల, బాలికల ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించిన కందుకూరి మురళీమోహన్ రాయల్. నిజమైన సేవ నాయకత్వం అంటే పదవుల్లో ఉండటం కాదు,పది మందికి అండగా నిలవడం, ఆపదలో ఉన్నవారి ముఖాల్లో చిరునవ్వులు నింపడం. సమాజంలో కొంతమందిలోనే నూటికో కోటికో ఒకరికి సాధ్యపడుతుంది, అలాంటి వారిలో ఒకరు మురళీమోహన్ రాయల్ అని రాస్ సిబ్బంది అన్నారు. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా, ప్రతి సంవత్సరం దీపావళిపండుగ ఆనందాన్ని అనాథలు, వృద్ధులు, అభాగ్యులతో పంచుకోవాలనే గొప్ప ఆలోచన చేసిన మన అసోసియేషన్ అధ్యక్షులు మురళి రాయల్ కు హృదయపూర్వక అభినందనలు. తెలియజేసిన అన్నం, పుణ్యం ఎరుగని చిన్నారులు. ఆయన మంచి మనసు, సేవాభావం ఎందరికో స్ఫూర్తిదాయకం అన్నా. మీలాంటి నాయకుడు మనకు అధ్యక్షుడిగా ఉండటం మనందరి అదృష్టం. దీపావళి అంటే దీపాలు వెలిగించడం మాత్రమే కాదు చీకటిలో ఉన్న వారి జీవితాల్లో ఆనందపు వెలుగులు నింపడం. మీ సేవా ప్రయాణం ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ,మురళి కి అసోసియేషన్ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు. తెలిపారు.

విద్యుత్ బిల్లుల ఆఫ్‌లైన్ చెల్లింపులకు అనుమతించాలి



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో ఆఫ్‌లైన్ విధానాన్ని కొనసాగించి సామాన్య వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని శ్రీకాళహస్తి సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి డిమాండ్ చేశారు. వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆఫ్‌లైన్‌లోనూ విద్యుత్ బిల్లులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎస్పీడీసీఎల్ డీఈ చిన్న రెడ్డప్పకు వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో వినియోగదారుల నుంచి సిబ్బంది ఆఫ్‌లైన్ చెల్లింపులు స్వీకరించకుండా కేవలం ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని చెబుతున్నారని తెలిపారు. దీనివల్ల వృద్ధులు, ఒంటరి మహిళలు, నిరక్షరాస్యులు, స్మార్ట్‌ఫోన్లు వినియోగించలేని సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన లేకపోవడం, ఇంటర్నెట్ సమస్యలు, సాంకేతిక ఇబ్బందులు, డిజిటల్ లావాదేవీల్లో జరిగే పొరపాట్ల కారణంగా వినియోగదారులు ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించలేక అదనపు జరిమానాలు పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం మంచిదే అయినప్పటికీ, వాటిని తప్పనిసరి చేసి ప్రత్యామ్నాయ మార్గాలను మూసివేయడం సరికాదనీ, ప్రజల సౌలభ్యం కోసం రెండు విధానాలనూ అందుబాటులో ఉంచాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, మోహన్ రావు, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సర్పంచుల ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులకు శిక్షణ

ఆయా గ్రామ పంచాయతీ ఎన్నికల నందు రిటర్నింగ్ అధికారులు పారదర్శకంగా మీ విధులను నిర్వర్తించాలి

-డిఆర్ఓ కే. మోహన్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: జిల్లాలో గ్రామ పంచాయతీ సర్పంచుల ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ మండలాలకు చెందిన రిటర్నింగ్ అధికారులకు సోమవారం చిత్తూరులోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) కె. మోహన్ కుమార్ మాట్లాడుతూ, సర్పంచుల ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ పత్రాల పరిశీలన, అభ్యర్థుల అర్హతలు, నామినేషన్ల ఆమోదం, తిరస్కరణ తదితర అంశాలపై స్పష్టమైన అవగాహనతో విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీపీఓ సుధాకర్ డీఎల్‌డీఓలు చిత్తూరు రవి, కుప్పం నరసింహానాయుడు, నగరి విజయరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
జనరల్ 9
మంగళవారం 10 నవంబరు 2026

గ్రామీణ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

-నాలుగు నెలల పాటు శిక్షణతో పాటు ప్లేస్‌మెంట్ సౌకర్యం-కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోలయ్య

ప్రజాభూమి, హిందూపురం టౌన్
గ్రామీణ నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూ--జీకేవై) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌డీజీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోలయ్య పేర్కొన్నారు. కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ బైసాని రాంప్రసాద్ సహకారంతో కళాశాల ఆవరణలో డీడీయూ--జీకేవై, నీడాన్ సహకారంతో సన్ విజన్ స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోలయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు అవసరమైన వృత్తి నైపుణ్యాలను ఉచితంగా అందించి, శిక్షణ అనంతరం ఉద్యోగ



అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల అర్హులైన గ్రామీణ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొసైటీ కంప్యూటర్ ప్రతినిధి కిఫాయతుల్లా మాట్లాడుతూ, ఎంఎస్ ఆఫీస్, పైథాన్, టాలీ, సాఫ్ట్ స్కిల్స్, మల్టీ స్కిల్స్ టెక్నీషియన్ తదితర కోర్సుల్లో నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు వివరించారు. ఇందులో మూడు నెలల పాటు తరగతి గది శిక్షణ, మరో నెల రోజుల పాటు ఉద్యోగ రంగంలో ప్రాక్టికల్ శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పించడంతో పాటు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఉద్యోగ అవకాశాల కల్పనలో ప్లేస్‌మెంట్ సహాయం అందించడంతో పాటు భారత ప్రభుత్వం గుర్తించిన ధ్రువీకరణ పత్రం అందజేస్తామని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై, 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని నిర్వాహకులు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులతో పాటు ఆరు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త బి. రాజన్న, డాక్టర్ శ్రీనివాసమూర్తి, గణిత అధ్యాపకులు రాము, సొసైటీ సిబ్బంది, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకమే మా బాధ్యత, అభివృద్ధే మా లక్ష్యం - బీటెక్ రవి

ఒక్క అవకాశం అడిగాం, ప్రజలు ఇచ్చారు, అభివృద్ధి చేసి చూపిస్తాం

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కూటమి మద్దతుదారులను సర్పంచులుగా గెలిపించండి

ప్రజాభూమి, పులివెందుల
పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల్లో, జిల్లా పరిషత్ ప్రాదేశిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలిపి విజయాన్ని అందించిన నియోజక వర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు పులివెందుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి బీటెక్ రవి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న లింగాల మండలంలో కూడా తెలుగుదేశం పార్టీని గెలిపించి ప్రజలు అండగా నిలిచారని అన్నారు. ఎర్రబల్లె చెరువుకు నీళ్లు ఇచ్చినందుకు కృతజ్ఞతగా పులివెందుల మండల ప్రజలు పార్టీకి మద్దతు ఇచ్చి గెలిపించారని తెలిపారు. వేంపల్లె జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానంలో పొత్తు కేటాయింపుల వల్ల కార్యకర్తల్లో కాస్త నిరాశ ఏర్పడిందని, ఎన్నికల వేళ తగిన సమయం కేటాయించలేకపోవడం వల్లే అక్కడ అనుకూల ఫలితం రాలేదని అన్నారు. వేముల మండలంలో భారతి గారి సొంత బంధువు పోటీ చేసినప్పటికీ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గట్టిగా పోరాడారని, పెద్దజూటూరుకు చెందిన ఒక నాయకుడు సహకరించక పోవడం వల్లే స్వల్ప తేడాతో సీటు చేజారిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తం గా పలు జిల్లాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిషత్



ప్రాదేశిక స్థానాల్లో కనీసం ఖాతా కూడా తెరవలేకపోయిందని, గత ఐదేళ్ల పాలనలోని అవకతవకలు, మద్యం విధానాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. పులివెందుల మున్సిపాలిటీ ప్రజలను ఒక్క అవకాశం ఇవ్వమని అడిగినందుకు ప్రజలు ఆదరించారని, ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వార్డుల్లోని సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో కూడా అధికార పార్టీ మద్దతుదారులను గెలిపిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, పులివెందుల ప్రజలు కూటమికి మద్దతు పలకాలని కోరారు.

పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు

19 పంచాయతీలకు రిజర్వేషన్ ఖరారు చేసిన ఎన్నికల కమిషన్

ప్రజా భూమి శింగనమల
మండల పరిధిలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారయ్యాయి. మండలంలోని మొత్తం 19 గ్రామ పంచాయతీలకు వివిధ సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు కేటాయించారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్‌తో పాటు మహిళలకు కూడా స్థానాలు కేటాయించారు.
గ్రామ పంచాయతీల వారీగా రిజర్వేషన్ల వివరాలు:
క్ర.సం గ్రామ పంచాయతీ రిజర్వేషన్
1 శింగణమల బీసీ
2 నాగులగుద్దం తాండా ఎస్టీ
3 కొరివిపల్లి ఎస్సీ
4 నాయనవారిపల్లి జనరల్
5 కల్లుమడి జనరల్
6 ఆకులేడు జనరల్
7 నిధనవాడ ఎస్సీ
8 రాచేపల్లి బీసీ మహిళ
9 ఉల్లికల్లు జనరల్
10 చక్రాయపేట జనరల్
11 లోలూరు బీసీ మహిళ
12 జూలకల్వ ఎస్సీ మహిళ
13 పెరవలి జనరల్ మహిళ
14 తరిమెల జనరల్ మహిళ
15 వెస్ట్ నరసాపురం జనరల్ మహిళ
16 గుమ్మేపల్లి జనరల్ మహిళ
17 సలకంచెరువు జనరల్ మహిళ
18 సోదనపల్లి ఎస్సీ మహిళ
19 పి.మట్లగొంది బీసీ
రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆయా గ్రామాల్లో సర్పంచ్ పదవులపై ఆశావహులు తమ రాజకీయ సమీకరణాలకు పదును పెడుతున్నారు. రిజర్వేషన్ల ప్రకటనతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సేవలు - జడ్జి చంద్రశేఖర్ రెడ్డి

జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా

పులివెందులలో అవగాహన ర్యాలీ

ప్రజాభూమి, పులివెందుల
ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందించడమే మండల న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన లక్ష్యమని పులివెందుల మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం. చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ



న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందుల పట్టణంలో కోర్టు సర్కిల్ నుండి పూలంగల సర్కిల్ వరకు న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయం ప్రతి ఒక్కరి హక్కు అని, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడం, ఉచిత న్యాయ సహాయం అందించడం, వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించడం ద్వారా సత్వర న్యాయం అందించడం సంస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పేదలు, మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, బలహీన వర్గాలకు ఉచిత న్యాయవాది సేవలు, న్యాయ సలహాలు అందిస్తున్నట్లు వివరించారు. లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని, తద్వారా సమయం, ధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు. ప్రజలు సంస్థ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండవ తరగతి న్యాయాధికారి అరుణ మాట్లాడుతూ న్యాయ సేవల కోసం 15100 టోల్ ఫ్రీ సహాయ నంబర్ ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల యూనిట్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ సహాయ రక్షణ మండలి సభ్యులు, మధ్యవర్తులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ కవి ఇక్బాల్‌కు ఘన నివాళి

ప్రెస్ క్లబ్‌లో ఆల్ మేవా ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు



అనంతపురం ప్రజాభూమి: ప్రపంచ ఉర్దూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ ఉర్దూ కవి, తత్వవేత్త అల్లామా మొహమ్మద్ ఇక్బాల్ జయంతి వేడుకలను సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్బాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ అల్లామా మొహమ్మద్ ఇక్బాల్ గొప్ప దార్శనికుడని, ఉర్దూ సాహిత్యానికి విశేష సేవలందించిన మహాకవి, తత్వవేత్త అని కొనియాడారు. ఆయన రచనలు, ఆలోచనలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆయన కవితలు, గేయాలు అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యాన్ని నింపాయని తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో తన కవితలు, రచనల ద్వారా ప్రజల్లో దేశభక్తి భావాలను పెంపొందించారని వక్తలు గుర్తుచేశారు. భారతదేశంలో ఎంతో ప్రాచుర్యం పొందిన 'సారే జహాసే అచ్చా హిందుస్తాన్ హమారా' గేయాన్ని రచించి దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. యువతలో ఆత్మవిశ్వాసం, స్వయం సమృద్ధి, స్వతంత్ర ఆలోచనా శక్తిని పెంపొందించేలా ఇక్బాల్ సాహిత్యం దోహదపడిందని పేర్కొన్నారు. ఉర్దూ భాషకు, సాహిత్యానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా ఆయన జయంతిని ఉర్దూ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ మేవా జిల్లా అధ్యక్షుడు షేక్ షా వలి, దావూద్ ఫక్రుద్దీన్, జిలాన్, మక్బూల్, దౌల, ఉర్దూ కవులు ఆరిఫ్, ఖలీల్, హిదయతుల్లా, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసిన బోయ వాల్మీకి వీర మహిళలు

చింతకాయల రజిత బోయ తిరుపాలమ్మ

ప్రజా భూమి శింగనమల
శింగనమల మండలంలో ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో బోయ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మహిళా అభ్యర్థులు ఘన విజయం సాధించి తమ రాజకీయ సత్తాను చాటారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన బోయ వాల్మీకి మహిళలు చింతకాయల రజిత, 490 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు బోయ తిరుపాలమ్మ 219 ఓటర్ల మెజార్టీతో గెలుపొందింది ప్రజల విశేష ఆదరణతో విజయకేతనం ఎగురవేశారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి చెందిన అభ్యర్థులకు గట్టి పోటీ ఇస్తూ, ప్రజాబలంతో విజయం సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా మహిళా అభ్యర్థులుగా బరిలో నిలిచి విజయం సాధించడం బోయ వాల్మీకి సామాజిక వర్గంలో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ ఎన్నికల ఫలితాలతో బోయ వాల్మీకి మహిళలు రాజకీయాల్లోనూ తమదైన ముద్ర వేస్తూ, ప్రజా మద్దతుతో విజయాలు సాధించగలరని నిరూపించారు. వీరి విజయంపై సామాజిక వర్గీయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





నందమూరినగర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం-బ్రిడ్జి పిల్లర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

-యువకుడు మృతి - మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్
హిందూపురం సమీపంలోని నందమూరినగర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పిల్లర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదంలో మోడల్ కాలనీకి చెందిన ఇర్ఫాన్ (16) మృతి చెందగా, నూర్ మొహమ్మద్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. హిందూపురం పట్టణంలోని మోడల్ కాలనీకి చెందిన ఇర్ఫాన్, నూర్ మొహమ్మద్ ద్విచక్ర వాహనంపై పట్టణం నుంచి చలివెందులకు వెళ్లారు. అక్కడి నుంచి సుబ్బరాయపేటకు వెళ్లి తిరిగి చలివెందులకు చేరుకున్నారు. అనంతరం చలివెందుల నుంచి హిందూపురానికి తిరిగి వస్తుండగా నందమూరినగర్ సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఇర్ఫాన్ అక్కడికక్కడే మృతి చెందగా, నూర్ మొహమ్మద్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న రూరల్ గ్రేడ్ స్టేషన్ ఎస్ఐ మునీర్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రుడిని, మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నూర్ మొహమ్మద్‌కు వైద్యులు ప్రథమ చికిత్స అందించిన అనంతరం పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రిఫర్ చేశారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పిల్లర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ సరైన హెచ్చరిక బోర్డులు, భద్రతా సూచికలు ఉన్నాయా లేదా అనే అంశంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు ఏర్పాటు చేయకపోవడమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని చర్చించుకుంటున్నారు.



విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు జొన్నలగడ్డ పద్మావతి దంపతుల అభినందనలు

మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ వద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన విజేతలు

ప్రజా భూమి శింగనమల
శింగనమల మండల పరిధిలో ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో విజయం సాధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ వింగ్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురంలోని వారి నివాసానికి చేరుకున్న నియోజకవర్గంలోని పలు



మండలాలకు చెందిన విజయం సాధించిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు వారిని కలిసి ఎన్నికల్లో సాధించిన విజయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ పద్మావతి దంపతులు విజేతలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం విజయం సాధించేందుకు సహకరించి, ఎన్నికల సమయంలో తమకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డికి ఎంపీటీసీలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

లీసర్వేపై జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ..

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం
అనంతపురం జిల్లాలో రీ సర్వేకు సంబంధించి కొనసాగుతున్న సమస్యలు మీద జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఏడీ సర్వే, ఎస్‌డీసీ, కేఆర్ఆర్‌సీ అధికారులు, సంబంధిత సెక్షన్ అధికారులతో రీ సర్వే పురోగతి, భూ రికార్డుల్లో ఉన్న లోపాలు, పరిష్కరించాల్సిన పెండింగ్ సమస్యలపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా రీ సర్వేకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. భూ రికార్డుల ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తూ, రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.



ఏపీ పదో తరగతి పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

ప్రజా భూమి శింగనమల
ఆంధ్రప్రదేశ్‌లో 2027 పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదలైంది.
నవంబర్ 11 నుంచి 25 వరకు ఆలస్య రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చు.
నవంబర్ 11--25 రుసుము లేదు.
నవంబర్ 26 నుంచి: రూ.50 ఆలస్య రుసుము.
డిసెంబర్ 3 నుంచి: రూ.200 ఆలస్య రుసుము.
లేటుగా చెల్లిస్తే రుసుము తప్పనిసరి అంటూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేశారు ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలల.యాజమాన్యాలు స్కూల్ లాగిన్ ద్వారా పరీక్షల ఫీజు చెల్లించాలని విద్యాశాఖ ఆదేశించింది.

కూటమి నాయకులకు అభినందనలు తెలియజేసిన ఎంపిటిసి లక్ష్మీ ఈశ్వరమ్మ

ప్రజాభూమి పోరుమామిళ్ల :
పోరుమామిళ్ల మండలం రంగనముద్రం పంచాయతీ 2 ఎంపీటీసీగా ఏకగ్రీవం కావడానికి సహకరించిన బద్వేల్ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ మంజూరి సూర్యనారాయణ రెడ్డికి, స్టేట్ మార్క్ఫెడ్ డైరెక్టర్, రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశి భూషణ్ రెడ్డికి, బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ నారిశెట్టి సుప్రజకి, పోరుమామిళ్ల బిజెపి మండల అధ్యక్షుడు నారిసెట్టి నాగేంద్రకి, రంగసముద్రం పంచాయతీ ఓటర్ మహాశయులకు, కూటమి నాయకులందరికీ, ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్క నాయకునికి



కార్యకర్తకు శిరసు వంచి పాదాభివందనాలు చేస్తున్నాం.. మాకు ఇచ్చిన బాధ్యతను తూచా తప్పకుండా మా పరిధిలోని ప్రజలకు సేవకులుగా ఉండి మా కూటమి నాయకులు ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడుకి, ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ కి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కి మంచి పేరు తెచ్చేదానికి మా సాయి శక్తుల కృషి చేసి ప్రజల మన్ననలు పొందుతామని మన పూర్వకంగా తెలియజేస్తున్నాం రంగసముద్రం పంచాయతీ 2 ఎంపిటిసి నారోజు లక్ష్మి ఈశ్వరమ్మ.. బిజెపి జిల్లా అధికార ప్రతినిధి నారోజు రమణాచారి

కలసపాడు జడ్పిటిసిగా జనసేన కూటమి అభ్యర్థి విద్యావతి గెలుపు

సహకరించిన వారికి కృతజ్ఞతలు

ప్రజా భూమి పోరుమామిళ్ల :
కలసపాడు జడ్పిటిసి స్థానాన్ని జనసేన పార్టీ కైవసం చేసుకుంది ఆ పార్టీ అభ్యర్థి భవనాసి విద్యావతికి 9147 ఓట్లు పోలయ్యాయి ,వైసిపి అభ్యర్థి సుధా అనురాధకు 7746 ఓట్లు వచ్చాయి వైసిపి అభ్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనప్పటికీ విద్యావతి 1401 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది ,ఈ గెలుపు బద్వేల్ తెదేపాఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి, కలసపాడు మండల 13 గ్రామ పంచాయతీల కూటమి నాయకుల విజయమని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా రంజు స్వగృహంలో కేక్ కట్ చేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణా డైరెక్టర్ రంతు, ఈశ్వర్ రెడ్డి, సుబ్బారావు, శీలంశెట్టి లక్ష్మయ్య కూటమి నాయకులు పాల్గొన్నారు



ప్రజాభూమి
జనరల్ 10
మంగళవారం 10 నవంబరు 2026

చంద్రబాబు సొంత గడ్డపై..జగన్‌కు జై..!

- తిరుపతి రూరల్ జెడ్పీటీసీగా 563 ఓట్ల మెజారిటీతో గెలుపు
- ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యం.. ప్రత్యర్థులకు అందని విజయం
- నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు అడుగడుగునా అడ్డంకులే
- గెలుపు ప్రకటించినా గంటకుపైగా డిక్లరేషన్ ఇవ్వకుండా నిలిపివేత
- ఎట్టకేలకు విజయం ప్రకటనతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సంబరాలు



ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి రూరల్:

సీఎం చంద్రబాబు సొంత గడ్డపై వైఎస్సార్సీపీ జెండా రెపరెపలాడింది.. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల జడ్పీటీసీ స్థానాల్లో మూడు జడ్పీటీసీలను వైఎస్సార్సీపీ కైవశం చేసుకుంది. అందులో ప్రధానంగా 1.72లక్షల ఓట్లు కలిగియున్న తిరుపతి రూరల్ మండలం నుంచి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దిగగా ప్రతి రౌండ్ లోనూ మెజారిటీ సాధించారు. చెవిరెడ్డి కుటుంబం నుంచి వచ్చిన హర్షిత్‌రెడ్డిని ఓడించడానికి అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు.. అయినా ప్రజా తీర్పును నిలువరించలేక పోయారు. టీడీపీ నేతలు, స్థానిక ఎమ్మెల్యే కుటుంబం నుంచి ఎదురైన సవాళ్లను అధిగమించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తిరుపతి రూరల్ జెడ్పీటీసీగా ఘన విజయం సాధించారు. హోరా హోరీగా సాగిన ఎన్నికల పోరులో 563 ఓట్ల ఆధిక్యంతో విజయకేతనం ఎగురవేశారు. సీఎం చంద్రబాబు పుట్టి, పెరిగిన చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్సీపీ విజయం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉత్కంఠ భరితంగా సాగిన ఆ పోరులో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి సాధించిన గెలుపు వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆనందాన్ని నింపింది.



నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు..

ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచే అధికార కూటమి అడ్డంకులు సృష్టించిందని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆరోపించారు. నామినేషన్లు వేయకుండా అభ్యర్థులను అడ్డుకోవడంతో పాటు, పరిశీలన సమయంలో కొన్ని నామినేషన్లను తొలగించారని పేర్కొన్నారు. అన్ని అడ్డంకులను అధిగమించి బరిలో నిలిచిన అభ్యర్థులు పోలింగ్ సమయంలోనూ ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కిరాయి గూండాలతో దాడులు, దౌర్జన్యాలు, దొంగ ఓట్లు, రిగ్గింగ్‌ల మధ్య పోలింగ్ జరిగిందని, అయినప్పటికీ ఓటర్లు వెనక్కి తగ్గకుండా తమ ఓటు హక్కును వినియోగించుకుని చారిత్రాత్మక తీర్పు ఇచ్చారన్నారు.

ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యమే..

తిరుపతి రూరల్ జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆధిక్యం కొనసాగింది. ప్రతి రౌండ్‌లోనూ స్వల్ప తేడాతో మెజారిటీ సాధిస్తూ చివరకు 563 ఓట్ల తేడాతో విజయాన్ని ఖరారు చేసుకున్నారు. దొంగ ఓట్లు, రిగ్గింగ్‌తో అడ్డగోలుగా గెలవాలని ప్రయత్నించినా ప్రజల తీర్పు ముందు ఆ ప్రయత్నాలు ఫలించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలు జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కూడా ఇబ్బందులు ఎదురయ్యాయని హర్షిత్‌రెడ్డి ఆరోపించారు.

తెల్లవారుజామున 5 గంటలకే అధికారులు తన గెలుపును ప్రకటించినప్పటికీ, అనంతరం అధికారిక డిక్లరేషన్ ఇవ్వకుండా గంటకు పైగా అడ్డుకున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంపై ప్రభుత్వానికి, పాలకులకు చిత్తశుద్ధి లేదని వ్యాఖ్యానించారు. చంద్రబాబు స్వగ్రామం నారావారి పల్లి వున్న చంద్రగిరి నియోజకవర్గంలో తిరుపతి రూరల్ జెడ్పీటీసీగా చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, చిన్నగొట్టిగల్లు జడ్పీటీసీగా బాలం యుగంధర్‌రెడ్డి, ఎర్రావారిపాలెం జడ్పీటీసీగా ఊటుకూరు రెడ్డెమ్మలు వైఎస్సార్సీపీ తరపున బరిలోకి దిగి విజయం సాధించడం రాజకీయంగా ప్రధాన చర్చనీయాంశమైంది.

మున్సిపల్ వైస్ చైర్మన్ దళితులకు కేటాయించాలి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని దళితులకు కేటాయించాలని దళిత నాయకులు, నాయవాది రవి కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు దళితులకు ఏ పదవిలో అవకాశం కల్పించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పాలకవర్గంలో దళితులకు అవకాశం ఇచ్చి, సామాజిక న్యాయం పాటించాలని కోరారు. హిందూపురం మున్సిపాలిటీలో 52 వార్డులకు గాను ఐదుకు పైగా అవార్డుల్లో దళిత కౌన్సిలర్లు విజయం సాధించారని, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హిందూపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్ గా దళిత వర్గానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పదవులు దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులను సన్మానించిన ఎంపీ అంబిక



ప్రజా భూమి ప్రతినిధి అనంతపురం

అనంతపురం జిల్లాలోని ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన అనంతపురం నగరంలోని 14వ డివిజన్ అనసూయమ్మ, 35వ డివిజన్ బంగి నాగేంద్ర, 18వ డివిజన్ చిత్రాల రాజేష్, 10వ డివిజన్ రెడ్డిశ్వరి, గార్లదిన్నె మండలం జెడ్పీటీసీ గంజి నాగరాజు, పరిగి ఎంపీటీసీ కే. నాగరాజు, 4వ డివిజన్ దాసరి కమల విజయం సాధించిన అనంతరం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా విజయం సాధించిన అభ్యర్థులను అభినందించి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఆయా ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జాఫర్ సాదిక్ పూలమండి, మల్లికార్జున, భాష తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను రికవరీ చేసిన రేణిగుంట పోలీసులు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

ఈరోజు రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో, మూడు నెలల క్రితం రేణిగుంట బస్టాండ్‌లో పోగొట్టుకున్న మోటో మొబైల్ ఫోన్‌ను (సి ఈ ఐ ఆర్,)పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి గుర్తించడం జరిగింది. అనంతరం సదరు మొబైల్ ఫోన్‌ను బాధితుడు పాతగుంట హరికి సోమవారంరోజు బాధితుడికి తిరిగి అప్పగించిన పోలీసులు. ప్రజలకు పోలీసుల ముఖ్య సూచన: ఎవరైనా తమ మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నట్లయితే, సంబంధిత వివరాలతో (సి ఈ ఐ ఆర్) పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చు. రేణిగుంట పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి, రికవరీ చేసిన అనంతరం సంబంధిత బాధితులకు తిరిగి అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామనితెలియజేశారు.

కార్తీక మాసంలో ప్రతిరోజూ ఆకాశదీపం

శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమం


భక్తులకు పండితుల ఆహ్వానం



ప్రజాభూమి,పులివెందుల

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పులివెందుల పట్టణంలోని శ్రీ రంగనాథ స్వామి దేవస్థానంలో ప్రతిరోజూ ఆకాశదీపం వెలిగించే కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు ఆలయ పండితులు నవీన్ శర్మ తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా ఆధ్యాత్మిక సంప్రదాయంలో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆకాశదీపాన్ని వెలిగించ నున్నట్లు ఆయన తెలిపారు.కార్తీక మానంలో ప్రతిరోజూ ఆకాశదీవం వెలిగించడం వల్ల ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండటంతో పాటు ప్రజలకు శుభం కలుగుతుందని పండితులు పేర్కొన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పట్టణ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.ప్రతిరోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల లోపు ఆకాశదీవం వెలిగించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాము లై విజయవం తం చేయాలని నవీన్ శర్మ పిలుపునిచ్చారు.

జడ్పిటిసి మేకల తిరుమల రెడ్డిని సత్కరించిన చెంగలాయిలు



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం

స్థానిక ఎన్నికలలో రామచంద్రపురం జడ్పిటిసి గా అఖండ మెజార్టీతో గెలుపొందిన తిరుమలరెడ్డిని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు మల్లంపల్లి చెంగల్ రాయులు ఘనంగా నత్కరించారు. సోమవారం దీపావళి వర్వదినాన్ని పురస్కరించుకొని రాయల చెరువుపేటలో ఆయన నివాసంలో శాలువులతో సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయగల విశ్వాసం మండల ప్రజలకు ఉన్న కారణంగానే తిరుమలరెడ్డిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి టిడిపిని ప్రజలు గెలిపించాలని తెలిపారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మేకల తిరుమలరెడ్డి మాట్లాడుతూ మండల ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కృషి చేస్తానని చెప్పారు.

పుట్లూరు మండలంలో షాకింగ్ 60 ఓట్లలో 59 ఓట్లు చెల్లలేదు



ప్రజాభూమి, పుట్లూరు.

స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పుట్లూరు మండలంలో పోస్టల్ బ్యాలెట్ ల ఓట్ల లెక్కింపు ఆసక్తికరంగా మారింది. పుత్తూరు మండలంలో మొత్తం 60 మంది పోస్టల్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోగా వాటిలో ఒక్క ఓటు మాత్రమే చెల్లుబాటు అయిందని మిగిలిన 59 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించిన కోట్లు చెల్లుబాటు కాకపోవడంతో మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు, సిబ్బంది తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించింది. ఈ అవకాశాన్ని వినియోగించుకున్న 60 మంది ఓటర్లలో కేవలం ఒక ఓటు మాత్రమే చెల్లుబాటు కావడంతో మిగిలిన 59 పోస్టర్ బ్యాలెట్లు చెల్లుబాటు కాకపోవడంతో పలువురుని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లు చెల్లకపోవడంతో పలు సందేహాలకు తావిస్తోంది. ముఖ్యంగా ఉద్యోగస్తులే పోస్టల్ బ్యాలెట్లను సక్రమంగా వినియోగించలేక పోతే సామాన్యుల పరిస్థితి ఏంటని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పోస్టల్ బ్యాలెట్ల పై అవగాహన కల్పించి వాటిని సక్రమంగా వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

నూతన శ్రీ అయ్యప్ప స్వామి గోశాల నిర్మాణానికి సహకరించాలి

- దాతలు, భక్తులు ముందుకు రావాలి

- గోశాల కమిటీ చైర్మన్ సింగారెడ్డి నరసింహారెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక కడప--పులివెందుల బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించనున్న శ్రీ అయ్యప్ప స్వామి గోశాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని గోశాల కమిటీ చైర్మన్ సింగారెడ్డి నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ దొంతు సుమన్ కోరారు. దాతలు, భక్తులు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని శ్రీ వాసవి కల్యాణ మండపంలో గోశాల కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోశాల నిర్మాణం, గోవుల సంరక్షణకు అవసరమైన షెడ్లు, పశుగ్రాసం, తాగునీరు, వైద్య సదుపాయాల కల్పనపై చర్చించారు. గోవుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరి సహకారంతో గోశాలను అభివృద్ధి చేసి, గోవుల సంరక్షణతో పాటు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో శ్రీ అయ్యప్ప స్వామి గోశాల ట్రస్ట్ బోర్డు సభ్యులు నక్కా రాజరామ్, ప్రధాన కార్యదర్శి పుల్లగూర గోవర్ధన్, కమిటీ సభ్యులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల ఎంపీటీసీ జనసేన కూటమి అభ్యర్థి శీలంశెట్టి లక్ష్మయ్య గెలుపు సహకరించిన వారికి కృతజ్ఞతలు



ప్రజా భూమి పోరుమామిళ్ల :

పోరుమామిళ్ల ఎంపిటిసి స్థానాన్ని జనసేన పార్టీ కైవసం చేసుకుంది ఆ పార్టీ అభ్యర్థి షీలాబ్ శెట్టి లక్ష్మయ్య ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకి, జనసేన పార్టీ అధ్యక్షుడు ఉపరాష్ట్ర ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి జనసేన నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు మరియు బద్వేల్ తెదేపాఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి, కూటమి నాయకుల కృతజ్ఞతలు తెలియజేశారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణా డైరెక్టర్ రంతు, కలసపాడు జడ్పిటిసి విద్యావతి, ఈశ్వర్ రెడ్డి, సుబ్బారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణముఖి నదిలో యథేచ్ఛగా అక్రమ ఇసుక తవ్వకాలు!

పల్లమాల పరిధిలో జేసీబీలతో తవ్వకాలు.. ట్రాక్టర్లతో తరలింపు -- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం

ప్రజా భూమి ప్రతినిధి:-
బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలోని పల్లమాల వద్ద స్వర్ణముఖి నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పండుగ సెలవులను అదునుగా చేసుకుని కొందరు అక్రమ ఇసుక తవ్వకందారులు నదిలో యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జేసీబీల సహాయంతో నది గర్భంలో పెద్ద ఎత్తున గుంతలు తవ్వుతూ, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు చెబుతున్నారు. పగటిపూటే ఈ వ్యవహారం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సహజ వనరులకు నిలయమైన స్వర్ణముఖి నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపడితే భూగర్భ జలాలపై ప్రభావం పడటంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు స్పందించి పల్లమాల స్వర్ణముఖి నదిలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ ఇసుక తవ్వకాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసి, నదీ సంపదను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు. అధికారుల దృష్టికి ఈ అక్రమ ఇసుక తవ్వకాల వ్యవహారం చేరుతుందా? నదీ సంపదకు రక్షణ లభిస్తుందా? అన్నది వేచి చూడాలి.

మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు...

- ఉమ్మడి కడప జిల్లాలో 615 గ్రామ పంచాయతీలు, 6,136 పోలింగ్ కేంద్రాలు

ప్రజాభూమి, కడప అర్బన్

ఉమ్మడి కడప జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. జిల్లాలోని 39 మండలాల పరిధిలో 615 గ్రామ పంచాయతీలు, 5,960 వార్డులు, 6,136 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. మూడు విడతల్లో ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. మొదటి విడతలో బద్వేల్, రాజంపేట రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 13 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. వీటి పరిధిలో 169 గ్రామ పంచాయతీలు, 1,724 వార్డులు, 1,744 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో బద్వేల్ డివిజన్‌లో తొమ్మిది మండలాల పరిధిలో 110 పంచాయతీలు ఉన్నాయి. రెండో విడతలో కడప, పులివెందుల డివిజన్ల పరిధిలోని 13 మండలాల్లో 202 పంచాయతీలు, 1,948 వార్డులు, 2,024 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. మూడో విడతలో జమ్మలమడుగు, పులివెందుల డివిజన్ల పరిధిలోని మరో 13 మండలాల్లో 244 పంచాయతీలు, 2,288 వార్డులు, 2,368 పోలింగ్ కేంద్రాల ద్వారా ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తంగా మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణకు భారీ ఏర్పాట్లు అవసరం కానున్నాయి. ముఖ్యంగా అత్యధికంగా 244 పంచాయతీలున్న మూడో విడతపై ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

స్కాట్స్‌లో జిల్లా విద్యార్థికి రాజ్యపురస్కారం..!

- అభినందించిన కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి



ప్రజాభూమి, కడప కలెక్టరేట్

స్కాట్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో రాజ్యపురస్కారం అందుకున్న కడప జిల్లా విద్యార్థి ఎం. నరసింహుడును జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అభినందించారు. విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రాజ్యపురస్కార ధ్రువపత్రం అందుకున్న చెన్నూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్ విద్యార్థి ఎం. నరసింహుడు, ఆయనకు మార్గనిర్దేశం చేసిన స్కౌట్ మాస్టర్ వెంకటసుబ్బయ్య సోమవారం జిల్లా కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థి నరసింహులు, స్కౌట్ మాస్టర్ వెంకటసుబ్బయ్యను కలెక్టర్ అభినందించారు. చిన్న వయసులోనే క్రమశిక్షణ, సేవాభావం, పట్టుదలతో స్కౌట్స్‌లో ప్రతిభ చూపి రాజ్యపురస్కారం అందుకోవడంఎంతో సంతోషకరమన్నారు. విద్యార్థి సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, చదువుతో పాటు సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవర్చుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థి విజయానికి తోడ్పడిన స్కౌట్ మాస్టర్‌ను కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పాల్గొన్నారు.

ప్రజాభూమి
పోలవరం 11
మంగళవారం 10 నవంబరు 2026

పులి సంచారంతో ఏజెన్సీ గ్రామాల్లో కలకలం!

- సీతంపేట మిరప పొలాల నుంచి మొద్దులగూడెం అడవి వరకు చిరుత అడుగుజాడలు..
- భయాందోళనలో నాలుగు గ్రామాల ప్రజలు

ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం.

వి.ఆర్.పురం మండలంలోని పలు గ్రామాల పరిసర ప్రాంతాల్లో పులి సంచారం స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. వరుసగా రెండు రోజుల నుంచి పులి కదలికలు కనిపిస్తున్నాయన్న సమాచారంతో అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తమయ్యారు. ఆదివారం సీతంపేట గ్రామ సమీపంలోని మిరప పంట పొలాల్లో పులి సంచరించినట్లు స్థానికులు గుర్తించగా, సోమవారం మొద్దుల







గూడెం అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలు మరోసారి కనిపించినట్లు సమాచారం. కనిపించిన పాదముద్రలు సుమారు 6 నుంచి 7 అంగుళాల పరిమాణంలో ఉండటంతో స్థానికుల్లో ఆందోళన మరింత పెరిగింది. వరుసగా రెండు రోజుల పాటు వేర్వేరు ప్రాంతాల్లో పులి కదలికలు కనిపిస్తుండటంతో అది ఏ ప్రాంతంలో సంచరిస్తోంది? జనావాసాల వైపు వచ్చే ప్రమాదం ఉందా? అన్న సందేహాలు గ్రామస్తుల్లో నెలకొన్నాయి. చిరుత సంచారం కారణంగా చొక్కనపల్లి, శ్రీరామగిరి, సీతంపేట, మొద్దులగూడెం గ్రామాల ప్రజలు ముఖ్యంగా పొలాలకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు, అటవీ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పొలాలకు వెళ్లాలన్నా, అటవీ మార్గాల గుండా ప్రయాణించాలన్నా ప్రజలు జంకుతున్నారు. ముఖ్యంగా ఒంటరిగా ప్రయాణించేందుకు వెనుకాడుతున్నారు.

బొమ్మా బొరుసు, పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు!

రాజుపేటలో నలుగురు, గొల్లగూడెంలో ఇద్దరు అరెస్ట్.. రూ.42,500 నగదు, ఆట సామగ్రి స్వాధీనం

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

వి.ఆర్.పురం మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్థానిక పోలీసులు స్పష్టం చేస్తున్నారు. గ్రామాల శివార్లలో రహస్యంగా నిర్వహిస్తున్న జూద క్రీడలపై పోలీసులు నిఘా పెంచి వరుస దాడులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో బొమ్మా బొరుసు, పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. మండలంలోని రాజుపేట గ్రామ శివారులో బొమ్మా బొరుసు (కాయిన్ గేమ్) ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,500 నగదుతో పాటు ఆటకు ఉపయోగించే రెండు



రూపాయి బిళ్లలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గొల్లగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.40 వేల నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి మొత్తం ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ షేక్ సాదిక్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

జూద క్రీడలకు దూరంగా ఉండాలి!

గ్రామీణ ప్రాంతాల్లో జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు వ్యక్తిగత జీవితాలను దెబ్బతీయడమే కాకుండా కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులకు, సామాజిక సమస్యలకు కారణమవుతాయని పోలీసులు పేర్కొంటున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఇలాంటి ఆటలకు అలవాటు పడితే చివరకు అప్పులపాలై కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట, బొమ్మా బొరుసు వంటి జూద క్రీడలు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ షేక్ సాదిక్ సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగిస్తామని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే అసాంఘిక కార్యకలాపాల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు.

పులుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలి!

- అటవీ సరిహద్దు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు..
- పులి ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అటవీ అధికారుల సూచనలు.

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం రేంజ్ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాల్లో పులుల సంచారంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం అటవీ శాఖ అధికారులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల అటవీ ప్రాంతాల్లో పులుల సంచారం నేపథ్యంలో మానవ-వన్యప్రాణి సంఘర్షణను నివారించడం, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వి.ఆర్.పురం రేంజ్ అటవీ శాఖ





సిబ్బంది గ్రామస్థులకు పులుల సంచారం, వాటి అలవాట్లు, పులి ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన భద్రతా చర్యలపై వివరంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో ఒంటరిగా అటవీ ప్రాంతాలకు వెళ్లకూడదని, పులి కనిపించిన వెంటనే దాని దగ్గరకు వెళ్లడం, వెంటాడడం, రెచ్చగొట్టడం వంటివి చేయకూడదని సూచించారు. పులుల సంచారం ఉన్న ప్రాంతాల్లో పశువులను మేతకు తీసుకెళ్లవద్దని, పిల్లలు, పశువులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు. అలాగే రాత్రి వేళల్లో అటవీ మార్గాల్లో ప్రయాణించడం సాధ్యమైనంత వరకు నివారించాలని, పులుల సంచారంపై నిర్ధారణ కాని వార్తలు, వదంతులను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయవద్దని కోరారు. పులి కనిపించినా, పాదముద్రలు గుర్తించినా, పశువులపై దాడి జరిగినా వెంటనే అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. అటవీ శాఖ అధికారులు జారీ చేసే భద్రతా మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, మానవ ప్రాణాలకు, వన్యప్రాణులకు ఎలాంటి హాని కలగకుండా అటవీ శాఖకు గ్రామస్థులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

కార్యకర్తల శ్రమ,ప్రజల ఆశీర్వాదమే నా విజయం..

ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటా

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి అహర్నిశలు శ్రమించిన పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు,శ్రేయోభిలాషుల సహకారం ఎన్నటికీ మరువలేనని లక్కొండ ఎంపీటీసీగా ఘన విజయం సాధించిన మడకం శివదొర అన్నారు ఎన్నికల ప్రచార సమయంలో రాత్రింబవళ్లు భారీ వర్షాలను సైతం లెక్కచేయ

ఎంపీటీసీ మడకం శివదొర

కుండా పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు తనను తమ బిడ్డగా భావించి,నిండు మనసుతో ఆశీర్వ దించి ఓటు వేసి గెలిపించిన ఓటరు దేవుళ్లందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని,ఎల్లప్పుడూ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వా మిగా ఉంటూ గ్రామంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ మరోసారి హృదయపూర్వక అభినందనలు,కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు 12 స్థిర నిఘా బృందాల ఏర్పాటు

మూడు విడతల్లో ఎన్నికలు.. ప్రతి మండలానికి ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్‌తో బృందం

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు 2026 లో భాగంగా గ్రామ పంచాయతీల రెండవ సాధారణ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందనీ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె దినేష్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని 12 మండలాలకు ఒక్కొక్క ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ తో కూడిన 12 స్థిర నిఘా బృందాలను ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడత నవంబర్ 26న అడ్డతీగల, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లో , రెండవ విడతలో దేవీపట్నం, గంగవరం, గుర్తేడు, రంపచోడవరం మండలాల్లో నవంబర్ 29న, మూడవ విడతలో చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఏటపాక మండలాల్లో డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఆయా విడతల్లో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం, ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన వంటి కార్యక్రమాలను నిర్ణీత తేదీల్లో నిర్వహించనున్నారు. పోలింగ్ రోజున ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

అక్రమ నగదు, మద్యం, బహుమతుల రవాణాపై నిరంతర నిఘా

స్థిర నిఘా బృందాలు తమ పరిధిలోని ప్రధాన రహదారులు, ఆర్టీరియల్ రోడ్లు, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ మద్యం, పెద్ద మొత్తంలో నగదు, బహుమతి వస్తువులు, మత్తు పదార్థాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి రవాణాపై నిరంతరం నిఘా ఉంచుతాయి. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉపయోగించే వస్తువుల గుర్తింపుతో పాటు సంఘ విద్రోహ శక్తుల కదలికలను కూడా పర్యవేక్షిస్తాయి. తనిఖీలన్నీ ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ సమక్షంలోనే నిర్వహించాలి. తనిఖీ ప్రక్రియ మొత్తాన్ని తేదీ, ప్రదేశం, బృందం నంబరు వివరాలతో వీడియో చిత్రీకరించి, మరుసటి రోజు రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. అభ్యర్థులు, వారి ఏజెంట్లు లేదా రాజకీయ పార్టీ కార్యకర్తలకు సంబంధించిన వాహనాల్లో రూ.50 వేల కంటే ఎక్కువ నగదు, ఓటర్లను ప్రలోభపెట్టే అవకాశం ఉన్న రూ.10 వేల కంటే ఎక్కువ విలువైన మద్యం, మత్తు పదార్థాలు, ఆయుధాలు, బహుమతి వస్తువులు లేదా ఇతర చట్టవిరుద్ధ వస్తువులు లభించినప్పుడు నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకోవాలన్నారు. అయితే వ్యాపార అవసరాలు, బ్యాంకు లావాదేవీలు, వైద్య చికిత్స, వివాహ కార్యక్రమాల కోసం నగదు తీసుకువెళ్లే వ్యక్తులు తగిన ఆధారాలు సమర్పించినప్పుడు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మినహాయింపులు వర్తిస్తాయన్నారు. తనిఖీల సమయంలో ప్రజల పట్ల అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, మహిళా అధికారిణి సమక్షం లేకుండా మహిళల పర్సులను తనిఖీ చేయరాదని స్పష్టం చేశారు. ఇతర శాఖలు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీల పునరావృతం కాకుండా సమీపంలోని ఎస్.ఎస్.టి. బృందం భాగస్వామ్యం కావాలి. బృందాలు ప్రతిరోజూ తమ కార్యకలాపాల



నివేదికలను పోలీసు సూపరింటెండెంట్‌తో పాటు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్, ఎన్నికల పరిశీలకులకు సమర్పించాలి. ఫ్లయింగ్ స్క్వాడ్లు కూడా ఎస్.ఎస్.టి. బృందాల పనితీరును పర్యవేక్షించాలి. జనరల్ అబ్జర్వర్, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్‌లతో సమన్వయం చేసుకుంటూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ఈ బృందాలు పనిచేస్తాయి. పోలింగ్‌కు ముందు చివరి 72 గంటల్లో, ముఖ్యంగా సున్నితమైన ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఎన్నికల తనిఖీలకు సంబంధించిన వీడియో రికార్డుల కాపీలను కోరుకునే ప్రజలు రూ.300 చెల్లించి పొందవచ్చనే విషయాన్ని కూడా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అన్ని బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు తావులేకుండా చూడాలని కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశించారు.

మలేరియా, డెంగ్యూ నివారణకు

దోమతెరలను తప్పనిసరిగా ఉపయోగించాలి

-వైద్యాధికారిణి ఓ.భావన



ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

మలేరియా,డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ దోమతెరలను తప్పనిసరిగా ఉపయోగించాలని గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఓ,భావన సూచించారు గంగవరం మండల పరిధిలోని గంగవరం గ్రామంలో వైద్యాధికారిణి,భావన ఆధ్వర్యంలో గ్రామస్థులకు దోమతెరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు దోమల వృద్ధిని అరికట్టేందుకు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రతిరోజూ దోమతెరలను ఉపయోగించడం ద్వారా దోమకాటుకు దూరంగా ఉండి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు అనంతరం గ్రామస్థులకు దోమతెరల ఉపయోగాలు,వాటిని సరైన పద్ధతిలో ఎలా ఏర్పాటు చేసుకోవాలి,ఎలా ఉపయోగించాలి,ఎలా భద్రపరుచుకోవాలనే అంశాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో యస్ యూఓ జి,సూరిబాబు,హెల్త్ అసిస్టెంట్లు బి,యోహాను,బి,శ్రీనివాసరావు,ఏఎన్ఎంలు కె.సుధారాణి,కె నారాయణమ్మ,ఆశా కార్యకర్త కె.రామాయమ్మతో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా

ర్యాలీ, న్యాయ అవగాహన సదస్సు

ఉచిత న్యాయ సహాయ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

జేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ ఎం. మురళి గంగాధర రావు

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం



జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రంపచోడవరం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత రంపచోడవరం గ్రామంలో న్యాయ అవగాహన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, జ్యుడీషి యల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం. మురళి గంగాధర రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో న్యాయ సేవాధికార సంస్థలు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు అందిస్తున్నాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడినవారు, అర్హులైన పేదలు, గిరిజనులు, మహిళలు, పిల్లలు, సీనియర్ సిటిజన్లు తదితరులు ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా మీడియేషన్ ఫర్ ది నేషన్ 3.0 కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. న్యాయస్థానాల్లో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, ఇరుపక్షాల అంగీకారంతో వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అమలు చేస్తున్న పథకాలైన మానవ అక్రమ రవాణా, వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ బాధితుల సహాయ పథకం, పేదరిక నిర్మూలన పథకాల సమర్థ అమలు, గిరిజనుల హక్కుల పరిరక్షణ, మాదకద్రవ్యాల దుర్వినియోగం బాధితుల పునరావాసం, సీనియర్ సిటిజన్ల సంక్షేమ పథకాలు, శిక్షా పథకాలపై అవగాహన కల్పించారు.విద్యార్థినులు, బాలికలకు వారి హక్కులు, బాధ్యతలపై ప్రత్యేకంగా వివరించారు. రాజ్యాంగ ఆవి ర్భావం, రాజ్యాంగ విలువలు, ప్రాథమిక విధులు, ఉచిత న్యాయ సహాయం ప్రాముఖ్యత, ఎన్డీపీ ఎస్ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం, పోక్సో చట్టం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాలను వివరించి, అనుచిత ప్రవర్తన ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.గ్రామ ప్రజలు, తల్లిదం డ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పిల్లల ప్రవర్తన, నడవడిక, భవిష్యత్తు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మేజిస్ట్రేట్ సూచించారు. పిల్లలకు చిన్ననాటి నుంచే మంచి విలువలు, క్రమశిక్షణ, చట్టాల పట్ల గౌరవం నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా సమాజంలో ప్రతి ఒక్కరూ తమ హక్కులను కాపాడుకుంటూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు వై. శ్రీనివాస రావు, ఏ.ఆర్.ఆర్. భగవాన్, టి. వీరబాబు, గౌరీశంకర్, పాఠశాల యాజమాన్యం, పోలీసు సిబ్బంది, కోర్టు సూపరింటెండెంట్ నాగభూషణం, కోర్టు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్

మంగళవారం, నవంబర్ 10, 2026

12

తుఫాన్ బాధిత 200 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

మానవతా దృక్పథంతో బాధితులకు అండగా ఫెయిత్ టెంపుల్ మినిస్ట్రీస్





మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి

తుఫాన్ ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ఫెయిత్ టెంపుల్ మినిస్ట్రీస్ అండగా నిలిచింది. తుఫాన్ కారణంగా జీవనోపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 200 నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారికి నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది.ఫెయిత్ టెంపుల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు దివంగత బిషప్ గాడెల్లి పరిశుద్ధ బాబు తనయుడు గాడెల్లి దేవిడ్ శామ్యూల్, శ్రీమతి కెంపు రత్నం ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.తుఫాన్ కారణంగా నిరుపేద కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తిం చి, ఆపత్కాలంలో వారికి అండగా నిలవాలనే మానవతా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కష్టకాలంలో బాధితులకు సహాయం అందించడం, ఆర్థికంగా ఇబ్బం దులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు తోడ్పాటు అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తు న్నామని పేర్కొ న్నారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి నిత్యావసర సరుకులు అందిం చిన ఫెయిత్ టెంపుల్ మినిస్ట్రీస్ నిర్వాహకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద కుటుం బాలకు ఆపన్నహస్తం అందిస్తూ మానవతా విలువలను చాటిన ఈ సేవా కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంది.

తాడేపల్లిగూడెం టీడీపీ సమావేశంలో ఉద్రిక్తత



❖ పెట్రోల్ పోసుకొని ఇద్దరు కార్యకర్తల ఆత్మహత్యా యత్నం.. అడ్డుకున్న నాయకులు ❖ పరిమి రవికుమార్ ఓటమిపై పార్టీలో అసంతృప్తి ❖ సొంత పార్టీ నేతలే ఓడించారంటూ పరిమి రవికుమార్ కన్నీరు

తాడేపల్లిగూడెం, ప్రజాభూమి ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ సమా వేశంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పరిమి రవికు మార్ ఓటమిపై పార్టీలోని కొందరు నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసం తృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ క్ర మం లో ఇద్దరు టీడీపీ కార్యక ర్తలు పెట్రో ల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, అక్కడున్న నాయకులు వారిని అడ్డుకున్నట్లు తెలిసింది.పరిమి రవికుమార్‌ను సొంత పార్టీ నేతలే ఓడించారని కొందరు తెలుగు తమ్ముళ్లు ఆరోపిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, తన ఓటమికి సొంత పార్టీ నాయకులే కారణమంటూ పరిమి రవికుమార్ భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నట్లు తెలిసింది.ఈ పరిణామాలతో సమావేశంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు సమాచారం. అయితే, ఈ ఘటనకు దారితీసిన పూర్తి వివరాలు, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కార్యకర్తల పరిస్థితిపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

ఘంటసాల మండలంలో కూటమి క్లీన్ స్వీప్

100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడం అభినందనీయం: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



ఘంటసాల, ప్రజాభూమి ప్రతినిధి:

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘంటసాల మండలంలో కూటమి బలపరిచిన టీడీపీ, జనసేన అభ్యర్థులు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలన్నింటినీ కైవసం చేసుకుని 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడం అభినం దనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మండలంలో కూటమి అభ్యర్థులం దరూ విజయం సాధించి క్లీన్ స్వీప్ చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఘంటసాల మండల కూటమి నాయకులను బుద్ధప్రసాద్ అభినందించారు. ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి కూటమి అభ్యర్థుల విజయానికి తోడ్పడిన నాయ కులు, కార్యకర్తలను ప్రశంసించారు.అనంతరం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో పాటు జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్‌లను కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, జనసేన మండల అధ్యక్షుడు కోన రాజశేఖర్, టీడీపీ సీనియర్ నాయకుడు పరుచూరి సుభాష్ చంద్రబోస్, డీసీ చైర్మన్ అయినంపూడి భానుప్రకాష్, తెలుగు యువత కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), డీసీ వైస్ చైర్మన్ పరిసే చలపతిరావు, మాజీ సర్పంచులు ముప్పనేని రవికుమార్, గాజుల శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు యార్లగడ్డ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీ అందజేత



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ ,పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ ఓ సీ ను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో 48 వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ నాయకులు దాడి మురళి కృష్ణతో కలిసి అందజేశారు. మల్లికార్జున పేటకు చెందిన వేల్పూరి దుర్గా భవాని, తన రెండు నెలల శిశువు అత్యవసర వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 5.45 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు. త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు...

మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి బ్యాలెట్ బాక్సుల పంపిణీకి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం





మచిలీపట్నం, (ప్రజాభూమి ప్రతినిధి): కృష్ణా జిల్లాలో మూడు దశల్లో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీ లించాలని స్పష్టం చేశారు.సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్‌తో కలిసి జిల్లా పంచాయతీ అధికారి, ఆర్డీవోలు, డీఎల్‌డీఓలు, ఇతర సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాలు, వార్డుల వారీగా ఓటర్ల విభజన, రిజర్వేషన్లు, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, నామినేషన్ల స్వీకరణ, సిబ్బంది నియామకం, శిక్షణ తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఓటర్ల జాబితాలు కీలకమని, ఓటర్ల వివరాలు, వార్డుల వారీగా మ్యాపింగ్‌లో ఎలాంటి తప్పులు లేకుండా మరోసారి పరిశీలించాలని సూచిం చారు. ఒక వార్డుకు చెందిన ఓటర్లు మరో వార్డు లో లేదా సంబంధం లేని పోలింగ్ కేంద్రంలో నమో దు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నా రు. గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రధాన గ్రామాలు, హామ్లెట్లకు సంబంధించిన ఓటర్ల విభజనను పరిశీలించి, ఓటర్లు తమకు కేటా యించిన వార్డులోనే ఓటు వేసేలా జాబితాలను సరిచేయాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాలపై క్షేత్రస్థాయి పరిశీలన

ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సంబంధిత బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) వ్యక్తిగతంగా సంద ర్శించి, భవనాల స్థితిగతులను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, దెబ్బతిన్న రేకుల షెడ్లు, తగిన వసతు లు లేని కేంద్రాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై నివేదిక సమర్పించాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలు ఎన్నికల నిర్వహణకు అనువుగా ఉన్నాయని ఎంపీడీఓలు ధ్రువీకరిం చాలని సూచించారు. కేంద్రాల మార్పులు అవస రమైతే నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకో వడంతోపాటు రాజకీయ పార్టీలకు ముందుగానే సమాచారం అందించాలని స్పష్టం చేశారు.

బ్యాలెట్ బాక్సుల తరలింపునకు ప్రత్యేక ప్రణాళిక

మూడు దశల ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సుల సంఖ్యను మండలాల వారీగా అంచనా వేసి, అందుబాటులో ఉన్నవి, అదనంగా అవసర మైన వాటి వివరాలతో స్పష్టమైన నివేదిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. బ్యా లెట్ బాక్సుల పంపిణీ, రవాణా, తిరిగి స్వీకరణకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.మొదటి దశ ఎన్నికలకు ప్రాధాన్యతనిస్తూ, మూడో దశకు అందుబాటులో ఉన్న బాక్సులను అవసరాల మేరకు మొదటి దశకు తరలించాలని సూచిం చా రు. తదుపరి దశల ఎన్నికలు పూర్తయ్యే కొద్దీ బాక్సులను అవసరాలకు అనుగుణంగా సర్దు బాటు చేయాలన్నారు. సమీప మండలాల మధ్యే బాక్సుల రవాణా జరిగేలా రూట్ మ్యాపిం గ్ రూ పొందించి, ప్రతి బాక్సు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలించాలి, ఏ మండలానికి అప్పగించాలనే వివరాలతో ప్రత్యేక రికార్డు నిర్వహించాలని ఆదేశించారు. బాక్సుల మరమ్మతులు, నిర్వహ ణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

బ్యాలెట్ పేపర్ల ముద్రణలో అప్రమత్తత అవసరం

పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా, గుర్తుల కేటాయింపునకు అనుగుణంగా బ్యాలెట్ పేపర్ల ముద్రణ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. చివరి నిమిషంలో అభ్యర్థుల సంఖ్యలో మార్పులు చోటుచేసుకున్నా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన రూట్ అధికారులు, జోనల్ అధికారులు, ఇతర సిబ్బంది నియామకంలో వివిధ శాఖల్లో అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థ వంతంగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల విధులకు నియమితులైన అధికారులకు, సిబ్బందికి తమ బాధ్యతలపై పూర్తి అవగాహన కల్పించేలా శిక్షణ అందించాలని ఆదేశించారు.సమావేశంలో జెడ్పీ సీఈవో ఎం. శ్రీహరి, బందరు, గుడివాడ ఆర్డీవోలు కే. సాంబశివరావు, జి. బాలసుబ్రమణ్యం, జిల్లా పంచాయతీ అధికారి, బందరు, గుడివాడ, ఉయ్యూరు డీఎల్‌డీఓలు పి. శ్రీనివాస్, సునీత శర్మ, పి. స్వర్ణలత, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

51వ డివిజన్‌లో గంజాయి బ్యాచ్‌ల సంచారం..

పోలీసులకు కార్పొరేటర్ అర్షద్ ఫిర్యాదు



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ నగరంలోని 51వ డివిజన్ పరిధిలో అర్ధరాత్రి వేళ గంజాయి బ్యాచ్‌లు ఎక్కువగా సంచరిస్తున్నాయని 51వ డివిజన్ కార్పొరేటర్ అర్షద్ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయంపై పార్టీ నాయకులతో కలిసి కొత్తపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐ కొండలరావును కలిసి పరిస్థితిని వివరించారు.డివిజన్ పరిధిలో రాత్రి సమయాల్లో గంజాయి బ్యాచ్‌ల ఆగడాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేసి గంజాయి వినియోగం, విక్రయాలకు పాల్పడు తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా శాంతిభద్రతలను కాపాడాలని, యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా పోలీస్ శాఖ తక్షణమే స్పందించాలని కార్పొరేటర్ అర్షద్ పోలీసులను కోరారు.

46వ డివిజన్‌లో టీడీపీ నూతన కార్పొరేటర్ కుంచం శ్యామల దుర్గారావుకు ఘన సన్మానం

కేక్ కటింగ్‌తో విజయోత్సవ సంబరాలు



ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ:

46వ డివిజన్ తెలుగుదేశం పార్టీ నూతన కార్పొరేటర్‌గా ఎన్నికైన కుంచం శ్యామల దుర్గారావును ఘనంగా సన్మానించి, కేక్ కటింగ్‌తో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. స్థానిక మాజీ కార్పొ రేటర్ సరిత కార్యాలయం నుంచి విజయోత్సవ ర్యాలీ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ కార్పొ రేటర్ సరిత మాట్లాడుతూ, మంచి మెజారిటీతో ఎన్డీఏ కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కుంచం శ్యామల దుర్గారావును గెలిపించిన డివిజన్ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 2014 నుంచి 2019 వరకు తమ హయాంలో డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, అనంతరం వైసీపీ కార్పొరేటర్ గెలిచిన తర్వాత డివిజన్ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని పేర్కొన్నారు. తిరిగి డివిజన్ అభివృద్ధి జరగాలనే సంకల్పంతో ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి ఎన్డీఏ అభ్యర్థిని గెలిపించడం సంతోషకరమని ఆమె అన్నారు.నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ కుంచం శ్యామల దుర్గారావు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన 46వ డివిజన్ ప్రజలంద రికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం డివిజన్‌లోని ప్రతి ప్రాంతాన్ని సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకుంటానని, వాటిని సంబంధిత అధికారుల దృష్టి కి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ అభివృద్ధికి నిరం తరం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కుంచం దుర్గారావు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెబోయిన ఈశ్వరరావు. శ్రీ కనకదుర్గ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్త మండలి సభ్యురాలు సుకాశి. సరిత , నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ సుకాసి కిరణ్ కుమార్.. బంక నాగమణి. ఈది నాగేశ్వరరావు. బెవర రవికుమార్. మహిళాడి విజన్ కమిటీ షేక్ బషీర్ బి. యాగటి అలివేలు. గేడి సత్యవతి. పండు నాగమణి. రాంపిళ్ల విమల. డివిజన్ కమిటీ సభ్యులు. మరియు కుటుంబ సభ్యులు తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

గోపు సత్యనారాయణ సమక్షంలో..నూతన జడ్పీటీసీ సభ్యులకు డిక్లరేషన్ ఫారాలు అందజేత



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం: మచిలీపట్నం నార్త్ జడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికైన లంకె ఉషారాణి, కోడూరు జడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికైన బొలిశెట్టి అరుణశ్రీ లకు కృష్ణా జిల్లా జడ్పీ సీఈఓ శ్రీహరి డిక్లరే షన్ ఫారాలను అందజేశారు.ఈ సంద ర్భం గా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ నూత నంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులకు శుభా కాంక్షలు తెలియజేస్తూ, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కా రానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.ప్రజల ఆశీస్సులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో సాధించిన ఈ విజయాలు మరింత బాధ్యతను పెంచాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గొర్రెపాటి గోపిచంద్, లంకె శేషగిరి, లంకె హరి, బండే శ్రీను, కాగిత శ్రీరామ్, అమిరెడ్డి శివయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

11 నుంచి ఎస్ఎస్సీ పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

❖ డిసెంబర్ 15 చివరి గడువు ❖ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి సూచన

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

మార్చి 2027లో నిర్వహించనున్న పదో తరగతి (ఎస్ఎస్సీ) సార్వత్రిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల పరీక్ష రుసుము చెల్లింపునకు ప్రభుత్వం గడువు ప్రకటించింది. ఈ నెల 11వ తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు వివిధ దశల్లో పరీక్ష రుసుము చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి వై.వి. సుబ్బారావు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేసిన ప్రకటన మేరకు, సాధారణ విద్యార్థులతో పాటు గతంలో ఒకసారి పరీక్షలో తప్పి తిరిగి హాజరయ్యే విద్యార్థులు కూడా నిర్ణీత గడువులోగా పరీక్ష రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల విద్యార్థుల వివరాలను యూడీఐ పాఠశాల ప్లస్ పోర్టల్‌లో ముందుగా పరిశీలించి, సరిచూసిన అనంతరం అధికారిక వెబ్‌సైట్ ద్వారా రుసుము చెల్లించాలని సూచించారు.

పరీక్ష రుసుము చెల్లింపు గడువులుః- నవంబర్ 11 నుంచి నవంబర్ 25 వరకు:* ఎటువంటి అపరాధ రుసుము లేకుండా.- నవంబర్ 26 నుంచి డిసెంబర్ 2 వరకు:* రూ.50 అపరాధ రుసుముతో.- *డిసెంబర్ 3 నుంచి డిసెంబర్ 9 వరకు: రూ.200 అపరాధ రుసుముతో.- డిసెంబర్ 10 నుంచి డిసెంబర్ 15 వరకు: రూ.500 అపరాధ రుసుముతో.

పరీక్ష రుసుముల వివరాలు:- అన్ని సబ్జెక్టులకు హాజరయ్యే సాధారణ విద్యార్థులకు రూ.125.- మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు హాజరయ్యే విద్యార్థులకు రూ.125.- మూడు సబ్జెక్టుల వరకు హాజరయ్యే విద్యార్థులకు రూ.110.- వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు అదనంగా రూ.60.- వయోపరిమితి సడలింపు కోరే విద్యార్థులకు రూ.300.

ప్రధానోపాధ్యాయులు గమనించాల్సిన అంశాలు:పరీక్ష రుసుమును వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ ద్వారా మాత్రమే చెల్లించాలి. సీఎఫ్ఎంఎస్ లేదా బ్యాంకు చలానాల ద్వారా చెల్లించిన రుసుములను అంగీకరించరు. సర్వర్‌పై అధిక భారం పడకుండా ఉండేందుకు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే రుసుము చెల్లించాలని సూచించారు.ప్రభుత్వం ప్రకటించిన గడువులను ఎట్టి పరిస్థితు ల్లోనూ పొడిగించబోమని స్పష్టం చేశారు. మాన్యువల్ నామినల్ రోల్స్ (ఎంఎన్ఆర్)లను ఎలాంటి పరిస్థితుల్లోనూ సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. వృత్తి విద్యా విద్యార్థుల పరీక్ష రుసుమును సైతం ఇదే వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు.కృష్ణా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ సూచనలను తప్పనిసరిగా పాటించాలని, అర్హులైన ప్రతి విద్యార్థి నిర్ణీత గడువులోగా పరీక్ష రుసుము చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖా ధికారి వై.వి. సుబ్బారావు కోరారు.

ఆత్మహత్య చేసుకుంటున్నానంటున్న మహిళ వీడియో.. సకాలంలో స్పందించిన వన్ టౌన్ పోలీసులు

ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ



విజయవాడ ఇంద్రకీలాద్రి పరిసర ప్రాంతాల్లో ఒక మహిళ ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ సెల్ఫీ వీడియో విడుదల చేసింది తను చనిపోయిన తర్వాత తన పిల్లలను తన తల్లిదండ్రులకు అప్పు చెప్పాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ఒక వ్యక్తిగా విడుదల చేసింది వీడియో పరిసర ప్రాంతాలను గుర్తించిన వన్ టౌన్ పోలీసులు తక్షణమే స్పందించి ఇంద్రకీలాద్రి పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టగా మహా మండపం కింద మహిళ ఉన్నట్లు గుర్తించి తనకు న్యాయం జరిగే విధంగా చేస్తామని చెప్పి పోలీసులు మహిళలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్కు తరలించారు సకాలంలో స్పందించిన వన్ టౌన్ కానిస్టేబుల్ పూర్ణవన్ టౌన్ ఔట్ పోస్ట్ కానిస్టేబుల్ రాజేశ్వరరావు వన్ ట్రాఫిక్ కానిస్టేబుల్ నాయక్ హోంగార్డు ఈశ్వరి లను సీఐ గుణరామ్ అభినందించారు.

కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజవర్గం కోడూరు మండలంలో మందపాకల గ్రామం నుంచి కోడూరు వరకు పోలీస్ కవాతు



ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ

పంచాయతీ ఎన్నికలు నేపథ్యంలో ప్రజలలో భద్రతా భావం కలిగించేందుకు కోడూరు మండలంలో సోమవారం సబ్ డివిజన్ స్థాయిలో పోలీసుల కవాతు (ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. అవనిగడ్డ డిఎస్పీ రావూరి అభిషేక్, సీఐ యువ కుమార్ సబ్ డివిజన్ పరిధిలోని అందరు ఎస్ఐ లు 60 మంది పోలీస్ సిబ్బంది తో ఈకవాతులో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా కోడూరు మండల వ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాలైన మందపాకల, జరుగువానిపాలెం, కోడూరులో ప్రజలకు అవగాహన పలు సెక్షన్లపై, ఎన్నికల కోడ్ అమలు ఉన్నప్పుడు ప్రజలు పాటించాల్సిన విధి విధానాలు గురించి వివరించడం జరిగిందన్నారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677.

ప్రజాభూమి
జనరల్ 13
మంగళవారం 10 నవంబర్ 2026

ఆత్రేయపురం జెడ్పీటీసీగా గూడపాటి శ్రీనివాసరావు

- 10,002 ఓట్ల భారీ మెజారిటీ
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నమ్మకాన్ని నిలబెడతా - గూడపాటి

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఆత్రేయపురం: స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయాన్ని నమోదు చేసింది. ఆత్రేయపురం మండల జెడ్పీటీసీగా టీడీపీ అభ్యర్థి గూడపాటి శ్రీనివాసరావు 10,002 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కప్పల శ్రీధర్‌పై స్పష్టమైన ఆధిక్యంతో గెలుపొందారు. ఈ నేపథ్యంలో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద సీఈవో పి. వసంత మాధవి చేతుల మీదుగా గూడపాటి శ్రీనివాసరావు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గూడపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తనపై విశ్వాసం ఉంచి భారీ మెజారిటీతో గెలిపించిన టీడీపీ శ్రేణులకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. 10,002 ఓట్ల మెజారిటీతో ప్రజలు అందించిన ఈ విజయాన్ని వ్యక్తిగత గెలుపుగా కాకుండా, తనపై ఉంచిన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆత్రేయపురం మండల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అందుబాటులో ఉంటానని గూడపాటి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ర్యాలి గ్రామ టీడీపీ అధ్యక్షుడు పెండెం వెంకన్న పాల్గొన్నారు.



ఆకాంక్షలకు అనుగుణంగా అందుబాటులో ఉంటానని గూడపాటి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ర్యాలి గ్రామ టీడీపీ అధ్యక్షుడు పెండెం వెంకన్న పాల్గొన్నారు.



ఆత్రేయపురం జెడ్పీటీసీగా గూడపాటి శ్రీనివాసరావు

- 10,002 ఓట్ల భారీ మెజారిటీ
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నమ్మకాన్ని నిలబెడతా - గూడపాటి

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట


స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయాన్ని నమోదు చేసింది. ఆత్రేయపురం మండల జెడ్పీటీసీగా టీడీపీ అభ్యర్థి గూడపాటి శ్రీనివాసరావు 10,002 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కప్పల శ్రీధర్‌పై స్పష్టమైన ఆధిక్యంతో గెలుపొందారు. ఈ నేపథ్యంలో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద సీఈవో పి. వసంత మాధవి చేతుల మీదుగా గూడపాటి శ్రీనివాసరావు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గూడపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తనపై విశ్వాసం ఉంచి భారీ మెజారిటీతో గెలిపించిన టీడీపీ శ్రేణులకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. 10,002 ఓట్ల మెజారిటీతో ప్రజలు అందించిన ఈ విజయాన్ని వ్యక్తిగత గెలుపుగా కాకుండా, తనపై ఉంచిన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆత్రేయపురం మండల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అందుబాటులో ఉంటానని గూడపాటి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ర్యాలి గ్రామ టీడీపీ అధ్యక్షుడు పెండెం వెంకన్న పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్
- దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో నూతన ఎంపీటీసీలు,జెడ్పీటీసీలకు అభినందన సభ

ప్రజాభూమి దెందులూరు

స్థానిక సంస్థల ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులు సాధించిన విజయంతో దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో సందడి నెలకొంది. నియోజకవర్గంలోని నాలుగు జెడ్పీటీసీ స్థానాలతో పాటు 66 ఎంపీటీసీ స్థానాల్లో విజయం సాధించిన నూతన ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పదవులు అలంకారం కాదని, ప్రజలకు మరింత బాధ్యతగా సేవ చేసేందుకు లభించిన గొప్ప అవకాశమని అన్నారు.ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ,కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ,అభివృద్ధి ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు.కూటమి విజయానికి కృషి చేసిన నాయకులు,కార్యకర్తలకు అభినందనలు తెలియజేస్తూ, ఘనవిజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు,టీడీపీ,బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



లక్ష్మీపురం 1వ సెగ్మెంట్ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కలసిన యువనేత సింహాద్రి వికాస్

ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి చల్లపల్లి మండలం లక్ష్మీపురం 1వ సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన ఫణితపు మల్లేశ్వరరావుని, పలువురు పార్టీ నాయకులను కలసిన అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మరియు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు తనయులు యువనేత సింహాద్రి వికాస్, అధికార కూటమి ఎన్ని ప్రలోభాలకు గురి చేసిన వారి బెదిరింపులకు లొంగకుండా పార్టీ కోసం కష్ట కాలంలో పని చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని, మళ్ళీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో వైసీపీకి మూడు ఎంపీటీసీ స్థానాలు

- దూసరపాము, జడ్డంగి, చెరుకుంపాలెంలో వైసీపీ అభ్యర్థుల ఘన విజయం

రాజవొమ్మంగి ప్రజా భూమి

స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజవొమ్మంగి మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఉనికిని చాటుకుంది. మూడు ఎంపీటీసీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించి ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు. దూసరపాము ఎంపీటీసీ స్థానంలో కనిగిరి లలితకుమారి, జడ్డంగి ఎంపీటీసీ స్థానంలో చినబోయిన నాగమణి, చెరుకుంపాలెం ఎంపీటీసీ స్థానంలో కోటం దుర్గాదేవి విజయాన్ని అందుకున్నారు. మూడు వేర్వేరు ప్రాంతాల్లో పార్టీ అభ్యర్థులకు ఓటర్లు మద్దతు పలకడంతో వైసీపీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గ్రామస్థాయిలో ప్రజల మద్దతుతో గెలుపొందిన ఈ ముగ్గురు అభ్యర్థులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేస్తున్నారు. ఆయా గ్రామాల అభివృద్ధిలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు ఎలాంటి పాత్ర పోషిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అన్నవరం విద్యార్థి



ప్రజాభూమి ప్రతినిధి - నూజివీడు


నూజివీడు మండలము అన్నవరం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థి చప్పల. బాలరాజు 9వతరగతి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుడివాడ కె.కె. ఆర్. గౌతమ్ స్కూల్ లో నిర్వహించిన వాలీబాల్ సెలక్షన్స్ లో అండర్ 17 వాలీ బాల్ కు సెలెక్ట్ అయినాడని పాఠశాలప్రధానోపాధ్యాయని విజయకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యనీ ఉపాధ్యాయులు క్రీడాకారుడు బాలరాజును మరియు ఫిజికల్ డైరక్టర్ రవీంద్ర నుఅభినందించారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి : జర్నలిస్టుల భద్రతకు భరోసా కల్పించాలి

- జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి
- ఏపీడబ్ల్యూజేఎఫ్ కృష్ణా జిల్లా కమిటీ

ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ

నెల్లూరు జిల్లా కావలిలో ఈనాడు దినపత్రిక జర్నలిస్ట్ సుబ్బారావుపై గుర్తుతెలియని 5 గురు వ్యక్తులు కర్రలు, రాళ్లతో విచక్షణారహితంగా దాడి చేసిన ఘటనను (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కృష్ణాజిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తు సోమవారం అవనిగడ్డ తాసిల్దార్ డి. అంకాలు, అవనిగడ్డ డిఎస్పి రావూరి అభిషేక్ లకు అర్జీ అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నా.రవిశంకర్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కావలిలోని పెదపవని రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్ దాటిన అనంతరం బైక్‌పై వెళ్తున్న విలేకరి సుబ్బారావును అడ్డగించి దాడికి పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని గతంలోనూ తనపై దాడికి ప్రయత్నాలు జరిగాయని, ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ మరోసారి దాడి జరగడం జర్నలిస్టుల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కౌంటింగ్ కేంద్రం వద్ద జరిగిన వాగ్వాదానికి ఈ దాడికి ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలోనూ సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా భావించే పత్రికా రంగం ప్రజా సమస్యలను, ప్రభుత్వ పాలనలోని లోటుపాట్లను, అక్రమాలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి సేవలందిస్తోంది. అటువంటి పాత్రికేయులపై దాడులు చేయడం, బెదిరించడం, విధి నిర్వహణకు ఆటంకం కలిగించడం ప్రజాస్వామ్య విలువలపై దాడి చేయడమే అవుతుంది అని వెంటనే దీనిపై తగిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కోరుతున్నాను అన్నారు. అలాగే జర్నలిస్టులపై దాడులను నిరోధించేందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక జర్నలిస్ట్ అటాక్ ప్రివెన్షన్ కమిటీ ని ఏర్పాటు చేయాలని విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించడంతో పాటు, దాడులకు గురైన జర్నలిస్టులకు అవసరమైన న్యాయ, వైద్య సహాయం అందించాలి. జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వ్యక్తులపై రాజకీయ, సామాజిక ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడుతూ, ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి. కావున, ఈ వినతిపత్రాన్ని సంబంధిత ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి పంపించి, జర్నలిస్టులపై దాడుల నిరోధానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు, పాత్రికేయుల రక్షణకు తగిన చర్యలు తీసుకునేలా సహకరించాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అవనిగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు అలపర్తి గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి లంకే శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కుంపటి బాబురావు, కోశాధికారి మోపిదేవి అమ్మయ్య, అవనిగడ్డ నియోజకవర్గం జర్నలిస్టులు ఇమ్మిడిశెట్టి వెంకట్, సామర్ల మల్లికార్జునరావు, కంచర్లపల్లి వెంకట నాంచారయ్య, కైతేపల్లి చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.





రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీకృష్ణ రాజును మర్యాదపూర్వకంగా కలిసిన జగ్గంపేట వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాతంశెట్టి సూర్యచంద్ర

ప్రజా భూమి, ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని మురళిరాజు నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, సీనియర్ నాయకులు శ్రీ ముదునూరి మురళీకృష్ణ రాజును జగ్గంపేట వైఎస్సార్‌సీపీ నాయకులు పాతంశెట్టి సూర్యచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముదునూరి మురళీకృష్ణ రాజుతో పాతంశెట్టి సూర్యచంద్ర భేటీ అయ్యారు. ఈ మర్యాదపూర్వక సమావేశంలో ఇరువురు నాయకులు పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఈ భేటీ ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో చోటుచేసుకుంది.

జనసేన ఎంపీటీసీ విజేతలకు ఘన సన్మానం..

- పెంటకోట మోహన్
- పోటీ చేసిన అన్ని స్థానాల్లో జనసేన అభ్యర్థుల విజయం - 100 శాతం స్ట్రైక్‌రేట్ సాధించామని వెల్లడి

ప్రజా భూమి, ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలంలో ఇటీవల జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించిన అభ్యర్థులకు ఘన సన్మానం నిర్వహించారు. లింగంపర్తి సొసైటీ చైర్మన్, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు పెంటకోట మోహన్ ఏలేశ్వరంలోని తన నివాసంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విజేతలకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రవరం ఎంపీటీసీ విజేత గంగిరెడ్ల గనిలక్ష్మి మణికంఠ, సిరిపురం లింగంపర్తి-1 నుంచి విజయం సాధించిన కోన అనురాధ శ్రీను, తిరుమాలి నుంచి మాగాపు భాగ్యలక్ష్మి వీరబాబు, సిరిపురం నుంచి అచ్చే శశికళ వీరబాబులను పెంటకోట మోహన్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పెంటకోట మోహన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త మేడిశెట్టి బాబీ ఆశీస్సులతో అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచి విజయం సాధించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో ఆదరణ పొందాయని, ఫలితంగా జనసేన అభ్యర్థులు భారీ మెజార్టీలతో గెలుపొందారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మేడిశెట్టి బాబీ నాయకత్వంలో జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించి 100 శాతం స్ట్రైక్‌రేట్ నమోదు చేసిందని పెంటకోట మోహన్ వెల్లడించారు. విజయం సాధించిన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఎన్నికల నిర్వహణలో పూర్తిగా విఫలమైన రాష్ట్ర ఎన్నికల సంఘం

- పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



ప్రజాభూమి, బుట్టాయిగూడెం

రాష్ట్రంలో పరిషత్ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలమైందని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శించారు. బుట్టాయిగూడెంలో పోలవరం నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం పోలవరం మాజీ శాసనసభ్యుడు తెల్లం బాలరాజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున 90 మంది ఎంపీటీసీ అభ్యర్థులు, 7 గురు జడ్పీటీసీ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారని, వారిలో 28 మంది ఎంపీటీసీ అభ్యర్థులు, ముగ్గురు జడ్పిటిసి అభ్యర్థుల విజయం సాధించారని చెప్పారు. రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు ఎక్కడా నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుతంగా జరగలేదని ఆయన విమర్శించారు. పోలీసు వ్యవస్థను తమ చేతుల్లో పెట్టుకుని చంద్రబాబు నాయుడు ఎన్నికలు నిర్వహించారని, రాష్ట్ర ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించకుండా అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసిందని ఆరోపించారు. ముఖ్యంగా టీ.నర్సాపురం మండలంలోని ఎంపీటీసీ-2 సెగ్మెంట్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉమ్మడి తేజ 29 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినప్పటికీ, ఫలితాన్ని తారుమారు చేసేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. ప్రజల ఓటుతో గెలవలేక అధికారాన్ని, పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని గెలుపు సాధించామనుకోవడం ప్రజాస్వామ్య విజయం కాదనీ ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెల్లం బాలరాజు స్పష్టం చేశారు.

భోగాది రమాదేవికి జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వాలి!

- నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) జాతీయ ఉపాధ్యక్షుడు బడే ప్రభాకర్

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

భారతీయ జనతా పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు, నిస్వార్థ ప్రజా సేవకు మరోపేరు భోగాది రమాదేవికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించాలని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) న్యూఢిల్లీ జాతీయ ఉపాధ్యక్షుడు బడే ప్రభాకర్ కోరారు. బీజేపీ ఆవిర్భావం నుంచి పార్టీకి విధేయులుగా కొనసాగుతున్న ప్రతిష్ఠాత్మక కుటుంబం నుంచి వచ్చిన ఆమె, గత నాలుగు దశాబ్దాలుగా పార్టీకి విశిష్ట సేవలు అందిస్తున్న నిబద్ధత కలిగిన ఆదర్శ నాయకురాలని కొనియాడారు. జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పిస్తే కృష్ణా జిల్లాలో పార్టీ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేయడంతో పాటు, ఆ పదవికే వన్నె తీసుకురాగల సమర్థురాలని పేర్కొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

మంగళవారం 10 నవంబర్ 2026

రెబల్ అభ్యర్థుల వల్లే.. ఎన్డీఏకు నష్టం! లేకుంటే విజయం మాదే

- జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్

ప్రజాభూమి ప్రతినిధి,జీలుగుమిల్లి



జీలుగుమిల్లి మండలంలో ఈనెల 7న జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సమన్వయ లోపం, రెబల్ అభ్యర్థుల పోటీ కారణంగానే ఎన్డీఏ కూటమికి ఆశించిన ఫలితాలు దక్కలేదని జనసేన జిల్లా కార్యదర్శి, మాజీ జడ్పీటీసీ గడ్డమణుగు రవికుమార్ అన్నారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ మూడు పార్టీల మధ్య మిత్రధర్మం పాటించకపోవడం వైసీపీ విజయానికి దోహదపడిందన్నారు. జీలుగుమిల్లిలో జనసేన అభ్యర్థికి వ్యతిరేకంగా బీజేపీ నాయకుడు, దర్భగూడెంలో బీజేపీ అభ్యర్థికి వ్యతిరేకంగా జనసేన రెబల్ అభ్యర్థులు పోటీలో నిలవడం, రాచన్నగూడెంలో జనసేన అభ్యర్థికి పోటీగా టీడీపీ రెబల్ అభ్యర్థి బరిలో ఉండటం వల్ల కూటమి ఓట్లు చీలిపోయాయని పేర్కొన్నారు. ఈ స్థానాల్లో సమన్వయంతో వ్యవహరించి ఉంటే ఐదు ఎంపీటీసీ స్థానాలతో పాటు ఎంపీపీ పీఠాన్ని కూడా ఎన్డీఏ కైవసం చేసుకునేదని అభిప్రాయపడ్డారు. అంకన్నగూడెంలో కేవలం ఏడు ఓట్ల తేడాతో ఓటమి చెందామని, గిరిజన ప్రాంతాల్లో పార్టీ గుర్తుపై అవగాహన లేకపోవడం, 158 ఓట్లు చెల్లకుండా పోవడం కూడా ఫలితాన్ని ప్రభావితం చేశాయన్నారు. వీటన్నిటి పైన ఆత్మ పరిశీలన చేసుకుంటామని అన్నారు. రానున్న పంచాయితీ ఎన్నికలలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళదామని అన్నారు.

ప్రమాదంలో గాయపడిన బాధితురాలికి సీఎం చెక్కు అందజేత



ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట

చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో కామవరపుకోట మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన నల్లమోతుల మహాలక్ష్మి ప్రమాదంలో గాయపడింది. ఆమె ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సీఎం, రిలీఫ్ ఫండ్ నుండి రూ. 65,818/- మంజూరు చేయించి అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. బాధితురాలికి బ్యాంకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్బూరి సూర్యప్రకాశరావు, నల్లమోతుల నాగార్జున, అబ్బూరి లక్ష్మీనారాయణ, వడ్లపూడి దుర్గా ప్రసాద్, వాకా చిరంజీవి, అబ్బూరి శ్రీధర్, నల్లమోతుల ఫణీకుమార్ పాల్గొన్నారు.

ఏలూరు మేయర్ రెడ్డి అప్పలనాయుడుకు

పాస్టర్స్ ఫెడరేషన్ ఘన సన్మానం



ప్రజాభూమి – ఏలూరు సిటీ

పాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరు నగర మేయర్‌గా విజయం సాధించిన కూటమి అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడుకు ఘనంగా అభినందన సభ నిర్వహించారు.ఈ సందర్భంగా పాస్టర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు, పెద్దలు మేయర్ ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ పెద్దలు మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలను దగ్గరగా తెలుసుకుంటూ,ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన నాయకుడు రెడ్డి అప్పలనాయుడు మేయర్‌గా విజయం సాధించడం సంతోషకరమన్నారు.ఆయన నాయకత్వంలో ఏలూరు నగరం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ,వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.అనంతరం మేయర్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ తనపై పాస్టర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు చూపిన ప్రేమాభిమానాలకు, ఆదరణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఏలూరు నగర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు,ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ అభినందన సభ ఆత్మీయ వాతావరణంలో జరిగింది.పాస్టర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు,పలువురు ప్రముఖులు పాల్గొని మేయర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అభినందనలు

ప్రజా భూమి, ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజాని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా విజయం సాధించిన ప్రజాప్రతి నిధులకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తూ, నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజయం సాధించిన ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే సూచించారు.

పరిషత్ ఎన్నికల్లో జనసేన 100 శాతం స్ట్రైక్‌రేట్‌తో పాలకొల్లు ఆదర్శంగా నిలిచింది

- జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ అధినేత పవన్ కళ్యాణ్, మంత్రి నిమ్మలకు కృతజ్ఞతలు
- జనసేన జిల్లా నేత చినబాబు, పార్లమెంట్ ప్రతినిధి రామలింగేశ్వర రావు

ప్రజాభూమి ప్రతి నిధి,పాలకొల్లు





పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో జనసేన పార్టీ 10 ఎంపీటీసీలు, ఒక జడ్పీటిసి స్థానంలో విజయం సాధించి నూటికి నూరు శాతం స్ట్రైక్ రేట్ సాధించిందని, దీనికోసం కృషి చేసిన జనసేన పార్లమెంటు స్థాయి కమిటీ ప్రతినిధులు, అసెంబ్లీ స్థాయి కమిటీ ప్రతినిధులకు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బోనం వెంకట నరసయ్య చినబాబు అభినందనలు తెలిపారు. అదేవిధంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, మంత్రి నిమ్మల రామానాయుడు కోరినచోట్ల కాదనకుండా సీట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పాలకొల్లు లైన్స్ కమ్యూనిటీ హాల్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని చినబాబు మాట్లాడారు. నియోజకవర్గ నేత బన్నీ వాసు నేతృత్వంలో తుల రామలింగేశ్వర రావు, కమిటీ ప్రతినిధులు అంతా జెడ్పిటిసి,ఎంపీటీసీ అభ్యర్థుల విజయానికి కృషి చేయడం జరిగిందని, ఇదే స్ఫూర్తితో రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో కూడా కష్టపడి పనిచేయాలని జనసేన నాయకులకు వీర మహిళలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జెడ్పిటిసిగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన కొడవటి నాగలక్ష్మి వరబాబు లను, పదిమంది ఎంపీటీసీలును పరిచయం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న జనసేన పార్లమెంటు కమిటీ ప్రతినిధి తుల రామలింగేశ్వర రావు మాట్లాడుతూ కావాల్సిన చోట జనసేన ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థుల ఎంపికకు సహకరించిన అధినేత పవన్ కళ్యాణ్, మంత్రి నిమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు. మూడు రోజులపాటు బన్నీ వాసు సూచనలతో అభ్యర్థులను గెలిపించడం జరిగిందన్నారు. 100% స్ట్రైక్ రేట్ తో బలమైన నాయకత్వంగా పాలకొల్లు నిలిచిందన్నారు. వీర మహిళ జుత్తి గ రియా మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో 100% స్ట్రైక్ రేట్ ద్వారా నాయకత్వలోపం లేదని నిరూపణ అయిందని, ఇందుకు తనకు ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. నూతన ఎలమంచిలి జడ్పిటిసి కొడవటి నాగలక్ష్మి వరబాబు మాట్లాడుతూ తాను,తన భర్త రెండుసార్లు ఓటమి పాలైనప్పటికీ నాకు అధినేత పవన్ కళ్యాణ్ మళ్లీ టికెట్ ఇవ్వడం, ఎలమంచిలి మండల ప్రజలు 15,147 ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించడం తాను ఎంతగానో ప్రజలందరికీ రుణపడి ఉంటానని, వారికి సేవలు అందించి, పార్టీ బలోపేతంకు కృషి చేసి నా రుణాన్ని తీర్చుకుంటానని హామీ ఇచ్చారు.

జనసేన కమిటీ ప్రతినిధి ఉన్నమట్ల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ జెడ్పిటిసి, ఎంపిటిసి అభ్యర్థులను గెలిపించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పినిశెట్టి శ్రీనివాస్ స్వాగతం పలికిన ఈ సమావేశంలో డేగల సత్తి కొండ, విన్నుకోట గోపి, చిదగం సురేంద్ర, అంబటి విజయ్ కుమార్, సిరిగినీడి రాంబాబు, పితాని వెంకటేష్, షేక్ వలి, మేడిచర్ల క్రాంతి మానస, అరుణ దేవి, సాయి లక్ష్మీ, మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల మధ్య కుటుంబ సమేతంగా

దీపావళి సంబరాల్లో పాల్గొన్న మంత్రి నిమ్మల

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు



మానసిక దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వులు నింపుతూ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుటుంబ సమేతంగా దీపావళి వేడుకలు జరుపుకున్నారు. పాలకొల్లులోని అంజలి మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల, ఆయన కుటుంబ సభ్యులు విద్యార్థులకు నూతన వస్త్రాలు, దీపావళి బాణాసంచా సామాగ్రి, స్వీట్లు, పండ్లు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి బాణాసంచా కాల్చి వారిలో ఆనందోత్సాహాలు నింపారు. కుటుంబానికి దూరంగా వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులతో ఆప్యాయంగా గడుపుతూ వారిని సంతోషపరిచారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. అభం శుభం తెలియని చిన్నారులైన మానసిక దివ్యాంగ విద్యార్థులతో కలిసి దీపావళి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్న వీరితో కలిసి పండుగ జరుపుకోవడం ద్వారా తమ కుటుంబ సభ్యులతోనే దీపావళి జరుపుకున్నామనే ఆత్మీయ భావన వారిలో కలుగుతుందన్నారు. దైవ స్వరూపులైన మానసిక దివ్యాంగులను ఆదరించడం, అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి ఇలాంటి విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి నిమ్మల కుటుంబ సభ్యులు గోమాతకు దానా వేసి పూజలు నిర్వహించారు. ఆప్యాయత, అనురాగాల మధ్య అంజలి పాఠశాలలో దీపావళి వేడుకలు ఆనందంగా సాగాయి.

ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారం ఎటిఎ లక్ష్యం

- ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు

ప్రజాభూమి, బుట్టాయగూడెం



రెండు తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఆదివాసి ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ (ఎ టి ఎ) నిర్విరామ కృషి చేస్తుందని ఎ టి ఎ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఆదివాసి టీచర్ అసోసియేషన్ (ఎ టి ఎ) 16వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ఎటిఎ పతాకాన్ని ఎగురవేసిన జలగం రాంబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆదివాసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనదైన శైలిలో చురుకైన పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల, సంక్షేమం కోసం అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. జి ఓ నెం-3 స్థానంలో ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం కోసం పోరాటం చేస్తుందని చెప్పారు. ఉపాధ్యాయ సమస్యల తో పాటు ఆదివాసి సమాజం ఎదుర్కొంటున్న సామాజిక సమస్యల పరిష్కారానికి బాధ్యతమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. త్వరలో రాబోయే డీఎస్సీ లో, ఉపాధ్యాయ నియామకాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, ఏజెన్సీ ప్రాంతంలో నూటికి నూరు శాతం గిరిజనులకి దక్కేలా ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ అకుంఠిత దీక్షతో పని చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తెల్లం రాములు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సోదెం రాజు, జిల్లా అధ్యక్షుడు సరియం నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజం రమేష్, జిల్లా సహాధ్యక్షుడు తెల్లం గంగరాజు, మండల ప్రధాన కార్యదర్శి పూసం రమేష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అమృత అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో

ఘనంగా అమావాస్య అన్నదానం

- 1200 మందికి అన్నప్రసాద వితరణ

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

అమృత అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ స్వామి అయ్యప్ప సంకల్పంతో, బ్రహ్మశ్రీ ఘంటసాల వెంకట మురళి స్వామివారి ఆశీస్సులతో అమావాస్య మహా అన్న సమారాధన కార్యక్రమం ఆదివారం మచిలీపట్నం కోనేరు సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1200 మందికి అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ నెల అన్నదాన కార్యక్రమానికి కట్ట రామ్ చరణ్ తేజ, మేలిశెట్టి సుబ్రహ్మణ్యం, చెక్క గోపీనాథ్, పొట్లూరి నరేంద్ర దాతలుగా వ్యవహరించి తమ వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నవంబర్ 10వ తేదీ నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు ప్రతిరోజూ అయ్యప్ప స్వాములు, భవానీ మాలధారులు, శివదీక్షాపరుల కోసం కార్తీక మాస అన్న సమారాధన (సద్ది) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నప్రసాదం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోక సత్యనారాయణ, మహరెడ్డి సత్యనారాయణ, కోన ప్రసాద్, సమితి కార్యదర్శి సుంకర సూరిబాబు, అయ్యప్ప స్వాములు, భవానీ మాలధారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దీపాల వెలుగుల్లో వి.ఆర్.పురం మండలం..

అంబరాన్నంటిన దీపావళి సంబరాలు!

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

వి.ఆర్.పురం మండల వ్యాప్తంగా దీపావళి పండుగను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. దీపాల కాంతులు, రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలు, బాణసంచా శబ్దాలతో మండలంలోని గ్రామాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. ప్రతి ఇంటా దీపాలు వెలిగించి, లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ సంపద, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రజలు ప్రార్థించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని వడ్డీ కులస్తులు తమ సంప్రదాయ ఆచారాల ప్రకారం నోములు నోచుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. లక్ష్మీదేవిని పూలతో, పండ్లతో, దీపాలతో అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. కుటుంబాల్లో ఐశ్వర్యం, అభివృద్ధి, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకున్నారు.

పోలవరంలో ఇండిపెండెంట్ అభ్యర్థి విజయోత్సవ ర్యాలీ

ప్రజాభూమి ప్రతినిధి – చాట్రాయి



ఐదో తేదీన జరిగిన ఎంపీటీసీ ఎన్నికలలో చాట్రా యి మండలం పోలవ రం గ్రామంలో ఇండి పెండెంట్ అభ్యర్థి పానుగంటి రజిని, వైసీపీ, టీడీపీ అభ్య ర్థులపై ఘన విజయం సాధించారు.ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాను గంటి బ్రదర్స్ మహేష్ మాట్లాడుతూ అను కోని కానీ, స్వతహాగా నేను రాజకీయాల్లోకి రాలేదని, విధి రాత వలననో, లేదా కాల ప్రభావం వలననో దైవ ప్రభావం వలననో ఈ గ్రామ రాజకీయాల్లో అడుగుపెట్టడంజరిగిందన్నారు. దైవాన్ని ప్రజలను నేను నమ్మి విశ్వసిస్తున్నాను, గ్రామంలో అనేక స్వచ్ఛంద కార్యక్రమా లు చేసి ఉన్నాము కాబట్టే స్వచ్ఛమైన రాజకీయం ఎలా ఉంటుందో చూపిం చాలనే గ్రామ రాజకీ యాల్లో కి వచ్చామని తెలిపారు.ప్రజలకు ప్రామిస్ చేసినట్లుగానే పోలవరం బొడ్డురాయి ప్రతిష్ట పంచాయతీ ఎన్నికల అనంతరం 2027లో చేస్తానని ప్రత్యేకంగా హామీ ఇస్తున్నట్లు తెలిపారు. ఎవరిని కూడా ఈ గ్రామంలో అభివృద్ధి చేయలేదని విమర్శిం చడం లేదని, కానీ దైవం, ధర్మం ఈరెండు ఉన్నాయనిగుర్తించమని మాత్రమే ఈ గ్రామ సీనియర్ రాజకీయ నాయకులను అడుగు తున్నామని అన్నారు. మేము అభివృద్ధికి ఆటంకం కాదని, కానీ అవినీతి లేని అభివృద్ధినికోరుకుంటున్నామని అన్నారు. చాలా విమర్శలు వారిపై వచ్చాయని, పసుపు కుంకుమనిమ్మకాయలతో రాజకీయం చేస్తు న్నారని కొంతమంది సీనియర్ రాజకీయ నాయకులు విమర్శిం చారని,పసుపుకుంకుమ నిమ్మకాయలు వేద పురాణాల్లోనూ, వేదాలుకుదైవం,ధర్మం తెలిసిన వారికి వాటి విలువ శక్తిస్వరూపిణి అయినా అమ్మవారికి ప్రతీక అనే విషయం తెలియని వారు తెలు సుకొని మాట్లాడితే బాగుంటుందని చురక లు వేశారు. ఎన్నోఅవ మానాలు, కష్టాలు భరించామని కానీ ఒకే ఒక విషయంలో తాను బాధపడ్డానని కాదు భయపడ్డానని ఎలక్షన్ అయ్యాకచెట్టు కొకరు పుట్టుకొకరు అవుతారని, మటన్ షాపులో కత్తులతో నరుకుతామని నాతో నడిచిన కార్యకర్తలని బెదిరించిన సందర్భాలు చాలా ఉన్నాయని ఒకే ఒక్క విషయంలో బయపడిన భగవంతుడి ఆశీస్సులు ప్రజల నమ్మకం ప్రజల ఆశీస్సులతో గెలుపు ముంగిట మమ్ములను నిలబెట్టిన పోలవరం గ్రామ ప్రజలకు నా జన్మంతం రుణపడి ఉంటానని హామీ ఇచ్చారు. ఈ గ్రామం లో మంచినీళ్ల ప్లాంట్ నిర్మించాలని మార్కె ట్ యార్డ్ వద్ద ఉన్న మంచినీటి పైప్ లైన్ కనీసం సెంటర్ వరకు తీసుకు రావా లనేదే హై ప్రజలు టిడిపి సీని యర్ నాయకులు, కార్యకర్తలు అభిమా నులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.